www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 4-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 260

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా. 10.01 తదుపరి షష్ఠి; నక్షత్రం: శతభిషం రా. 9.23 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: తె. 3.29-5.01; దుర్ముహూర్తం: ఉ. 6.50-8.18; అమృతఘడియలు: మ. 2.28-4.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.50 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చైనాలో కొత్త వైరస్ కలకలం

హెచ్‌ఎంపీవీ విజృంభణ.. ఆస్పత్రులకు జనం

సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

శీతాకాలంలో శ్వాసకోశ సమస్యలు సహజం

2001లోనే హెచ్‌ఎంపీవీ.. సీజనల్ వ్యాధే: చైనా

చైనాలో మనసును చదివే యంత్రం 2



చైనాలో రోగులతో కిటకిటలాడుతున్న ఓ ఆస్పత్రి

విష వలయం!

వ్యసనాల ఉచ్చులో యువత



చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ఓ యువకుడు గంజాయికి బానిసగా మారాడు. అలాగే సోమల మండలంలో మరో ఇద్దరు విద్యార్థులు కూడా డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. ఆర్థిక సమస్యలతోపాటు.. గంజాయి, డ్రగ్స్ అందుబాటులో లేక ఈ ముగ్గురూ ఆత్మహత్య చేసుకున్నారు.

విజయవాడలోని క్రీస్తురాజపురం ప్రాంతానికి చెందిన రాంబాబు (20)కు తల్లిదండ్రులు లేరు. అమ్మమ్మ వద్ద ఉంటూ పీవీపీ మాల్‌లోని ఓ షాపులో పనిచేసేవాడు. బెట్టింగ్‌లకు బానిసై లోన్ యాప్‌ల్లో అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మూడు నెలల క్రితం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మొగల్రాజపురానికి చెందిన జగదీశ్ ఇంజనీరింగ్ చదివేవాడు. ఆన్‌లైన్ గేమింగ్‌కు బాగా అలవాటుపడి భారీగా అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం కానరాక గత ఏడాది ఆగస్టులో కృష్ణా నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

గంజాయికి బానిసలై అడ్డదారులు

ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు అలవాటు

లోన్ యాప్‌లు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వలలో చిక్కుకుని జీవితాలు నాశనం

అప్పుల పాలై.. ఆపై ఆత్మహత్యలు

బాధిత కుటుంబాల్లో తీరని విషాదం



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

గంజాయి, బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి అనేక మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు! తొలుత గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడడం, ఆ క్రమంలోనే ఆన్‌లైన్ గేమ్‌లు ఆడడం, అందుకోసం లోన్ యాప్‌లలో, మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో అప్పులు చేయడం, ఆ అప్పులు తీర్చలేక.. బలవన్మరణాలకు పాల్పడటం! ఇదో మృత్యు వలయం! ఈ వ్యసనాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడే వారు కొందరైతే... హత్యలు చేస్తున్న వారు ఇంకొందరు! చోరీల వంటి నేరాలకు పాల్పడేవారూ ఉన్నారు. నగరాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఈ జాడ్యం అన్ని ప్రాంతాలకూ చాప కింద నీరులా విస్తరిస్తోంది. ముఖ్యంగా సాంకేతికత

మిగతా 12వ పేజీలో...



హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు సమాఖ్య సభల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం చంద్రబాబు

ఆలోచనలే పెట్టుబడి!

దానితోనే సంపద సృష్టించాలి

పైసా ఖర్చు పెట్టకుండా హెచ్ఐసీసీ నిర్మాణం

దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణలోనే

ఏపీ అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి

ప్రపంచ తెలుగు సమాఖ్య సభల్లో సీఎం చంద్రబాబు కీలకోపన్యాసం

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలే పెట్టుబడిగా సంపదను సృష్టించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. సంపద సృష్టించాలంటే డబ్బే ప్రధానం కాదన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో తెలుగుదేశం పాత్ర కీలకమని.. ఒక్క ఆలోచనతో రూపాయి ఖర్చు పెట్టకుండా హెచ్ఐసీసీ నిర్మాణం జరిగిందని చెప్పారు. ఆంధ్ర, తెలంగాణలో ఉండే తెలుగువారి కంటే విదేశాల్లో ఉంటున్నవారే తెలుగు భాషను, సంప్రదాయాలను కాపాడుతున్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారమిక్కడ ప్రారంభమైన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహాసభలో చంద్రబాబు

మిగతా 13వ పేజీలో...

స్వర్ణాంధ్ర చేసి చూపిస్తా

సంపద సృష్టిలో ఏపీని ముందుకు తీసుకెళతా

గణపతి సచ్చిదానందను దర్శించుకున్న సీఎం

విజయవాడ ఆశ్రమంలో చంద్రబాబు పూజలు

చంద్రబాబు మంచి కర్మయోగి: సచ్చిదానంద 14



అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎమ్మెల్యేల ఫ్లెక్సీకి నిర్వాసితుల క్షీరాభిషేకం

పరిహారం పండగ

పోలవరం నిర్వాసితులకు ఒకేరోజు రూ.815 కోట్లు

ఎన్నో ఏళ్ల ఎదురుచూపులకు కొత్త ఏడాది వేళ తెర

అనూహ్యంగా పరిహారాల చెల్లింపు

నిర్వాసితుల్లో పెల్లుబికిన సంతోషం

ఊరూరా సంబరాలు.. పాలాభిషేకాలు

ఏలూరు/కుక్కునూరు/రంపచోడవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయి ఎన్నో ఏళ్లగా పరిహారం కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితులకు శుక్రవారం ఉదయం తీపికబురు అందింది. ఉదయం 8 గంటల నుంచి వారి ఖాతాల్లో పరిహారం జమ అవుతుండడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. 2017 అక్టోబరులో చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే పోలవరం నిర్వాసితుల ఖాతాల్లో భూముల పరిహారం రూ.800 కోట్లు జమ అయింది. ఇప్పుడు మళ్లీ ఏడేళ్ల తర్వాత ఆయన సారథ్యంలోని కూటమి సర్కారు హయాంలోనే ఒకే రోజు ఇంకో రూ.815 కోట్లు

మిగతా 13వ పేజీలో...

విమానాశ్రయాలకు తెలుగుదనం

సాంస్కృతిక చిహ్నాలతో సొబగులు



కూచిపూడి కళాకృతులతో గన్నవరం విమానాశ్రయం నమూనా

గన్నవరం, భోగాపురంలలో కూచిపూడి నృత్య ఆకృతులు

బెజవాడ ఎయిర్‌పోర్టులో అమరావతి థీమ్ సైతం

సంప్రదాయం ఉట్టిపడేలా డిజైన్ల తయారీ

జూన్ నాటికి గన్నవరం విస్తరణ పూర్తి కావాలి

2026 జూన్‌నాటికి భోగాపురం అందుబాటులోకి..

కొత్తగా మరో ఏడు విమానాశ్రయాల నిర్మాణం

ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న విమానాశ్రయాలను, కొత్తగా కట్టేవాటినీ, ప్రతిపాదన దశలో ఉన్నవాటినీ తెలుగుదనం ఉట్టిపడేలా ముస్తాబు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విమానాశ్రయంలోకి అడుగుపెట్టిన ప్రయాణికులకు అడుగడుగునా సంప్రదాయం కళ్లకు కట్టాలని సూచించారు. ఆ విధంగా డిజైన్లు సిద్ధంచేయాలని సూచించారు. గన్నవరం ఎయిర్‌పోర్టు టెర్మినల్‌లో కూచిపూడి నృత్య ఆకృతులు, అమరావతి థీమ్ ఉండేలా ఆకృతులు ఉండాలన్నారు. శుక్రవారం రాష్ట్రంలోని విమానాశ్రయాలపై పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మౌలిక

మిగతా 13వ పేజీలో...

తెలుగులోనూ ప్రభుత్వ ఉత్తర్వులు

కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం 12

ఇంగ్లిష్‌తో పాటు తెలుగులో జీవోల జారీకి ఆదేశం

అనువాద బాధ్యతలు డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్స్‌కు

ఉత్తర్వులు జారీ చేసిన జీఏడీ ముఖ్య కార్యదర్శి

ఇక ఏటా టీచర్ల బదిలీలు



త్వరలోనే చట్టం.. వారంలో ముసాయిదా బిల్లు

బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ ముందుకు

ఉపాధ్యాయ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సంవత్సరం బదిలీలు చేపట్టాలని నిశ్చయించింది. ఇందుకోసం చట్టమే తీసుకురానుంది.

ప్రతి వేసవిలోనూ బదిలీల ప్రక్రియ

తప్పనిసరి బదిలీల్లో టీచర్లకు 8 ఏళ్లు, హెచ్‌ఎంలకు 5 ఏళ్ల సర్వీసు

ముసాయిదాపై మళ్లీ అభిప్రాయ సేకరణ

ఆ తర్వాత బిల్లుకు తుది రూపం

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విధానంలో టీచర్ల బదిలీలపై స్పష్టత లేకుండా పోయింది. ఏటా చేయాలా.. లేదా? చేస్తే ఏ సమయంలో చేయాలనే దానిపై గందరగోళం నెలకొంది. ప్రతిసారీ టీచర్ల వినతులు, ప్రభుత్వ అభీష్టం ఆధారంగా రెండు మూడేళ్లకోసారి బదిలీలు చేస్తూ వస్తున్నారు. అది కూడా కొన్నిసార్లు విద్యాసంవత్సరం మధ్యలో బదిలీలకు తెరతీసి గందరగోళం చేస్తున్నారు. ఇక నుంచి ఆ పరిస్థితి లేకుండా ప్రతి ఏటా కచ్చితంగా

మిగతా 14వ పేజీలో...

పేదలకు ఆరోగ్య ధీమా

1.43 కోట్ల కుటుంబాలకు రక్ష

ప్రతి కుటుంబానికీ 25 లక్షల ఆరోగ్య భరోసా

మరో ఎన్నికల హామీ అమలుకు శ్రీకారం

ఏప్రిల్ 1నుంచి హైబ్రిడ్ పద్ధతిలో ఆరోగ్య బీమా

వివరాలు వెల్లడించిన మంత్రి సత్యకుమార్

ఇకపై రూ.2.5 లక్షల లోపు వైద్య క్లెయిమ్‌లు బీమా కంపెనీల పరిధిలోకి

పేదల ప్రీమియం మొత్తం కట్టనున్న ప్రభుత్వం

ఆపై, రూ.25 లక్షల వరకు భరించనున్న ఎన్టీఆర్ వైద్యసేవల ట్రస్ట్

ఆరు గంటల్లోనే ప్రీ-ఆథరైజేషన్‌కు అనుమతి

వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని ముంచేసింది

మాకు వారసత్వంగా రూ.2,225 కోట్ల బకాయిలు సంక్రమించాయి: మంత్రి



అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ఎక్కడికీ పోలేదని, ఎన్టీఆర్ వైద్య సేవ పేరుతో మరింత మెరుగైన సేవలు అందించేలా దానిని రూపొందించామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నగదు రహిత చికిత్సల్లో హైబ్రిడ్ విధానం అమలు చేస్తామని చెప్పారు. దీని వల్ల 1.43 కోట్ల కుటుంబాల్లోని

మిగతా 13వ పేజీలో...

త్వరలో '22ఏ'పై నిషేధం ఎత్తివేత

పేదల ఇళ్ల పట్టాలు, భూములకే విముక్తి

22ఏ జాబితాలో 1.88 కోట్ల ఎకరాలు

దేవదాయ, ప్రభుత్వ భూములు పోనూ 11

పేదలకు అసైన్డ్ చేసిన వాటికి ప్రయోజనం

గ్రామం యూనిట్‌గా రీ సర్వే కొనసాగింపు

అవసరమైన చోట భూముల ధరలు పెంపు

రెవెన్యూ సదస్సులో మంత్రి అనగాని వెల్లడి

పట్టణ ప్రజలకు ఊరట

భవన, లేఅవుట్ల అనుమతుల బాధ్యత మున్సిపాలిటీలకే.. త్వరలో ఆర్డినెన్స్ జారీ 2



2

అల్లు అర్జున్‌కు ఊరట

షరతులతో కూడిన బెయిల్ మంజూరు

అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదు

ప్రతి ఆదివారం పోలీసుల ఎదుట హాజరు

తొక్కిసలాట కేసులో కోర్టు ఆదేశం



ఎల్లుండి విచారణకు రండి!

కాకినాడ సీపోర్టు వాటాల వ్యవహారంలో విజయసాయికి మళ్లీ ఈడీ నోటీసులు

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టులో కేవీరావు వాటాలను బలవంతంగా లాక్కున్న కేసులో సోమవారం విచారణకు రావాలంటూ వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటికే ఈడీ ఒకసారి

మిగతా 13వ పేజీలో...

వైద్య కోర్సుల సీట్లు ఖాళీగా ఉండకూడదు

3 నెలల్లో విధానాన్ని రూపొందించండి

రాష్ట్రాలతో చర్చించండి

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం 2



పరిహారం చెల్లింపులో జాప్యమా.. మార్కెట్ రేటు చెల్లించాల్సిందే

పాత ధరల ప్రకారమే పరిహారం అంటే '300ఏ' అధికరణను ఉల్లంఘించినట్టే

భూసేకరణ ప్రక్రియలో వ్యవధి కీలకం: సుప్రీం



లక్ష్యం పూర్తయ్యాక జాతీయ పతాకంతో శ్యామల

సంద్రంలో సాహస యాత్ర

150 కి.మీ. అలవోకగా ఈదిన 52 ఏళ్ల స్విమ్మర్ శ్యామల

విశాఖ నుంచి ఈదుకుంటూ కాకినాడ తీరానికి రాక 14


ఏడు రోజులు అలుపెరుగక ఈత

ఆసియాలోనే మొదటి స్విమ్మర్‌గా ఘనత

పరిహారం ఇవ్వడంలో ఆలస్యమైతే..

మార్కెట్ రేటు చెల్లించాల్సిందే: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 3: ఎప్పుడో 2003లో సేకరించిన భూమికి.. 2011నాటి ధరల ప్రకారం రేటు నిర్ధారించి.. ఆ సొమ్మును 2019లో చెల్లిస్తామంటే కుదరదని సుప్రీంకోర్టు తెల్చిచెప్పింది! అధికారుల కారణంగా పరిహారం చెల్లింపులు ఆలస్యమైతే.. ఆ పరిహారం చెల్లించేనాటికి సదరు భూములకు మార్కెట్ రేటు ఎంత ఉంటే అంత చెల్లించాల్సిందేనని, అలా మార్కెట్ ధరను పొందే హక్కు భూయజమానులకు ఉంటుందని స్పష్టం చేసింది. బెంగళూరు-మైసూరు మౌలిక వసతుల నడవా ప్రాజెక్టు (బీఎంఐసీపీ) కోసం 22 ఏళ్ల క్రితం భూములు సేకరించినా ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపి ఈ కీలక తీర్పు ఇచ్చింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు చేపట్టిన భూసేకరణలో భూములను కోల్పోయి ఏళ్లు గడుస్తున్నా పరిహారం అందని రైతులు, సామాన్యపౌరులకు ఉపశమనం ఇచ్చే తీర్పు ఇది. బీఎంఐసీపీ కోసం కర్ణాటక పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి బోర్డు (కేఐఏడీబీ) 2003లో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది. కేఐఏడీ చట్టం ప్రకారం 2005 నవంబరులో భూసేకరణ చేపట్టింది. సేకరణ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా భూయజమానులకు పరిహారం చెల్లించలేదు. పదహారేళ్ల తర్వాత ఎట్టకేలకు 2019లో పరిహారం ఇచ్చారు. కానీ.. 2011 నాటి మార్కెట్ రేట్లు ఇచ్చారు! దీంతో భూయజమానులంతా బెర్నార్డ్ ఫ్రాన్సిస్ జోసెఫ్ అనే వ్యక్తి నేతృత్వంలో కోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో తీవ్రంగా స్పందించిన ధర్మాసనం..." వారు 22 ఏళ్లుగా పలుమార్లు కోర్టు తలుపులు తడుతూనే ఉన్నారు. వారివైపు నుంచి ఎలాంటి అలసత్వం లేదు. రాష్ట్ర ప్రభుత్వ/కేఐఏడీబీ అధికారుల సోమరితనం కారణంగానే ఇంత ఆలస్యమయింది. అదీ కోర్టు ధిక్కరణ నోటీసులు ఇచ్చాకనే అధికారులు స్పందించారు. 2019 ఏప్రిల్ 22న.. భూమికి ఇవ్వాల్సిన మార్కెట్ ధరను ప్రత్యేక భూసేకరణ అధికారులు నిర్ణయించారు. కాబట్టి అప్పటి మార్కెట్ రేటు ప్రకారమే ఇప్పుడు పరిహారం చెల్లించాలి" అని ఆదేశించింది. ఒకవేళ 2003 నాటి ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తే అది న్యాయాన్ని, ఆస్తి హక్కు రక్షణకు ఉద్దేశించిన రాజ్యాంగంలోని 300ఏ అధికరణాన్ని అపహాస్యం చేసినట్టవుతుందని వ్యాఖ్యానించింది. 2019 ఏప్రిల్ 22 నాటి మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని, మొత్తం నష్టపరిహారాన్ని లెక్కించాలని సూచించింది. 2నెలల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భూ సేకరణ అధికారిని ఆదేశించింది. ఈ నిర్ణయం నచ్చకపోతే సవాలు చేసే హక్కు ఇరు పార్టీలకూ ఉందని పేర్కొంది.



రాష్ట్రాలకు మూలధన వ్యయ రుణాలు

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కీలకమైన మూలధన వ్యయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడ్డాయని కేంద్రం గుర్తించింది. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ మొత్తంలో మూలధన వ్యయ రుణాలను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ రుణాలన్నీ వడ్డీ లేనివే కావడం గమనార్హం. మొత్తంగా రూ.1.5 లక్షల కోట్లను ఎలాంటి వడ్డీ లేకుండా మంజూరు చేయనుంది. దీనిలో రూ.95 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంస్కరణల ఆధారంగా ఇస్తారు. మరో రూ.35 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులకు కేటాయిస్తారని కేంద్ర ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. కాగా, షరతులతో కూడిన మూలధన వ్యయ రుణాలకు కూడా కేంద్రం నిబంధనలను సడలించింది. 10 శాతం కంటే మించి మూల ధన వ్యయాన్ని చేసిన రాష్ట్రాలకు గతంలో రూ.25 వేల కోట్ల మేరకు నిధుల కేటాయింపు జరుగుతుండగా ఇప్పుడు 10 శాతం ఖర్చు పెట్టిన రాష్ట్రాలకు కూడా ఈ నిధులు కేటాయిస్తారు. పట్టణ ప్రణాళికలను అమలు చేసిన రాష్ట్రాలకు మరో రూ.5 వేల కోట్లను కేటాయించనుంది. ప్రకృతి విపత్తులకు గురైన రాష్ట్రాలకు అదనపు నిధులను కేటాయించాలని నిర్ణయించింది.

రైల్వే గ్రూప్ డి ఉద్యోగాలకు టెన్త్ పాస్ చాలు

న్యూఢిల్లీ, జనవరి 3: రైల్వే శాఖలో పలు విభాగాల్లోని లెవల్-1(గ్రూప్ డి) ఉద్యోగాల భర్తీకి విద్యార్హతలను సడలిస్తూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. నూతన ప్రమాణాల ప్రకారం.. పదో తరగతి లేదా ఐటీఐ డిప్లొమా లేదా నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ట్రైనింగ్(ఎన్‌సీవీటీ) జారీ చేసిన జాతీయ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్(ఎన్‌ఏసీ) కలిగిన ఎవరైనా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. రైల్వే శాఖలోని పలు విభాగాల్లో పాయింట్స్‌మెన్, అసిస్టెంట్, ట్రాక్ మెయింటెయినర్ సహా 32 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ ఉద్యోగాలకు ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు.

తల్లిదండ్రుల అనుమతి ఉంటేనే 'సోషల్' ఖాతా!

న్యూఢిల్లీ, జనవరి 3: పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతా తెరవాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని కేంద్రం ప్రతిపాదిత డిజిటల్ డేటా రక్షణ చట్టం నిబంధనల్లో పేర్కొంది. సంబంధిత సామాజిక మాధ్యమ సంస్థలు పిల్లల వ్యక్తిగత వివరాలు నమోదు చేయడానికి ముందే వారి తల్లిదండ్రుల ఆమోదం(వెరిఫైయబుల్ కన్సెంట్) తీసుకోవాలని నిబంధనల్లో పేర్కొంది. ఈమేరకు వ్యక్తిగత డిజిటల్ డేటా రక్షణ నిబంధనల డ్రాఫ్టును విడుదల చేసింది. ఫిబ్రవరి 18 తర్వాత దీనిపై తుది నిర్ణయం తీసుకొంటారు.

180 కి.మీ. వేగంతో వందే భారత్ స్లీపర్

న్యూఢిల్లీ, జనవరి 3: వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడానికి రైల్వే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తాజా పరీక్షలో వందేభారత్ స్లీపర్ రైలు 180 కి.మీ. వేగాన్ని అందుకుంది. దీనికి సంబంధించిన వీడియోను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్‌లో షేర్ చేశారు. రెండు బెర్తుల మధ్య ఉన్న ట్రేపై ఉంచిన మొబైల్ రైలు ప్రయాణ వేగాన్ని సూచిస్తోంది. దాని పక్కనే నీళ్లు నిండుగా పోసిన గాజు గ్లాసు ఉంది. రైలు 170 కి.మీ. నుంచి క్రమంగా 180 కి.మీ. వేగానికి చేరుకోవడాన్ని, అంత వేగంలోనూ చుక్క నీరు తొలక్కపోవడాన్ని ఆ వీడియోలో స్పష్టంగా చూడవచ్చు. కోట, లబాన్ స్టేషన్ల మధ్య 30 కి.మీ. దూరం ఈ పరీక్షకు వేదికయింది. జనవరి 1న రోహల్ కుర్ద్, కోటా మధ్య 40 కి.మీ. దూరం ఉన్న ట్రాక్‌పై ఇదే మాదిరి పరీక్ష నిర్వహించారు. ఆరోజు కూడా రైలు ఇదే వేగాన్ని అందుకుంది.

అల్లు అర్జున్‌కు షరతులతో బెయిల్ మంజూరు

హైదరాబాద్, జనవరి3(ఆంధ్రజ్యోతి): పుష్ప2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ దగ్గర డిసెంబరు నాలుగున జరిగిన తొక్కిసలాట ఘటనలో హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం నాంపల్లిలోని రెండో మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు అదనపు న్యాయమూర్తి వినోద్ కుమార్ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ఏ-11గా ఉన్న అర్జున్ ప్రస్తుతం హైకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌పై ఉండగా తాజాగా నాంపల్లి కోర్టు షరతులతో కూడిన సాధారణ బెయిల్ ఇచ్చింది. పోలీసులు పూర్తి చార్జిషీట్ దాఖలు చేసే వరకు 2 నెలల పాటు అల్లు అర్జున్ ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చిక్కడపల్లి పోలీసుల ఎదుట విచారణకు హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని.. రూ.50 వేల విలువ గల రెండు పూచీకత్తులు సమర్పించాలని పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులను, ఘటనతో సంబంధమున్న సాక్షులను ప్రభావితం చేయవద్దని అల్లు అర్జున్‌కు సూచించింది.

పట్టణ ప్రజలకు ఊరట

- భవన, లేఅవుట్ల అనుమతుల బాధ్యత మున్సిపాలిటీలకే
- అనుమతులు సరళతరం... త్వరలో ఆర్డినెన్స్ జారీ

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఏపీలోని పట్టణ ప్రజలకు మున్సిపల్ శాఖ ఊరటనిచ్చింది. పట్టణాభివృద్ధి అథారిటీలకు భవనాల నిర్మాణాలు, లేఅవుట్లకు అనుమతులిచ్చే అధికారం తొలగించి మున్సిపాలిటీలకు అప్పగించింది. ఇప్పటి వరకు విశాఖపట్నం, విజయవాడ నగరపాలక సంస్థల్లో మినహా మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో భవన నిర్మాణాలు, లేఅవుట్లకు అనుమతులివ్వడంలో కొన్ని పరిమితులున్నాయి. భారీ భవంతులు, భారీ విస్తీర్ణంలోని లేఅవుట్ల అనుమతుల కోసం దరఖాస్తులను పట్టణ స్థానిక సంస్థల ద్వారా పట్టణాభివృద్ధి సంస్థలకు పంపుతున్నారు. వాటికి అనుమతి లభించడంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణ కొన్ని రాష్ట్రాలను సందర్శించి అధ్యయనం చేశారు. అనుమతుల ప్రక్రియను సరళతరం చేసేందుకు శాఖ శ్రీకారం చుట్టింది. దానికి సంబంధించి ఆర్డినెన్స్ తెచ్చేందుకు కేబినెట్ గురువారం ఆమోదించింది.

6న రండి.. కేటీఆర్‌కు తెలంగాణ ఏసీబీ నోటీసు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు కేసులో నిందితుల విచారణకు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సన్నద్ధమైంది. ఈ కేసులో ఏ1గా ఉన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు శుక్రవారం నోటీసు జారీ చేసింది. ఈనెల ఆరో తేదీ ఉదయం పది గంటలకు విచారణకు రావాలని పేర్కొంది. ఇదే కేసులో సహ నిందితులైన ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా నోటీసులు జారీ చేసింది. వారిని 7న విచారణకు రమ్మంది.

మెడికల్ సీట్లు ఖాళీగా ఉండకూడదు: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 3: వైద్య కళాశాలల్లో సీట్లను ఖాళీగా ఉంచకూడదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వీటి భర్తీ విషయమై రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములతో చర్చలు జరపాలని కేంద్రాన్ని తాజాగా ఆదేశించింది. ఈ సమస్యపై నిపుణుల కమిటీ అధ్యయనం చేసి ఇచ్చిన సూచనలను పరిశీలించాలని సూచించింది. వైద్య కళాశాలల్లో 1,003 విలువైన సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్లు భర్తీ కాకపోవడంపై 2023 ఏప్రిల్‌లో జరిగిన విచారణ సందర్భంగా ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై మళ్లీ శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగానే సీట్లు ఖాళీగా మిగిలకూడదని వ్యాఖ్యానించింది. 3నెలల్లోగా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచిస్తూ విచారణను ఏప్రిల్ నెలకు వాయిదా వేసింది.

చైనాలో కొత్త వైరస్!

హెచ్ఎంపీవీ విజృంభణతో కలకలం

- కొవిడ్ తరహా లక్షణాలతో ఆందోళన
- ఆస్పత్రులకు జనం పోటెత్తారంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- ఫ్లూ కేసులేమీ భారీగా పెరగలేదు: చైనా
- హెచ్ఎంపీవీని 2001లోనే గుర్తించారు
- అది సీజనల్ వ్యాధే అంటున్న నిపుణులు



న్యూఢిల్లీ, జనవరి 3: చైనాలో కొత్త వైరస్ కలకలం సృష్టిస్తోంది. కరోనా మహమ్మారికి మూల కేంద్రమైన డ్రాగన్ దేశంలో తాజాగా 'హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపీవీ)' వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ వైరస్ బారినపడిన స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రుల్లో చేరుతున్నట్లు చెబుతున్నారు. హెచ్ఎంపీవీతోపాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా, నిమోనియా, కొవిడ్-19 వైరస్‌లు కూడా వ్యాప్తి చెందుతున్నట్లు పలువురు పోస్టులు పెడుతున్నారు. చైనాలోని ఆస్పత్రులు కిటకిటలాడుతున్నట్లు కొందరు వీడియోలు కూడా పోస్ట్ చేస్తున్నారు. అయితే దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ వైరస్ సోకినవారిలో కొవిడ్ తరహా లక్షణాలే కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. జలుబు, జ్వరం, దగ్గు, ముక్కు కారడం వంటి లక్షణాలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నట్లు సమాచారం. ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. గుర్తు తెలియని నిమోనియా తరహా వైరస్ మూలాలను కనుగొనేందుకు చైనా వ్యాధి నియంత్రణ సంస్థ ఓ పర్యవేక్షక వ్యవస్థను ప్రారంభించిందని ఆ నివేదిక వెల్లడించింది. డిసెంబరు 16 నుంచి 22 వరకు చైనాలో అంటువ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. కాగా, హెచ్ఎంపీవీని 2001లోనే గుర్తించారు. ప్రస్తుతం చైనాలో వెలుగు చూస్తున్న కేసులకు ఇదే కారణమని చెబుతున్నారు. ఇది అక్కడ సీజనల్ వ్యాధి అని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, చైనాలో భారీ సంఖ్యలో ఫ్లూ కేసులు వచ్చాయని, జనం ఆస్పత్రుల బాట పడుతున్నారన్న వార్తలను చైనా తేలిగ్గా తీసుకుంది. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధులు సహజమని, గత ఏడాదితో పోలిస్తే ఈ సారి వాటి తీవ్రత చాలా తక్కువగా ఉందని ఆ దేశ విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. చైనా ఉత్తరప్రాంతంలో శీతాకాలంలో ఫ్లూ, శ్వాసకోశ బాధితులు ఎక్కువగా ఉంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే అలాంటి కేసులు ఈ సారి చాలా తక్కువగా ఉన్నాయన్నారు. చైనా పౌరులు, చైనాలో ఉన్న విదేశీయుల ఆరోగ్యానికి తమ ప్రభుత్వానిది హామీ అని పేర్కొన్నారు. విదేశీయులు నిర్భయంగా చైనాలో పర్యటించవచ్చన్నారు.

భయపడాల్సిన పని లేదు: కేంద్రం

దేశంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా, శ్వాసకోశ వ్యాధులపై 'జాతీయ వ్యాధుల నివారణ కేంద్రం (ఎన్‌సీడీసీ)' దృష్టి పెట్టిందని కేంద్రం వెల్లడించింది. చైనాలో హెచ్ఎంపీవీ వైరస్ విజృంభిస్తోందన్న వార్తల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నట్లు ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ అతుల్ గోయెల్ చెప్పారు. చైనాలో వైరస్ అంశంపై సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. హెచ్ఎంపీఎస్ వైరస్ వల్ల సాధారణ జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలే వస్తాయని తెలిపారు. అయితే దేశవ్యాప్తంగా గత నెలలో శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారి సంఖ్య ఏమీ పెరగలేదని చెప్పారు.

లక్షణాలు ఏంటి..?

హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయొచ్చని చెబుతున్నారు. దగ్గు, తుమ్ముతో వెలువడే తుంపర్ల కారణంగా, వైరస్ బారిన పడిన వ్యక్తులతో సన్నిహితంగా మెలగడం, వైరస్ వ్యాపించిన ప్రాంతాలను తాకిన తర్వాత నోరు, ముక్కు, కళ్లను తాకడం వంటివి చేస్తే హెచ్ఎంపీవీ సోకుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ సోకిన వారికి ప్రత్యేకించి చికిత్స ఏమీ లేదని అంటున్నారు.

నివారణ ఇలా..

చిన్నపాటి ముందుజాగ్రత్త చర్యలతో వైరస్ సోకకుండా చూసుకోవచ్చని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. సబ్బుతో 20 సెకన్ల పాటు తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలంటున్నారు. అపరిశుభ్ర చేతులతో ముఖాన్ని తాకకూడదని, వైరస్ బారినపడిన వ్యక్తులకు దూరంగా ఉండాలని, తరచూ తాకాల్సి వచ్చే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. వైరస్ బారిన పడినవారు తమ వస్తువులను ఇతరులు వాడకుండా చూడాలని, లక్షణాలు కనిపిస్తున్నప్పుడు బయటికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండి, విశ్రాంతి తీసుకుంటే మంచిదని చెబుతున్నారు.

ఏటా 15 వేల కోట్లు

- 'లాటరీ కింగ్' మార్టిన్ వ్యాపారం స్థాయి ఇది.. వెల్లడించిన ఈడీ
- మార్టిన్ నుంచి వైసీపీకి రూ.154 కోట్లు



న్యూఢిల్లీ, జనవరి 3: 'లాటరీ కింగ్'గా పేరు పొందిన శాంటియాగో మార్టిన్ వ్యాపారం ఏటా రూ.15వేల కోట్లు అని ఈడీ తాజాగా ప్రకటించింది. మార్టిన్ అక్రమాలపై 2014లో తొలి కేసు సీబీఐ నమోదు చేసింది. ఆ తర్వాత మార్టిన్, ఆయన కంపెనీలపై పలు కేసులు నమోదయ్యాయి. వీటిపై విచారణ చేస్తున్న ఈడీ.. ఇటీవల మార్టిన్‌కు చెందిన ప్రాంగణాల్లో భారీ ఎత్తున అక్రమాస్తులను గుర్తించింది. గతంలోనే రూ.1,000 కోట్లకు పైగా విలువైన మార్టిన్ ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఆస్తులు కూడబెట్టడానికి మార్టిన్ 350 కంపెనీలు స్థాపించాడు. ఆస్తులు అమ్మే యజమానులకు బహుమతి గెలిచే లాటరీ టికెట్లు ఇచ్చి వారి నుంచి ఆ ఆస్తులు పొందినట్లు ఈడీ విచారణలో వెల్లడైంది. ఇదిలా ఉండగా, మార్టిన్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ సంస్థ ద్వారా ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో రాజకీయ పార్టీలకు భారీ మొత్తం విరాళంగా ఇచ్చినట్లు విచారణలో బయటపడింది. 2019 నుంచి 2024 మధ్య కాలంలో వివిధ రాజకీయ పార్టీలకు మొత్తం రూ.1368 కోట్లు విరాళం అందజేసినట్లు వెల్లడైంది. దీనిలో అందరికన్నా ఎక్కువగా టీఎంసీ రూ.542 కోట్లు అందుకుంది. మార్టిన్ కంపెనీ నుంచి విరాళాలు అందుకున్న పార్టీల్లో వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్ కూడా ఉన్నట్లు విచారణలో బయటపడింది. ఆ లాటరీ వ్యాపారి నుంచి వైసీపీ రూ.154 కోట్లు అందుకున్నట్లు వెల్లడైంది.

తగ్గిన గ్రామీణ పేదరికం

- 2012లో 25.7%.. ప్రస్తుతం 4.86%
- ఎస్‌బీఐ పరిశోధన పత్రం వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 3: ప్రభుత్వ సంక్షేమ చర్యల కారణంగా దేశంలో గ్రామీణ పేదరికం గణనీయంగా తగ్గిందని ఎస్‌బీఐ నిర్వహించిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. 2011-12లో 25.7 శాతంగా ఉన్న గ్రామీణ పేదరికం 2024 మార్చి నాటికి 4.86 శాతానికి తగ్గిపోయిందని, ఇదే కాలవ్యవధిలో పట్టణ పేదరికం 13.7 శాతం నుంచి 4.09 శాతానికి తగ్గిందని ఈ అధ్యయనం తెలిపింది. తాజా (2023-24) అంచనాల ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖను రూ.1,632గా, పట్టణ ప్రాంతాల్లో రూ.1,944గా నిర్ణయించినట్లు వెల్లడించింది (ఒక వ్యక్తి కనీస అవసరాలు తీరటానికి నెలకు అయ్యే సగటు ఖర్చునే దారిద్ర్యరేఖగా నిర్ణయిస్తారు). ఈ మేరకు ఎస్‌బీఐ శుక్రవారం ఒక పరిశోధన పత్రాన్ని విడుదల చేసింది. 2021 జనాభా లెక్కలు పూర్తయితే ఈ గణాంకాలపై మరింత స్పష్టత వస్తుందని, ముఖ్యంగా పట్టణ పేదరికం మరింత తగ్గినట్టు వెల్లడయ్యే అవకాశం ఉందని ఎస్‌బీఐ సర్వే తెలిపింది. ప్రత్యక్ష నగదు బదిలీ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలు, గ్రామీణ జీవన ప్రమాణాల్లో మెరుగుదల వంటి వాటి వల్లే ఇది సాధ్యమైందని వెల్లడించింది.

జి.మాడుగులలో 5.2 డిగ్రీలు

విశాఖపట్నం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి పెరిగింది. శుక్రవారం ఉదయం పది గంటల వరకు చాలాచోట్ల దట్టంగా మంచు కురిసింది. అల్లూరి జిల్లా జి.మాడుగులలో 5.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో పొడి వాతావరణం, చలి ప్రభావం కొనసాగుతుందని వాతావరణశాఖ తెలిపింది.

మనసును చదివే యంత్రం

- చైనా శాస్త్రజ్ఞుల సృష్టి
- మూర్ఛ వ్యాధి బాధితురాలి ఆలోచనల్ని డీకోడ్ చేసిన యంత్రం

బీజింగ్, జనవరి 3: 'ఆదిత్య 369' సినిమాలో హీరో, హీరోయిన్లు భవిష్యత్తులోకి వెళ్లే సీన్ గుర్తుందా? అందులో వారు మనసులో అనుకునే మాటలు బయటకు వినపడిపోతుంటాయి!! మరీ ఆ స్థాయిలో కాదు గానీ.. మన మనసులో ఆలోచనలను న్యూరల్ నెట్‌వర్క్ మోడల్ ద్వారా డీకోడ్ చేసే 'మైండ్ రీడింగ్ మెషీన్'ను చైనా శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. 'బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్(బీసీఐ)'ల అభివృద్ధి దిశగా మరో కీలక ముందడుగు వేశారు. చైనాకు చెందిన న్యూరోయాక్సెస్ అనే స్టార్టప్ తన ప్రయోగాల్లో భాగంగా బీసీఐ పరికరాన్ని.. మెదడుకు గాయమైన ఒక 21 ఏళ్ల మూర్ఛవ్యాధి బాధితురాలికి నిరుడు ఆగస్టులో అమర్చగా.. అది ఆమె ఆలోచనలను 60మిల్లీసెకన్ల వ్యవధిలో డీకోడ్ చేయగలిగింది. డిసెంబరులో నిర్వహించిన మరో పరీక్షలో ఆ పరికరం చైనీస్ మాటలను సైతం 100 మిల్లీసెకన్ల తేడాతో డీకోడ్ చేసింది. ఈ పరికరం సాయంతో పేషెంట్లు తమ ఆలోచనల ద్వారానే కంప్యూటర్‌లో సాఫ్ట్‌వేర్‌ను, వస్తువులను నియంత్రించగలిగారు. ఏఐ మోడళ్లతో సంభాషించగలిగారు.

నీతిమాలిన వాళ్లు!

అన్నా హజారేను ముందుపెట్టి వంచించారు

- కేజ్రీవాల్ బృందంపై ప్రధాని ఫైర్



న్యూఢిల్లీ, జనవరి 3: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా షెడ్యూల్ విడుదల కాకముందే ప్రధాని మోదీ ప్రచార భేరి మోగించారు. మాజీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కొందరు 'నీతిమాలిన' వ్యక్తులు గాంధేయవాది అన్నా హజారేను ముందుపెట్టి ప్రజలను వంచించారని ధ్వజమెత్తారు. మోదీ శుక్రవారమిక్కడ అశోక్‌విహార్‌లోని స్వాభిమాన్ అపార్ట్‌మెంట్స్‌లో జేజే క్లస్టర్స్‌కు చెందిన మురికివాడ ప్రజలకు కొత్తగా నిర్మించిన 1,675 ఫ్లాట్ల తాళాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌లీలా మైదానంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఆప్ నేతలపై విరుచుకుపడ్డారు. నీతి లేని కొందరు గత పదేళ్లుగా దేశ రాజధానిని 'ఆప్'ద పాల్జేశారన్నారు. 'వీళ్లు ఢిల్లీ అభివృద్ధి గురించి మాట్లాడుతుంటారు. కానీ ఈ 'ఆప్', ఈ 'ఆప్'ద ఢిల్లీని చుట్టుముట్టింది. దీని నుంచి రాజధానిని విముక్తి చేసేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఆప్ ప్రభుత్వం తొలుత అవినీతికి పాల్పడుతుంది. తర్వాత దానిని గొప్పగా సమర్థించుకుంటుంది. మొదట చోరీకి పాల్పడి తర్వాత అహంకారం ప్రదర్శిస్తుంటారు. మద్యం స్కాం, స్కూల్ స్కాం, కాలుష్య కుంభకోణానికి పాల్పడ్డారు. బహిరంగంగా అవినీతికి పాల్పడుతూ.. పైగా ప్రచారం చేసుకుంటున్నారు' అని దుయ్యబట్టారు. కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు ప్రజాధనంతో తన నివాసాన్ని అద్దాల మహల్‌గా మలచుకోవడాన్ని మోదీ ఎద్దేవాచేశారు. 'నేను కూడా అద్దాల మహల్ కట్టుకోగలను. కానీ మోదీ తన సొంతానికి ఇల్లు కట్టుకోలేదని.. 4 కోట్ల మందికి పైగా పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చాడని దేశానికి తెలుసు' అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని మురికివాడల ప్రజలకు ఇవాళ కాకపోయినా రేపైనా పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తానని.. ఇది తన మాటగా వారందరికీ చెప్పాలని సభకు హాజరైనవారికి పిలుపిచ్చారు. ఇళ్ల లబ్ధిదారులతో ఆయన సంభాషించారు. ఈ సందర్భంగా నౌరోజీనగర్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్, సరోజినీనగర్‌లో జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జీపీఆర్ఏ) టైప్-2 క్వార్టర్స్, ద్వారకలో సీబీఎస్ఈ కార్యాలయ సముదాయం సహా పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో వీరసావర్కర్ కాలేజీ, తూర్పు, పశ్చిమ క్యాంపస్‌లలో అకడమిక్ బ్లాకుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

10లక్షల సూట్.. 8,400 కోట్ల విమానం: కేజ్రీ

మోదీ వ్యాఖ్యలను కేజ్రీవాల్ తిప్పికొట్టారు. రూ.2,700 కోట్ల ఖర్చుతో ఇల్లు కట్టుకుని.. రూ.10 లక్షల విలువ చేసే సూట్ వేసుకుని.. రూ.8,400 కోట్ల ఖరీదు చేసే విమానంలో తిరిగే వ్యక్తి నోట అద్దాల మహల్ ప్రస్తావన శోభిల్లదన్నారు. పదేళ్లలో కేంద్రం ఢిల్లీకి చేసిందేమీ లేదని.. అయినా తమ ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారని విమర్శించారు.

వచ్చే వారంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్?


న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఈనెల వచ్చే వారంలో వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో ప్రధాని మోదీ శుక్రవారం ఢిల్లీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఢిల్లీ ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం ఫిబ్రవరి 23న ముగియనుండడంతో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఫిబ్రవరి మూడో వారంలో ఎన్నికలు జరిపేలా ప్రయత్నాలు ప్రారంభించింది. తుది ఓటర్ల జాబితాను వచ్చే ఈనెల 6వ తేదీన ప్రచురిస్తామని ఈసీ అధికారులు తెలిపారు.

కేజ్రీ'వాల్'కు బీటలు కొట్టిన ఆంధ్రా ఐఏఎస్

- ఢిల్లీ మాజీ సీఎం అవినీతిని వెలికితీసిన రాజశేఖర్
- ఢిల్లీ మద్యం కుంభకోణంలో ముడుపుల కేసు
- వందకోట్లతో కేజ్రీవాల్ విలాసవంతమైన బంగళా
- ఇంకా పలు అక్రమాలు, నిధుల దుర్వినియోగం
- బలమైన సాక్ష్యాధారాలతో సంచలన నివేదిక

(న్యూఢిల్లీ-ఆంధ్రజ్యోతి)

ఆయన.. ఒకప్పుడు 'ఇండియా అగైనెస్ట్ కరప్షన్' పేరిట చేసిన అవినీతి వ్యతిరేక ఉద్యమంతో ప్రాచుర్యం పొందారు. ఆమ్ ఆద్మీ పార్టీ స్థాపించి ఢిల్లీలో సంచలన విజయంతో ముఖ్యమంత్రి అయ్యారు. దాదాపు దశాబ్దకాలం తర్వాత చిత్రంగా అవినీతి కేసులో జైలుకెళ్లారు. ఆయన అరవింద్ కేజ్రీవాల్ అన్న విషయం అందరికీ తెలిసిందే. అవినీతికి వ్యతిరేకినన్న కేజ్రీవాల్ 'క్రెడిబిలిటీ'కి బీటలు కొట్టింది ఓ ఆంధ్రా ఐఏఎస్ అధికారి. అవినీతి విషయంలో కేజ్రీవాల్, ఆయన మంత్రులు ఏమీ తక్కువ తినలేదని బలమైన సాక్ష్యాధారాలతో నిరూపించారు. ఆయనే.. నాటి విజిలెన్స్ విభాగం స్పెషల్ సెక్రటరీ వైవీవీజే రాజశేఖర్. ఆయన స్వస్థలం అనకాపల్లి. ఢిల్లీ మద్యం కుంభకోణం సహా పలు అంశాల్లో కేజ్రీవాల్ అవినీతిని ఆయన వెలుగులోకి తీసుకువచ్చారు. యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్ లాంటి వారు విభేదించి బయటకు వెళ్లినా పెద్దగా నష్టం జరగలేదు కానీ అవినీతి అభియోగాలు కేజ్రీవాల్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ముడుపులు తీసుకోవడం, వందకోట్లతో కేజ్రీవాల్ విలాసవంతమైన బంగళా నిర్మించుకోవడం, వివిధ సంక్షేమ పథకాల్లో నిధులను స్వాహా చేయడం వంటి అంశాల్లో రాజశేఖర్ అంతర్గత నివేదికలను రూపొందించారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ముడుపులు తీసుకుని గోవా ఎన్నికల్లో ఖర్చు చేశారని, గోవాలో ఏడు నక్షత్రాల హోటల్‌లో కేజ్రీవాల్ బస చేశారన్న అభియోగాలతో తొలుత ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తర్వాత సీఎం కేజ్రీవాల్‌తో పాటు పలువురు నేతలు జైలుపాలయ్యారు. 2013లో అధికారంలోకి వచ్చినప్పుడు తాను ప్రభుత్వ బంగళాలలో నివసించబోనని శపథం చేసిన కేజ్రీవాల్... ఆ తర్వాత ప్రభుత్వ బంగళా తీసుకోవడమే గాక దాని మరమ్మతుల కోసం కొవిడ్ సమయంలో కూడా కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టిన వైనాన్ని రాజశేఖర్ వెలుగులోకి తీసుకువచ్చారు. ఈ బంగళాలో జిమ్, స్పా, స్విమ్మింగ్ పూల్, రిమోట్‌తో పనిచేసే టాయిలెట్ సీట్లతో పాటు ఆధునిక సౌకర్యాలను కేజ్రీవాల్ సమకూర్చుకున్నారని నివేదికల్లో బహిర్గతం చేశారు. అలాగే సుప్రీంకోర్టు ఆదేశాలకు భిన్నంగా భారీ ఎత్తున ప్రకటనలకు ఖర్చు పెట్టడం... అనిల్ అంబానీ డిస్కమ్‌లకు రూ.1907 కోట్లు అక్రమంగా కట్టబెట్టడం... నిర్మాణ పనుల పేరుతో వందల కోట్ల రూపాయలు మళ్లించడం... రాజకీయ కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా ఇంటెలిజెన్స్ యూనిట్‌ను ఏర్పాటు చేయడం వంటి అక్రమాలను వెలికితీశారు.



రాజశేఖర్‌పై కక్షసాధింపు చర్యలు

విజిలెన్స్ సెక్రటరీ హోదాలో రాజశేఖర్ తనకు వ్యతిరేకంగా నివేదికలను రూపొందిస్తున్నారని తెలుసుకున్న కేజ్రీవాల్ ప్రభుత్వం ఆయనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడినట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాజశేఖర్ ఓబీసీ (రిజర్వేషన్) వర్గానికి చెందినవారు కాదని రుజువు చేయాలని కేజ్రీవాల్ ప్రభుత్వం ఎమ్మెల్యేలను ఏపీకి పంపించింది. వారు ఐదు రోజులు విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లో పర్యటించినా నిరూపించలేకపోయారు. అయినా 22 ఆరోపణలతో ఢిల్లీ హైకోర్టులో ఆయనపై పిటిషన్ దాఖలు చేశారు. రాజశేఖర్‌పై తప్పుడు ఫిర్యాదులతో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ తీర్పును సుప్రీం కోర్టు కూడా ధ్రువీకరించింది. కాగా ఇటీవల హోం శాఖ చేసిన బదిలీలలో భాగంగా రాజశేఖర్ అరుణాచల్‌ప్రదేశ్‌కు వెళ్లారు.

తనిఖీలు తుస్సు!

గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల చదును అక్రమాలపై అధికారుల నిర్లక్ష్యం

- యథేచ్ఛగా మార్గదర్శకాల ఉల్లంఘన
- అక్రమార్కులను రక్షించేందుకు యత్నాలు
- బకాయి సొమ్ము ఇప్పించేలా పావులు
- తనిఖీల్లో మమ అనిపించేలా అన్ని జిల్లాల 'ఉపాధి' క్వాలిటీ కంట్రోల్ అధికారులు
- మళ్లీ తనిఖీలు చేస్తాం.. కమిషనర్ హెచ్చరిక

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఇంటి స్థలాల చదును పనుల తనిఖీలను నిర్వీర్యం చేసేందుకు కొంత మంది అధికారులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తనిఖీల కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఇచ్చిన మార్గదర్శకాలను తుంగలో తొక్కి.. గత ప్రభుత్వంలో పనిచేసిన కాంట్రాక్టర్లు, అప్పటి అధికారులను రక్షిస్తున్నారు. విత్‌హెల్డ్‌లో ఉన్న 25 శాతం పెండింగ్ బిల్లుల్లో 5 శాతం రికవరీ పెట్టి, మిగిలిన 20 శాతం కాంట్రాక్టర్లకు ఇప్పించేందుకు పావులు కదుపుతున్నారు. పైగా గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఉపాధి సిబ్బందినే తనిఖీలకు వినియోగించడంతో.. విచారణ తప్పుదారి పడుతోందన్న విమర్శలు వస్తున్నాయి. కమిషనర్ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోకుండా తనిఖీలను మమ అనిపించే ధోరణిలో అన్ని జిల్లాల క్వాలిటీ కంట్రోల్ అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.1,125 కోట్ల మేర పనులు వైసీపీ కార్యకర్తల ద్వారా చేపట్టారు. అయితే రూ.1,500 కోట్ల పనులు చేసినట్లు దొంగ బిల్లులు పెట్టారు. రూ.1,260 కోట్ల మేర గత ప్రభుత్వం ఎన్నికల ముందే చెల్లించింది. ఇక సుమారు రూ.240 కోట్ల మేర బకాయిలున్నాయని పనులు చేసిన వాళ్లు హైకోర్టును ఆశ్రయించగా.. వారికి బిల్లులు చెల్లించాలని న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. అయితే విత్‌హెల్డ్‌లో ఉన్న బకాయిలు చెల్లించడానికి క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ విభాగాలు తనిఖీలు చేపట్టాల్సి ఉందని అప్పట్లోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాల్లో పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఇంటి స్థలాల లెవలింగ్ పనుల్లో అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యేలు ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తారు. దీంతో కమిషనర్ కృష్ణతేజ ఇంటి స్థలాల చదును పనులను తనిఖీ చేయాలని తాజాగా ఆదేశాలిచ్చారు. అన్ని జిల్లాల్లో పంచాయతీరాజ్, ఇతర శాఖల ఇంజనీర్లతో బృందాలను ఏర్పాటు చేసి, తనిఖీలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. పనుల వాస్తవ పరిస్థితి, లెవలింగ్ పనులు చేశారా? లేదా? నమోదిత పరిమాణంలో పనులున్నాయా? లేదా? అనే అంశాలను పరిశీలించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. మట్టి కొన్నట్లు దొంగ రికార్డులు సృష్టించారా? తహసీల్దార్ అనుమతి లేకుండానే క్యూబిక్ మీటర్ మట్టికి రూ.50 అదనంగా రికార్డు చేసి సొమ్ము స్వాహా చేశారా? తదితర అంశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. అయితే ఆ మార్గదర్శకాలను అధికారులు పట్టించుకోకపోవడంతో తనిఖీలు తప్పుదారి పట్టాయి.

లెవెలింగ్ పనులు చేశారా? లేదా?

తనిఖీల నిర్వీర్యానికి యత్నాలు

తనిఖీలను కొంత మంది అధికారులు కావాలని నిర్వీర్యం చేస్తున్నారు. అప్పట్లో పనిచేసిన అధికారులు బాధ్యులవుతారన్న భయంతో కొంత మంది తనిఖీలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కమిషనరేట్ స్థాయిలోనూ జిల్లాలకు ఎప్పటికప్పుడు అలెర్ట్ చేయడంలో నిరక్ష్యం చేస్తున్నారు. కాంట్రాక్టర్లకు సాయం చేసేందుకు, అప్పట్లో పనిచేసిన అధికారులతో అంటకాగుతున్న కొంత మంది అధికారులు.. తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి, వారిని కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే కమిషనర్ ఒక విధంగా ఆదేశిస్తే.. జిల్లాలకు మరో విధంగా సమాచారం చేరవేస్తున్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు జిల్లాల్లో ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకుంటున్నారు. తనిఖీల్లో నిర్దిష్టమైన మార్గదర్శకాలను అనుసరించకపోవడంతో ఈ తనిఖీలు తుస్సుమనే ప్రమాదముందనే వాదన వినిపిస్తోంది.

అధికారులకు కమిషనర్ హెచ్చరిక

శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే 200కు పైగా పనులు తనిఖీ చేశామని, ఆ పనుల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేవని శుక్రవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆ జిల్లా పీడీ తెలియజేయడంతో కమిషనర్ కృష్ణతేజ మండిపడ్డారు. ఇంతలోనే అన్ని పనులు ఎలా చేశారని, వాటిపై మళ్లీ తనిఖీలు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటి స్థలాల లెవలింగ్ పనుల తనిఖీల విషయంలో నిర్లక్ష్యం చేస్తే మళ్లీ తనిఖీలు చేపడతామన్నారు. తప్పు చేసినట్లు నిరూపణ అయితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు గోదావరి జిల్లాల్లోనూ ఇంటి స్థలాల లెవలింగ్ పనుల తనిఖీల్లో నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయన్నారు.

ప్రభుత్వ భూముల్లో మట్టి సేకరించి..

అప్పట్లో జగనన్న కాలనీలో ఇంటి చదును పనుల్లో మట్టి కొనుగోలు కోసం క్యూబిక్ మీటర్‌కు రూ.50 రికార్డు చేసి చెల్లించారు. వాస్తవానికి మట్టిని రైతుల నుంచి కొనుగోలు చేసి ఉంటే రూ.50 చెల్లించాలి. అయితే రైతు పొలం నుంచి మట్టి తీసుకునేందుకు తహసీల్దార్ అనుమతి ఉండాలి. ఆ మేరకు రికార్డులు సమర్పించాలి. ప్రభుత్వ స్థలంలో మట్టి సేకరిస్తే, క్యూబిక్ మీటర్‌కు రూ.50 చెల్లించే అవసరం ఉండదు. అయితే చదును పనులకు మట్టిని క్యూబిక్ మీటర్‌కు రూ.50 చెల్లించి కొనుగోలు చేసినట్లు, తరలించినందుకు రూ.80 చొప్పున మొత్తంగా క్యూబిక్ మీటర్‌కు రూ.134 చొప్పున రికార్డు చేశారు. రైతుల నుంచి సేకరించకుండానే ప్రభుత్వ భూముల్లో మట్టిని సేకరించి, క్యూబిక్ మీటర్‌కు రూ.50 అదనంగా వసూలు చేశారు. దీంతో ప్రభుత్వ సొమ్ము భారీగా వైసీపీ కార్యకర్తల జేబుల్లోకి వెళ్లింది. కమిషనర్ ఆదేశాల ప్రకారం ఆయా పనులకు సంబంధించిన రికార్డులు పరిశీలించి, మట్టి కొనుగోలుకు తహసీల్దార్ల అనుమతి ఉందా? అనేది పరిశీలించాలి. అనుమతి లేని పనుల్లో రూ.50 కోత విధించాలి. ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయాలని కమిషనర్ సూచించారు. ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించాలని, అవసరమైతే తాజా కొలతలను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు.

కాంట్రాక్టర్లతో పర్సంటేజీ బేరాలు

తనిఖీల కోసం కమిటీలు వేయాలని కమిషనర్ గత నెల 3వ తేదీన అన్ని జిల్లాలకు సూచించారు. కొన్ని జిల్లాల్లో క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఉపాధి సిబ్బందినే తనిఖీల కోసం సిఫారసు చేశారు. గతంలో ఆ పనులు పర్యవేక్షించి, సూపర్ చెక్ చేసిన ఇంజనీరింగ్ కన్సల్టెంట్లను తనిఖీలు చేయాలని ఆదేశాలివ్వడంతో సీరియస్‌నెస్ తగ్గింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో తనిఖీలు మమ అనిపించే ప్రయత్నాలు చేశారు. గతంలో బకాయిలు 25 శాతం పెండింగ్ ఉంటే.. 5 శాతం తేడాలున్నట్లు చూపించి, మరో 20 శాతం బకాయిలను కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కొన్ని జిల్లాల్లో సిబ్బంది కాంట్రాక్టర్లకు ఫోన్లు చేసి.. పనుల తనిఖీల్లో సాయం చేస్తామని, వారి నుంచి కమీషన్లు వసూలు చేసుకోసాగారు.

విశాఖ కేంద్ర కారాగారంలో సెల్ ఫోన్లు కలకలం రేపుతున్నాయి. గత నెల 31న తనిఖీలు చేయగా రెండు సెల్‌ఫోన్లు, రెండు పవర్ బ్యాంకులు, చార్జింగ్ కేబుల్స్ లభ్యమయ్యాయి. తాజాగా నర్మదా బ్లాక్ వద్ద మరో సెల్‌ఫోన్ లభ్యమైంది. శుక్రవారం కొంతమంది ఖైదీలు పదేపదే నర్మదా బ్లాక్ వద్దకు రావడాన్ని సిబ్బంది గుర్తించారు. అనుమానం వచ్చి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

అద్దె గోదాములపై గోల!

- బెజవాడలో ప్రైవేట్ గోడౌన్ల యజమానులు భేటీ
- పౌరసరఫరాల సంస్థ నిర్ణయంపై అభ్యంతరాలు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం, ఇతర పీడీఎస్ సరుకులను నిల్వ చేసే అద్దె గోదాముల విషయంలో పౌరసరఫరాల సంస్థ నిర్ణయంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇకపై ప్రైవేట్ గోడౌన్లను నేరుగా అద్దెకు తీసుకోవద్దని, ఆయా జిల్లాల్లో అవసరమైన బఫర్ గోడౌన్లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ద్వారానే తీసుకోవాలని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ ఎండీ మనజీర్ జిలానీ ఇటీవల అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లకు లేఖ రాశారు. బఫర్ గోడౌన్ల నిర్వహణను గిడ్డంగుల సంస్థకే అప్పగించాలని నిర్ణయించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మాజీమంత్రి పేర్ని నాని గోదాము, నంద్యాల జిల్లాలో మాజీ మంత్రి బంధువుల గోదాముల్లో రూ.కోట్ల విలువైన రేషన్ బియ్యం మాయమైన ఉదంతాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా బఫర్ గోడౌన్లలో సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు చోట్ల రేషన్ బియ్యం నిల్వల్లో భారీగా వ్యత్యాసాలను గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ గోడౌన్లను నేరుగా అద్దెకు తీసుకోకూడదని, ప్రస్తుతం ఉన్నవాటిని కూడా వదిలించుకోవాలని కార్పొరేషన్ ఎండీ నిర్ణయించారు. అయితే ఈ నిర్ణయాన్ని ప్రైవేటు గోడౌన్ల యజమానులు వ్యతిరేకిస్తున్నారు. వివిధ జిల్లాల ప్రైవేట్ గోడౌన్ల యజమానులు శుక్రవారం విజయవాడలోని ఒక హోటల్‌లో సమావేశమయ్యారు. అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల కార్పొరేషన్‌తోపాటు ప్రైవేటు గోడౌన్ల యజమానులు, రైతులు, ప్రజలకు కూడా నష్టం కలుగుతుందని అభ్యంతరాలు లేవనెత్తారు. గిడ్డంగుల సంస్థ గోడౌన్లు నిర్వహణకు నోచుకోకపోవడంతో కొన్నింటి పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని, వాటిల్లో బియ్యం నిల్వ చేస్తే ఏ మేరకు భద్రత ఉంటుందనేది ప్రశ్నార్థకమేనని చెబుతున్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులతో తనిఖీలు చేయించి నివేదిక తెప్పించుకోవాలని, ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు.

సొంత గోడౌన్లు లేక అద్దెల భారం

డిమాండ్ నేపథ్యంలో ప్రైవేటు గోడౌన్లను నేరుగా అద్దెకు తీసుకోవాలని 2022లో అప్పటి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ నిర్ణయించారు. అప్పటి నుంచి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోడౌన్లతోపాటు మరో 36 ప్రైవేటు గోడౌన్లను అద్దెకు తీసుకుని 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పీడీఎస్ సరుకులను నిల్వ చేస్తున్నారు. ప్రైవేట్ గోడౌన్లకు ఒక బస్తాకు రూ.4.25 లు అద్దె చెల్లిస్తుండగా.. పర్యవేక్షణ ఛార్జీల కింద 7 శాతం వెచ్చిస్తోంది. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ద్వారా తీసుకుంటున్న గోడౌన్లకు బస్తాకు రూ.5 చొప్పున అద్దె, పర్యవేక్షణ ఛార్జీల కింద 8 శాతం నిధులు అదనంగా చెల్లిస్తున్నారు. దీంతో కార్పొరేషన్‌పై ఏడాదికి రూ.175 కోట్ల అద్దె భారం పడుతోంది. తాజా నిర్ణయం వల్ల ఏడాదికి రూ.20 నుంచి 25 కోట్ల మేర అదనపు భారం పడుతుందని ప్రైవేటు గోడౌన్ల యాజమానులు చెబుతున్నారు. గిడ్డంగుల సంస్థ పర్సంటేజీ ప్రాతిపదిక వల్ల తమకు బస్తాకు రూ.3.25 మాత్రమే దక్కేదని వాపోతున్నారు.

పర్యవేక్షణ లోపంతో గతంలో పలు ఘటనలు

కార్పొరేషన్ నేరుగా అద్దెకు తీసుకున్న ప్రైవేట్ గోడౌన్లలో బియ్యం నిల్వలు పక్కదారి పడుతున్నాయనేది దుష్ప్రచారమేనని యజమానులు కొట్టిపారేస్తున్నారు. సివిల్ సప్లయిస్ అధికారులు రాజకీయ ప్రమేయం ఉన్న గోడౌన్ల యాజమాన్యాలతో కుమ్మక్కైపోవడంతో వారికి చెందిన గోడౌన్లలోనే బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గిడ్డంగుల సంస్థకే పూర్తి బాధ్యతలు అప్పగించినంత మాత్రాన పీడీఎస్ సరుకులకు భద్రత ఉంటుందన్న గ్యారంటీ ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. ఆ సంస్థలో సిబ్బంది కొరత వల్ల ఒక్కో మేనేజరు 2-3 గోడౌన్ల బాధ్యతలు చూడాల్సి వస్తోందని చెబుతున్నారు. పర్యవేక్షణ లోపంతో గతంలో ఆత్మకూరులోని గిడ్డంగుల సంస్థ గోడౌన్‌లో రూ.కోట్ల విలువైన కందులు, శనగలు మాయమైపోయాయని, నంద్యాల గోడౌన్‌లో పీడీఎస్ బియ్యం స్టాకు తక్కువ వచ్చిందని, అనంతపురం జిల్లాలోని తిమ్మంచెర్లలో తప్పుడు బిల్లులు పెట్టి పౌరసరఫరాల సంస్థ నుంచి రూ.కోట్లు కొల్లగొట్టారని చెబుతున్నారు. తూర్పుగోదావరిలో గిడ్డంగుల సంస్థ అద్దెకు తీసుకున్న గోడౌన్లలో రూ.కోట్ల విలువైన పీడీఎస్ బియ్యం పాడైపోతే.. ఒక ఉద్యోగిని సస్పెండ్ చేసి ఊరుకున్నారన్నారు.

గోవాలో 'పశ్చిమ' యువకుడి దారుణ హత్య

- కర్రలతో కొట్టి చంపిన రెస్టారెంట్ సిబ్బంది
- న్యూ ఇయర్ వేడుకలకు వెళ్లి మృత్యువాత
- ఎమ్మెల్యే బొలిశెట్టి చొరవతో స్వస్థలానికి మృతదేహం
- పట్టణంలో భారీ ర్యాలీ.. 'బాయ్‌కాట్ గోవా' నినాదాలు


రవితేజ

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల కోసం గోవా వెళ్లిన పశ్చిమ గోదావరి యువకుడు అక్కడ దారుణ హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం డీఎస్ చెరువు ప్రాంతానికి చెందిన రవితేజ (27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. చిన్నతనం నుంచి అందరితో సౌమ్యంగా, స్నేహంగా ఉండే రవితేజ తన సోదరుడు ఫణితో కలిసి తక్కువ సమయంలోనే కన్సల్టెన్సీ పెట్టారు. ఈ ఏడాది పెళ్లి చేసుకుని, కొత్త జీవితం ప్రారంభించాలని భావించారు. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరం వేడుకల కోసం నలుగురు యువకులు, ముగ్గురు యువతులతో కలిసి రవితేజ గోవాకు వెళ్లారు. అక్కడ తన స్నేహితురాలితో రెస్టారెంట్ నిర్వాహకులు అసభ్యంగా మాట్లాడటంతో వారిని ప్రశ్నించారు. దీంతో కోపోద్రిక్తులైన రెస్టారెంట్ సిబ్బంది రవితేజపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. తలకు తీవ్ర గాయమైన అతన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆలస్యమైందని, అరగంట ముందు తీసుకొచ్చి ఉంటే బతికేవాడని గోవా ఆస్పత్రి వైద్యులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న గోవా పోలీసులు రెస్టారెంట్ నిర్వాహకుడు సిల్వేరాతోపాటు, సిబ్బందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. రవితేజ తండ్రి బొల్లా సుబ్రహ్మణ్యం లారీ మెకానిక్‌గా పనిచేస్తూ.. ఇద్దరు కుమారులను బాగా చదివించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను చేశారు. ఈ ఏడాది రవితేజకు వివాహం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఇలా హత్యకు గురికావడం ఆ కుటుంబంలో విషాదం నింపింది.

'బాయ్‌కాట్ గోవా..'

గోవాలో హత్యకు గురైన రవితేజ మృతదేహం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చొరవతో స్వస్థలానికి చేరింది. రవితేజ స్నేహితులు, కుటుంబ సభ్యులు మృతదేహంతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రవితేజ ఫొటోలు ప్రదర్శిస్తూ.. 'బాయ్‌కాట్ గోవా' అంటూ నినాదాలు చేశారు. ఆటవిడుపు కోసం గోవాకు వెళ్తే రక్షణ కరువైందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

పెండింగ్ టీడీఆర్ బాండ్లను వెంటనే ఇవ్వండి

- మంత్రి నారాయణ ఆదేశాలు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వెరిఫికేషన్ పూర్తి చేసి పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లను లబ్ధిదారులకు అందించాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. టీడీఆర్ బాండ్లపై మున్సిపల్ కమిషనర్లు, యూడీఏల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో పలు మున్సిపాలిటీల్లో టీడీఆర్ బాండ్లలో భారీ అక్రమాలు జరిగాయన్నారు. అవకతవకలు జరిగిన బాండ్లు మినహా మిగతా బాండ్లను రిలీజ్ చేయాలని ఆదేశాలిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న జారీ చేయాల్సిన టీడీఆర్ బాండ్లు 437 ఉన్నాయి. వీటిని శుక్రవారం రాత్రిలోగా ఆన్‌లైన్‌లో లబ్ధిదారులకు జారీచేయాలని మంత్రి ఆదేశించారు.


బెంగళూరు సిటీ బస్సులో మహిళలతో మాట్లాడుతున్న మంత్రులు అనిత, గుమ్మడి సంధ్యారాణి, రాంప్రసాద్‌రెడ్డి, అధికారులు

'ఉచిత బస్సు' బాగుంది

- కర్ణాటకలో పథకం బాగా అమలవుతోంది
- త్వరలోనే సీఎం చంద్రబాబుకు నివేదిక ఇస్తాం: ఏపీ మంత్రులు


విధానసౌధలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో చర్చిస్తున్న ఏపీ మంత్రులు

బెంగళూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలోనే అమలు చేస్తామని ఏపీ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పలువురు అధికారుల బృందంతో కలిసి ఆయన శుక్రవారం బెంగళూరులో పర్యటించారు. శాంతినగర్ డిపోలో బస్సుల మరమ్మతు, నిర్వహణా విధానాలను పరిశీలించారు. మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ బస్సులో ప్రయాణించి శక్తి గ్యారెంటీ పథకంపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. విధానసౌధలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కర్ణాటక రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి, అధికారులతో పథకం అమలుపై చర్చించారు. అనంతరం ఏపీ మంత్రులు మీడియాతో మాట్లాడారు. ఏపీలో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసేందుకు ఈ పథకం అమలులో ఉన్న రాష్ట్రాలలో పర్యటిస్తున్నామని తెలిపారు. తమిళనాడు, ఢిల్లీలోనూ పర్యటించి రెండు నెలల్లో సీఎం చంద్రబాబుకు సమగ్ర నివేదికను అందిస్తామని వెల్లడించారు.


శ్రీవారి ఆలయం ముందు కుటుంబ సభ్యులతో జస్టిస్ కిరణ్మయి

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి

తిరుమల, జనవరి3 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమలేఖ, కేరళ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.మంజుల కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆలివ్ రిడ్లీ తాబేళ్ల సంరక్షణకు చర్యలు

- కాకినాడ సముద్రంలో హోప్ ఐల్యాండ్ వద్ద ఐదునెలలు చేపల వేట నిషేధం
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్రతీరంలో ఆలీవ్ రిడ్లీ తాబేళ్ల మృతి చెందడంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సీరియస్ అయ్యారు. వాటి సంరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కాకినాడ సముద్రంలో హోప్ ఐల్యాండ్ సమీపంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు చేపలవేట నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను వెలువరించింది. ఈ ఆదేశాలను ప్రతి బోటు యజమాని, మత్స్యకారులు పాటించాలని కాకినాడ జిల్లా అటవీశాఖాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మెరైన్, పోలీసు, మత్స్యశాఖ అధికారులతో కూడిన బృందం ప్రతిరోజూ తీరంలో పర్యవేక్షించి ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హోప్ ఐల్యాండ్ దాటిన తర్వాత చేపలవేట చేసే మత్స్యకారులకు ఆలీవ్ రిడ్లీ తాబేళ్ల వలలో చిక్కితే వాటిని సురక్షితంగా సముద్రంలో విడిచిపెట్టాలని ఆదేశించామన్నారు.

5 నుంచి కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

కాకినాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జరగనున్నట్టు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహాసభల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పాల్గొంటారన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

హాలికుల ఆవేదన

'అన్నీ వేచి ఉండగలుగుతాయి, వ్యవసాయం మాత్రం కాదు'— దశాబ్దాల క్రితం నెహ్రూ గుర్తించిన ఈ సత్యం ఇప్పుడు మరింత ప్రాసంగికతను సంతరించుకున్నది. ఆహార భద్రత, ఉపాధి కల్పన ఆవశ్యకతలను దృష్టిలో ఉంచుకుంటే మన వ్యవసాయ రంగానికి, రైతులకు సహాయ సహకారాలను సమృద్ధిగా ఎందుకు అందించాలో స్పష్టమవుతుంది.

2023—24లో ప్రపంచ వ్యాప్తంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి 2,875 మిలియన్ టన్నులు కాగా వినియోగం 2,843 మిలియన్ టన్నులుగా ఉన్నదని ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ నివేదిక పేర్కొంది. భావి అవసరాలకు నిల్వ చేసుకోగల ఆహార ధాన్యాలు స్వల్పాతి స్వల్ప పరిమాణంలో మాత్రమే ఉన్నాయి. అదే సంవత్సరంలో మన దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 338.29 మిలియన్ టన్నులు. దేశ ప్రజల ఆహార అవసరాలను ఇవి సమృద్ధిగా తీర్చగలుగుతాయా? ఉపాధికల్పన విషయం చూస్తే దేశ శ్రామిక శ్రేణుల్లో అత్యధికులు వ్యవసాయ రంగంలోనే ఉన్నారు. అయితే వారికి నాణ్యమైన ఉపాధి, భద్రమైన ఆదాయం ఏ మాత్రం సమకూరడం లేదు. అదే సమయంలో మరే రంగం కూడా ఈ భారీ శ్రామిక శక్తి వినియోగించుకోలేదు. ఈ వాస్తవాల దృష్ట్యా ఆహార సమృద్ధికి, ఉపాధి భద్రతకు వ్యవసాయ రంగం, రైతులకు తోడ్పడేందుకు ప్రభుత్వాలు ప్రథమ ప్రాధాన్యమివ్వాలి.

విస్మరించకూడని మరొక వాస్తవమేమిటంటే స్వాతంత్ర్యానంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల స్థితిగతుల మెరుగుదలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చాయి. అనేకానేక అధ్యయనాలు నిర్వహించాయి. రైతుల సహాయార్థం వివిధ సంస్థల నేర్పాటు చేశాయి. రైతుల ఆదాయాలను పెంపొందించేందుకై నిపుణుల సిఫారసుల కోసం వివిధ కమిషన్‌లను నియమించాయి. అయితే ఆ అధ్యయనాల, కమిషన్ల నివేదికలలోని సూచనలు, సిఫారసుల అమలుకు ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయా? చూపడం లేదన్నది నిష్ఠుర సత్యం. ఎమ్ఎస్ స్వామినాథన్ జాతీయ కమిషన్ సూచనలను కేంద్రం అమలుపరచకపోవడమే అందుకొక తిరుగులేని నిదర్శనం. 2020లో కేంద్ర ప్రభుత్వం ఆ సిఫారసులను ఉపేక్షిస్తూ మూడు కొత్త సాగు చట్టాలను తీసుకురావడంతో ఉత్తరాది రైతాంగం భగ్గుమన్నది. దేశ రాజధానిని ముట్టడించి నెలల తరబడి ఆందోళన చేసింది. రైతుల పోరాట సంకల్పాన్ని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం ఆ కొత్త సాగు బిల్లులను ఉపసంహరించుకున్నది. ఆ సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేదు. దీంతో ఉత్తరాది, ముఖ్యంగా పంజాబ్, హరియాణా రైతులు మళ్ళీ ఆందోళనకు దిగారు. గత నవంబర్ 26 నుంచి జగ్జీత్ సింగ్ డల్లేవాల్ అనే రైతునాయకుడు పంజాబ్—హరియాణా సరిహద్దుల్లో ఖనౌరీ వద్ద చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షతో 2020లో వలే ఉత్తరాది రైతుల పోరాటం ఆసేతు హిమాచలం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలుపరచాలని ముఖ్యంగా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, పంట రుణాలను పూర్తిగా రద్దు చేయాలని, సన్నకారు చిన్నకారు రైతులకు నష్టదాయకంగా పరిణమించిన కార్పొరేట్ వ్యవసాయ సానుకూల విధానాలను మార్చాలనేవి ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లుగా ఉన్నాయి. ఈ డిమాండ్లను నెరవేర్చేంతవరకు తమ ఆందోళనను విరమించేది లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. కేన్సర్ వ్యాధిగ్రస్తుడైన డల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి విషమించినా వెనకడుగువేయబోమని స్పష్టంచేస్తున్నారు. రైతుల ఉద్యమాన్ని సమాజంలోని అన్ని వర్గాల వారూ సమర్థిస్తున్నప్పటికీ వారి ఆందోళన పౌర జీవనానికి తీవ్ర అంతరాయం కలిగించడాన్ని ఎవరూ హర్షించలేకపోతున్నారు. పాలనలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పాలకులను రైతుల ఆగ్రహావేశాలు సంయమనపరుస్తాయనే సత్యాన్ని విశాల సమాజం గుర్తించాలి. ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న అరాచక చర్యలు, పార్లమెంటులో బాధ్యతగల ప్రజాప్రతినిధుల వివేచనారహిత, అసంబద్ధ ప్రవర్తనల కంటే మన ప్రజాస్వామ్యానికి ఎక్కువ హాని చేస్తాయా? ఇది డల్లేవాల్, ఆయన మద్దతుదారుల తీరుతెన్నులను సమర్థించడం ఎంత మాత్రం కాదు. ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలకు వారు సంసిద్ధమవ్వాలన్నదే అందరి కోరిక.

కొత్త సంవత్సరం మొదటి రోజున పంట బీమా పథకాల పొడిగింపు, ఎరువులపై రాయితీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రైతుల హర్షామోదాలు పొందుతాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ '2025 సంవత్సరంలో ప్రభుత్వ మొదటి నిర్ణయాన్ని కోట్లాది రైతు జనుల శ్రేయస్సుకు అంకితం చేశామని' పేర్కొన్నారు. ఈ శ్రేయో వైఖరి ప్రతీకాత్మకంగా పరిమితమవకుండా సదా వాస్తవంగా రూపుదాల్చాలన్నదే అందరి ఆకాంక్ష.

మధ్యతరగతి 'మన్మోహనం'!

డాక్టర్ మన్మోహన్ సింగ్ గత నెల 26న 92 ఏళ్ల వయసులో కీర్తిశేషుడు అయ్యారు. జూన్ 21, 1991న కేంద్ర ఆర్థిక మంత్రిగా డాక్టర్ సాబ్ ప్రమాణం చేసిన రోజు నుంచి ఆయనతో ఏర్పడ్డ నా అనుబంధం ముగిసిపోయింది.

మన్మోహన్ సింగ్ గురించి ఆయన మాటల్లోనే చెప్పాలంటే ఒక 'యాదృచ్ఛిక ఆర్థిక మంత్రి'. పీవీ నరసింహారావు తొలుత తన ఆర్థిక మంత్రిగా ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త ఐ.జి.పటేల్‌ను నియమించేందుకు ప్రాధాన్యమిచ్చారు. అయితే పటేల్ నిరాకరించి, ఆ పదవికి డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును సూచించారు. నీలిరంగు తలపాగాతో, హుందాతనం ఉట్టి పడుతున్న ఒక సిక్కు పెద్ద మనిషి ముందు వరుసలో కూర్చొని ఉండడం చూసి ఎంతో మంది విస్మయం చెందారు. ఆ గౌరవనీయుడు కేబినెట్ మంత్రిగా పదవీ ప్రమాణం చేయనున్నారనేది స్పష్టమయింది. అయితే ప్రధానమంత్రి ఆయనకు ఏ మంత్రిత్వ శాఖ కేటాయించనున్నారు? అందరిలో ఆసక్తి, ఉత్కంఠ నెలకొన్నాయి. కొద్ది గంటలలోనే ఆయన నార్త్ బ్లాక్ (ఆర్థిక మంత్రిత్వశాఖ నెలవు)లో కనిపించారు.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

జూలై 1, 1991న రిజర్వ్ బ్యాంక్ తొలి దశ రూపాయి విలువ తగ్గింపును ప్రకటించింది. జూలై 3 ఉదయం ప్రధానమంత్రి నన్ను తన కార్యాలయానికి పిలిచి, తన కేబినెట్ సహచరులు కొంతమంది రూపాయి విలువ తగ్గింపుపై వ్యక్తం చేసిన భయ సందేహాలు (నిజానికి ఇవి నరసింహారావువే) నాకు తెలిపారు. నేను పాత పాటే పాడాను. రూపాయి విలువ వాస్తవ విలువ కంటే అధికంగా ఉన్నదని, ఫలితంగా ఎగుమతులు దెబ్బ తింటున్నాయని, విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటాయని, విదేశీ మదుపుదారులు మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారని వగైరా వగైరా చెప్పాను. రూపాయి విలువను మరొకసారి తగ్గించవలసి ఉన్నదని వివరిస్తూ ఆర్థికమంత్రి వద్దకు వెళ్లి రెండవ దశ రూపాయి విలువ తగ్గింపును నిలిపివేయడం సాధ్యం కానిపక్షంలో వాయిదా అయినా వెయ్యాలని ఆయన్ను అభ్యర్థించాలని నాకు చెప్పారు. పీవీ ఇలా మన్మోహన్ వద్దకు పంపుతున్న దూతను నేను ఒక్కడినే కాదన్న భావన నాలో నిశ్చితంగా ఏర్పడింది.

సంశయాగ్రస్తుడిని అయినప్పటికీ నార్త్ బ్లాక్‌కు వెళ్లాను. ఆర్థికశాఖ అధికారులు నన్ను సాదరంగా మంత్రి వద్దకు తీసుకువెళ్లారు. మన్మోహన్ సింగ్‌తో అదే నా మొదటి అధికారిక సమావేశం. ప్రధానమంత్రి సందేశాన్ని ఆయనకు తెలియజేశాను. అది ఆదేశం కానే కాదని, అభ్యర్థన మాత్రమేనని స్పష్టంగా చెప్పాను. ఆ సందేశం, బహుశా సందేశవాహకుడు విషయమై కూడా మన్మోహన్ దిగ్భ్రమ చెందినట్టు కనిపించారు. అది ఆయన ముఖంలో స్పష్టంగా ద్యోతకమయింది. నేను చెప్పింది ఆయన శ్రద్ధగా విని, రెండో దశ రూపాయి విలువ తగ్గింపు నిర్ణయాన్ని ఆ రోజు ఉదయం పది గంటలకు మార్కెట్లు ప్రారంభమైన కొద్ది నిమిషాలకే తీసుకోవడం జరిగిందని చెప్పారు. ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ సి. రంగరాజన్‌తో మన్మోహన్ ఎలా మాట్లాడిందీ, ఆయన మాటలకు ప్రతిస్పందనగా 'వెన్వెంటనే ఆ నిర్ణయాన్ని అమలుపరచనున్నట్టు' రంగరాజన్ చెప్పిన మాటలు ఇప్పుడు ఆ చరిత్రాత్మక నిర్ణయానికి సంబంధించిన గాథావళిలో భాగంగా ఉన్నాయని మరి చెప్పనవసరం లేదు. ఈ రూపాయి విలువ తగ్గింపు ఉదంతంతో యాదృచ్ఛిక ఆర్థికమంత్రి అయిన మన్మోహన్ సింగ్ ఎంత దృఢసంకల్పుడు అన్నది స్పష్టమయింది. తాను సరైనది అనుకున్న నిర్ణయాన్ని ఆయన ఎంత దీక్షా దక్షతలతో అమలుపరుస్తారో ఆ తొలిరోజుల్లోనే విశదమయింది.

మన్మోహన్ ఎంత దృఢసంకల్పుడో కొద్ది సంవత్సరాల అనంతరం ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో పడినప్పుడు మరోసారి అందరికీ తెలిసివచ్చింది. ప్రతిపాదిత భారత్—అమెరికా పౌర అణు ఒప్పందానికి వామపక్షాల నుంచి ముఖ్యంగా సీపీఎం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయింది. అమెరికాతో ఆ ఒప్పందాన్ని ఖరారు చేసుకుంటే యూపీఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తామని సీపీఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ కటువుగా హెచ్చరించారు. ప్రధానమంత్రిని, ప్రతిపాదిత పౌర అణు ఒప్పందాన్ని సమర్థిస్తున్న కాంగ్రెస్ నాయకులు పలువురు ఆ ఒప్పందం కోసం ప్రభుత్వాన్ని త్యాగం చేయవలసి రావడం పట్ల అభ్యంతరాలు తెలిపారు. ప్రభుత్వం మెజారిటీని కోల్పోతే ఆ ఒప్పందం సైతం రద్దయిపోతుంది కదా అని వారు వాదించారు. అయినప్పటికీ మన్మోహన్ సింగ్ దృఢవైఖరితో నిలబడ్డారు. ఆ ఒప్పందాన్ని త్యజించాలని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేస్తే మన్మోహన్ ప్రధానమంత్రి పదవి నుంచి వైదొలగవలసి వస్తుందనేది స్పష్టం. మన్మోహన్ వాదన సబబైనదని నేను విశ్వసించాను. ఈ కారణంగా ఇతర పార్టీల నుంచి మద్దతు తీసుకునే అవకాశాలను అన్వేషించాలని ఆయనకు సూచించాను. ఈ విషయంలో ఆయన చాలా తెలివిగా వ్యవహరించారు. తొలుత ప్రతిపాదిత అణు ఒప్పందాన్ని సమర్థిస్తూ ఒక ప్రకటన చేయాలని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు మన్మోహన్ నచ్చచెప్పారు. కలాం ప్రకటన ఆలంబనతో ములాయంసింగ్ యాదవ్, సమాజ్‌వాది పార్టీ మద్దతును సాధించగలిగారు. ములాయం మద్దతుతో వామపక్షాల దబాయింపులను మన్మోహన్ గట్టిగా ఎదుర్కొన్నారు. లోక్‌సభలో విశ్వాస పరీక్షలో విజయం సాధించారు. దీంతో భారత్—అమెరికా పౌర అణు ఒప్పందం ఆమోదానికి అవరోధాలు పూర్తిగా తొలగిపోయాయి. కాంగ్రెస్‌కు వామపక్షాలు తమ మద్దతును ఉపసంహరించుకున్న తరువాత మన్మోహన్ తన స్వతస్సిద్ధ స్వభావానికి అనుగుణంగా ఆ పార్టీ నాయకులను ఎప్పటిలాగానే అమితంగా గౌరవించారు. వారితో సుహృద్భావపూర్వక సంబంధాలు కొనసాగించారు.



మన్మోహన్ సింగ్ పట్ల చరిత్ర కరుణ చూపినా చూపకపోయినా దేశ చరిత్రపై ఆయన ముద్ర ప్రగాఢమైనది. నవ భారతదేశ చరిత్రలో ఆయన అడుగు జాడలు అజరామరమైనవి. స్థూల దేశీయోత్పత్తి సగటు వృద్ధిరేటు 6.8 శాతంగా ఉండడం, 27 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి విముక్తం చేయడం ఆయన పాలన సాధించిన అపూర్వ ఆర్థిక విజయాలు.

మన్మోహన్ సింగ్ సంపూర్ణ మద్దతులేని పక్షంలో వివిధ ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను యూపీఏ ప్రభుత్వాలు రూపొందించి, అమలుపరచడం సాధ్యమయ్యేది కాదన్న వాస్తవం చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. ముఖ్యంగా రెండు పథకాలను ప్రత్యేకంగా ప్రస్తావించవలసి ఉన్నది. అవి: వ్యవసాయ రుణాల మాఫీ (2008), ఆహార హక్కు కార్యక్రమం (2013). ఈ రెండు సంక్షేమ కార్యక్రమాలను మన్మోహన్ చాలా గట్టిగా సమర్థించారు. వాటి ఆవశ్యకత విషయమై శక్తిమంతమైన వాదనలు చేశారు. వాటి అమలు ప్రభావం ద్రవ్యలోటుపై ఎలా ఉంటుందనే విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తుండాలని నాకు అయన సూచించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం లేని పక్షంలో ఏ సంక్షేమ కార్యక్రమాన్నీ అమలుపరచడం సాధ్యంకాదన్న వాస్తవాన్ని ఆయన సదా గుర్తుంచుకునేవారు. ఈ ఆర్థిక పరిజ్ఞానం విషయంలో ఆయనకు సాటివచ్చే రాజకీయవేత్త మరెవరూ లేరు. ద్రవ్యలోటు భర్తీ లక్ష్యాలను పరిపూర్తి చేసినప్పుడే సంక్షేమ కార్యక్రమాలకు ఆయన ఆమోదం తెలిపేవారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ స్వాభావికంగా సంస్కర్త అయినప్పటికీ పేదల శ్రేయస్సును ఎట్టి పరిస్థితులలోను విస్మరించేవారు కాదు. సంక్షేమ పథకాలను ఆయన ఎంతగానో ప్రోత్సహించారు ఆర్థిక సంస్కరణలు సంక్షేమ చర్యలు ఏక సమయంలో అమలుకావలసిన అవసరం ఎంతైనా ఉందనే విషయాన్ని ఆయన మాకు బోధించారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక విధానాలు వర్తమాన మధ్యతరగతిని సృష్టించాయని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను.

1991 తరువాత జన్మించిన వర్తమాన తరం వారు మన దేశంలో ఒకప్పుడు ఒకటే టెలివిజన్ ఛానెల్, ఒకే ఒక్క బ్రాండ్ కారు, ఒకటే పౌర విమానయాన సంస్థ, ఏకైక టెలిఫోన్ సర్వీస్ ప్రొవైడర్ ఉండేవని చెప్పితే నమ్మరేమో కదా?! ట్రంక్ కాల్స్, పీసీఓ/ఎస్‌టీడీ/ఐఎస్‌డీ బూత్‌లతో ప్రజలు సతమతమవుతుండేవారని; టూ వీలర్స్ నుంచి రైలు టిక్కెట్ల దాకా అన్నిటికీ నిరీక్షించే వారి జాబితా కొండవీటి చాంతాడంత పొడుగున ఉండేదన్న వాస్తవాలు వారికి నమ్మశక్యంగా ఉండవనడంలో అతిశయోక్తి లేదు. మన జీవన రీతులలో మహా ఆశ్చర్యకరమైన మార్పులకు బీజాలు వేసింది డాక్టర్ మన్మోహన్ సింగ్. అయితే ఈ చారిత్రక వాస్తవాన్ని ఆ నవ్య పథ నిర్దేశకుడికి తన నివాళితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర కేబినెట్ తీర్మానంతో భారత ప్రభుత్వమూ ఆలస్యంగా అంగీకరించాయి.

మన్మోహన్ సింగ్ పట్ల చరిత్ర కరుణ చూపినా చూపక పోయినా దేశ చరిత్రపై ఆయన ముద్ర ప్రగాఢమైనది. నవ భారతదేశ చరిత్రలో ఆయనవి అయిన రెండు అడుగు జాడలు అజరామరమైనవి. ఒకటి— తన పది సంవత్సరాల ప్రధానమంత్రిత్వ కాలంలో స్థూల దేశీయోత్పత్తి సగటు వృద్ధిరేటు 6.8 శాతంగా ఉండేలా చేయడంలో ఆయన అనితర సాధ్యంగా సఫలమయ్యారు; రెండు— యుఎన్‌డీపీ (ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం) ప్రకారం యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనా కాలంలో 27 కోట్ల మంది భారతీయులను పేదరికం నుంచి విముక్తం చేశాయి. ఈ ఆర్థిక విజయాలు మన దేశ చరిత్రలో అపూర్వమైనవి. మన్మోహన్ అనంతరం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వాటికి సరిసమానమైన వాటిని సాధించలేకపోయాయి. చరిత్ర ఇప్పటికే తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు శాశ్వతమైనది.

కొత్త సంవత్సరంలో రూపాయి దారెటు?

డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. జనవరి 3న రూపాయి మారకం విలువ డాలర్‌కు 85.79. డిసెంబరు 27న 85.80కు క్షీణించిన విషయం తెలిసిందే. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్న నేపథ్యంలో, 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరికీ గుర్తుకు వస్తున్నాయి. దేశ రక్షణ గురించి గానీ, రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వెటకారపు వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో మళ్ళీ ప్రత్యక్షమవుతున్నాయి. అప్పట్లో రూపాయి బాగోగుల గురించి గుండెలుబాదుకున్న పెద్దలంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు మరి.

రూపాయి విలువ ఈ స్థాయిలో పడిపోవడం ఆర్థిక నిపుణుల్లో కలకలం రేపింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవో చేపట్టింది కానీ, అవి ఏ మాత్రం ఫలితాలను సాధిస్తాయో వేచి చూడాల్సిందే. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడిపోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక నిపుణులు రకరకాల విశ్లేషణలు చేశారు. అయితే, ఎన్నికల పబ్బాలను గడుపుకునే పనిలో ఉన్న మోదీ ప్రభుత్వానికి అప్పట్లో ఈ విషయమే పట్టలేదు. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది.



రూపాయి విలువ ఈ స్థాయిలో పడిపోవడం ఆర్థిక నిపుణుల్లో కలకలం రేపింది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవో చేపట్టింది కానీ, అవి ఏ మాత్రం ఫలితాలను సాధిస్తాయో వేచి చూడాల్సిందే. గత ఏడాది సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. ఈ పతనం ఇంకొంత కాలం, ఇంకా హెచ్చుగా సాగే అవకాశాలే అధికం. అంటే ధరలు మరింత పెరగడం ఖాయం.

రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో 3వేల రూపాయలు ఉండే ఇంటి అద్దె ఇప్పుడు 15వేల రూపాయలు అయ్యింది. ఆ లెక్కన అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు. ఇప్పుడు నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా? లేదు కదా కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 85 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది.


ఈ పతనం ఇంకొంత కాలం, ఇంకా హెచ్చుగా సాగే అవకాశాలే అధికం. అంటే ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపుతున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. మన నెలవారీ బడ్జెట్ ప్రతీ నెలా పెరుగుతూండటానికి ద్రవ్యోల్బణం కూడా కారణం. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

అమెరికాతో పోల్చితే ఇండియా చాలా వేగంగా వృద్ధి చెందుతున్న దేశం. అయినా రూపాయి పతనం కావడానికి కారణం డాలర్ అంతర్జాతీయ స్టాండర్డ్ కరెన్సీగా ఉండటమే. ప్రతీ దేశమూ విదేశాలతో వ్యాపారం డాలర్ల రూపంలో చేస్తున్నాయి. దాంతో డాలర్ విలువ పెరుగుతూనే ఉంది. మనం విదేశాలతో రూపీలో వాణిజ్యం చేస్తే మన కరెన్సీ కూడా బలపడగలదు. కానీ అమెరికా అందుకు అంగీకరించక, ఆంక్షల పేరిట భయపెడుతోంది. ఆసియాలో రూపీ రూపంలో వాణిజ్యం జరపాలనే డిమాండ్లు ఉన్నాయి. ఈ దిశగా అడుగులు పడితే మన కష్టాలు తీరగలవు. బ్రిక్ దేశాలు ఉమ్మడి కరెన్సీని ప్రవేశపెట్టి డాలర్‌కి చెక్ పెట్టాల్సిన టైమ్ వచ్చింది. ఇప్పటికైనా అడుగులు పడకపోతే, భారతీయులు మరింతగా నష్టపోతారు. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వాలు ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి.

● నాదెండ్ల శ్రీనివాస్

వీరగాథల చిరునామా ఆచార్య 'తంగిరాల'

విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వవికాసానికి బాటలు వేసేవారు ఉత్తమ గురువులు. తాము సముపార్జించుకున్న జ్ఞానాన్ని, అనుభవాన్ని సమాజాభ్యుదయానికి వినియోగించేవారు అత్యుత్తమ గురువులు. జీవితాన్ని బోధనతో, పరిశోధనతో పండించుకున్న అత్యుత్తమ గురువు ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆయన స్వయంకృషితో ఎదిగారు. స్వీయ క్రమశిక్షణతో రాణించారు. అసాధారణ ప్రతిభతో వృత్తికి అంకితమై, విశ్వవిద్యాలయాల్లో బోధనకు, పరిశోధనకు కొత్తవాకిళ్ళు తెరిచి, ఆచార్య శేఖరులయ్యారు. 90 సంవత్సరాల వయస్సులోనూ నిరంతర అధ్యయనశీలిగా, నిరాడంబర సాహితీమూర్తిగా, బెంగళూరు నగరంలో తెలుగుకు వెలుగు జెండాలెత్తారు. బెంగళూరు విశ్వవిద్యాలయంలో మూడు దశాబ్దాలకు పైగా వేలాది మంది శిష్యులకు ఆరాధ్య గురువయ్యారు. విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ ప్రారంభ వికాసాలకు ఆద్యులయ్యారు. శిష్యుల్ని సొంత బిడ్డల్లా చేరదీసి మానవతా ప్రపూర్ణులయ్యారు.



తంగిరాలవారు తమ ప్రతిభకు పదునుపెట్టే క్రమంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతం పర్యవేక్షణలో 'తెలుగు వీరగాథా కవిత్వం'పై పరిశోధన చేసి, విస్మృత జానపద వీరుల గాథలను వెలుగులోకి తెచ్చారు. విషయ సేకరణ కోసం ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గ్రామాల్లో సైతం పర్యటించారు. గ్రామీణుల నాలుకలపై నర్తించే మౌఖిక గాథలకు అక్షరరూపమిచ్చారు. 1402 పుటల బృహత్పరిశోధన గ్రంథాన్ని తమ సోదరులు టీవీకే సోమయాజులు, ఇతర దాతల సహాయంతో ముద్రించి, భావి పరిశోధకులకు దారిదీపంగా నిలిచారు. ఆయా ప్రక్రియలపై ప్రామాణిక పరిశోధన చేసిన ఆచార్య బిరుదురాజు రామరాజు, ఆచార్య ఎస్వీ జోగారావు, ఆచార్య తిమ్మావజ్ఝల కోదండరామయ్య వంటి దిగ్గంతుల సరసన స్థానం సంపాదించారు. తెలుగునాట వీరగాథాకవిత్వానికి శాశ్వత చిరునామాగా నిలిచారు.

తంగిరాలవారు ఉత్తమ పరిశోధకులుగానే కాక, ఉన్నత భావాలు కలిగిన కవిగా, వేదికలను వెలిగించిన మధుర వక్తగా, 'చైతన్యకవిత' పత్రిక సంపాదకునిగా, 'శ్రీరస' సాహిత్య సంస్థ సారథిగా, తెలుగు—కన్నడ భాషల వారధిగా, 'నెలనెలా వెన్నెల' కాంతులు వెదజల్లారు. వచన కవితను వర్షించారు. పద్యాన్ని తమ లేఖినిలో పండించారు. బుద్దా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వీర సమరగాథను 'రేనాటి సూర్యచంద్రులు'గా పాఠకులకు పరిచయం చేశారు. తమ అభిమానకవి బాలగంగాధర తిలక్ సర్వలభ్య రచనల సంపుటిని 'మనసు ఫౌండేషన్' సహకారంతో ప్రచురించారు. నందిరాజు చలపతిరావు స్త్రీల పాటలను సేకరించి, 1200 పుటల ఉద్గ్రంథంగా 'అజో—విభొ—కందాళం ఫౌండేషన్' వారి ప్రచురణగా వెలుగులోకి తెచ్చారు. తెలుగునాట పేరెన్నికగన్న కవులు, రచయితలు, సాహితీవేత్తలను బెంగుళూరుకు ఆహ్వానించి, 'శ్రీరస' వేదికగా ప్రసంగాలు ఏర్పాటు చేసి సదస్యులకు రసామృతాన్ని పంచిపెట్టారు. తమకు తొలి గురువు, జీవితానికి వెలుగుదారిగా నిల్చిన అగ్రజులు సోమయాజులు స్మృతిపథంలో 'అశ్రుతర్పణం'— గ్రంథాన్ని ప్రచురించి, సోదరప్రేమను చాటుకున్నారు.

'విద్య కేవలం యాంత్రిక మేధస్సుకు సంబంధించిన పరిశ్రమగా మిగిలిపోకూడదు. హృదయం, ఆత్మపరిణతి శీలనిర్మాణానికి ఉపయోగపడేదే నిజమైన విద్య'— అనుభవాన్ని రంగరించి చెప్పిన తంగిరాలవారి సూక్తి వారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఒంగోలులో ప్రకాశం జిల్లా రచయితల మహాసభల్లో వీరగాథాకవిత్వంపై వారు చేసిన సోదాహరణ ప్రసంగం చిరస్మరణీయంగా నిలుస్తుంది. ఇటీవల ప్రచురించిన 'గురువందనం' సంచిక, సుబ్బారావు వ్యక్తిత్వాన్ని బహుముఖంగా ఆవిష్కరించింది.

కాటమరాజులాగే తంగిరాలవారు ధీరచిత్తులు. ఆజానుబాహులు. ఆర్ద్రమనస్కులు. జీవితంలో మిట్టపల్లాలు నెట్టుకుని, చెరగని చిరునవ్వును స్థిరాస్తిగా మిగుల్చుకున్న తంగిరాల వెంకటసుబ్బారావు తన గుండెపూసిన గులాబీ శకుంతలాదేవి సాహచర్యంలో జీవన సౌరభాన్ని ఆస్వాదించారు. ప్రఖ్యాత పద్యకవి చిటిప్రోలు కృష్ణమూర్తి 'పురుషోత్తముడు' కావ్యంతో పాటు, పలువురు ఆత్మీయులైన కవులు, రచయితల రచనలను అంకితం తీసుకుని అపర శ్రీకృష్ణదేవరాయలుగా కీర్తిగడించారు. తన పర్యవేక్షణలో 15 పీహెచ్‌డీలు, 28 ఎంఫిల్ పట్టాలతో పరిశోధకులను పట్టభద్రులుగా చేసి, పరిశోధక పరమేష్ఠిగా ప్రశంసలు పొందారు.

1935 మార్చి 30న తంగిరాల వెంకట సుబ్బావధానులు, సీతామహాలక్ష్మి పుణ్యదంపతులకు జన్మించిన ఈ ప్రతిభామూర్తిని అజో—విభొ—కందాళం ఫౌండేషన్ వారు 'ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం'తో జనవరి 5న విజయవాడలో సత్కరించనున్నారు. ఇది జానపద వాఙ్మయ పరిరక్షక బ్రహ్మ నేదునూరి గంగాధరం తర్వాత మౌఖికసాహిత్య ప్రచారకునిగా తంగిరాలవారికి లభించిన గొప్ప గుర్తింపు. శిష్యవాత్సల్య సంపన్నులైన ఆచార్యునికి నిండుగుండెతో చేస్తున్న సరస్వతీపూజ.

○ డా. బీరం సుందరరావు

గూడూరులో ఆంధ్ర చరిత్ర చర్చలు

కొన్ని దశాబ్దాలుగా ప్రతి జనవరి మూడో తేదీన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను భారత ప్రధాని ప్రారంభించడం, అలాగే జనవరి ఏడవ తేదీన భారత రాష్ట్రపతి సమాపన సదస్సుకు విచ్చేయడం ఆనవాయితీగా ఉండేవి. ఇటీవల కాలంలో సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు అంతరాయం కలిగినట్టుంది, ఈ సంవత్సరం దాని గురించి సమాచారమే లేదు.

కరోనా సమయంలో కుంటుబడిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు తర్వాత పుంజుకోలేకపోయాయి అని చెప్పవచ్చేమో. గత సంవత్సరం జలంధర్ దగ్గర ఉన్న విశ్వవిద్యాలయంలో సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరగాలి, చివరి నిమిషంలో వాటిని రద్దు చేసుకున్నట్టు ప్రకటించారు. ఈ సంవత్సరం సైన్స్ కాంగ్రెస్ సమావేశాల రద్దు గురించి వార్తలే కాదు, విమర్శలు కూడా వినపడటం లేదు. ప్రక్షాళన చర్యలు జరగకుండా మొత్తానికి గల్లంతుకావడం విషాదకరం, ఆందోళనాభరితం. తిరుపతి జిల్లాలోని గూడూరులో 47వ ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు జనవరి 4, 5 తేదీలలో జరుగుతున్నాయనగానే నాకు ప్రఖ్యాతమైన సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు గుర్తుకొచ్చాయి.

1974 డిసెంబర్‌లో జవహర్ భారతి కళాశాల ప్రిన్సిపల్ మలిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సుమారు 30 మంది కళాశాల ఉపన్యాసకులను కలిసినప్పుడు కాకతాళీయంగా కలిగిన ఆలోచన, తర్వాత కాలంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ రావడానికి దోహదమైంది. ఊరక ఉండనివ్వని ఆ ఆలోచన కొన్ని నెలల్లోనే ఒక క్వార్టర్లీ జనరల్ రావడానికి దారితీసింది. ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులు రాళ్లబండి సుబ్బారావు రాజమండ్రిలో స్థాపించిన ఏపీ హిస్టారికల్ రీసెర్చ్ సొసైటీ సంస్థ కూడా తోడు కావడంతో 1976లో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ మొదలైంది. తెలుగులో 'ఆంధ్రప్రదేశ్ చరిత్ర సమాఖ్య'గా పిలవబడే ఈ సంస్థ మంచి ప్రచురణలను వెలువరించింది. మరీ ముఖ్యంగా నాలాంటి వారికి ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి గురించి ప్రచురించిన సంపుటాలు విలువైన నిధులే.



ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులు రాళ్లబండి సుబ్బారావు రాజమండ్రిలో స్థాపించిన ఏపీ హిస్టారికల్ రీసెర్చ్ సొసైటీ సంస్థ కూడా తోడు కావడంతో 1976లో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ మొదలైంది. 'ఆంధ్రప్రదేశ్ చరిత్ర సమాఖ్య' మంచి ప్రచురణలను వెలువరించింది. ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సంస్కృతి గురించి ప్రచురించిన సంపుటాలు విలువైన నిధులు.

ఇదివరకటి కన్నా ఇప్పుడు భావ పరంపరలను పంచుకోవడానికి చాలా మార్గాలు సులువుగా అందుబాటులోకి వచ్చాయి. అయినా కూడా వ్యక్తిగతమైన స్పర్శ మరింత అర్థవంతమైన రీతిలో మన ఆలోచనను, అవగాహనను పరిపుష్టం చేసుకోవడానికి దోహదపడుతుంది. సోషల్ మీడియా విశృంఖలంగా అందుబాటులోకి వచ్చాక; అసలుకు, నకిలీకి రూపంలో తేడాలు నశించాక సమావేశాలు, వ్యక్తిగత పరిచయాలు మరింత అవసరమనిపిస్తోంది. తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట మండలాలతో, సముద్రతీరం ఉన్న ఏకైక రాయలసీమ జిల్లాగా తిరుపతి జిల్లా ఏర్పడింది. నెల్లూరుకు 35 కిలోమీటర్లు, తిరుపతికి 95 కిలోమీటర్లు, మద్రాసుకు 135 కిలోమీటర్ల దూరంలో ఉండే గూడూరు చారిత్రకంగా చాలా కీలకమైంది. పరిశోధకుల ప్రకారం భారతదేశంలోనే తొలి నాగరికత కలిగిన తాలూకా ఈ గూడూరు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక రేవు పట్టణాలు కలిగిన, అత్యధిక తీరం కలిగిన ప్రాంతం కూడా ఇదే. ప్రాచీన నాగజాతి, బోయలకు కేంద్ర స్థానం. మౌర్యులు, శాతవాహనులకు వాణిజ్యకేంద్రంగా గ్రీకు, రోమన్, చైనా దేశాలతో వ్యాపారం, వాణిజ్యం సాగించిన ప్రాంతం కూడా ఇదే. దక్షిణాఫ్రికా, సింగపూర్, మలేసియాలకు చెన్నూరు చేనేత వస్త్రాలను ఎగుమతి చేయడమే కాకుండా; విందూరు చాపలను విదేశాలకు అందించిన చరిత్ర కూడా కలిగిన ప్రాంతమిది. ఇలా ఎన్నో ప్రాధాన్యతలతో పాటు నాణ్యమైన నిమ్మ పంటను, పెద్ద స్థాయిలో పండించే ప్రాంతం కూడా ఇదే. ఈ గూడూరు ప్రాంతంలో శిల్పకళతో శోభిల్లే దేవాలయాలు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఇటువంటి గూడూరులో మొదటిసారి ఆంధ్రప్రదేశ్ చరిత్ర సమాఖ్య సమావేశాలు జరగడం ఆనందదాయకం.

ఒక్క తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా కర్ణాటక, కేరళ, తమిళనాడు, బిహార్, గుజరాత్ వంటి రాష్ట్రాలు భాషా ప్రాతిపదికన రావడానికి కారణం పొట్టి శ్రీరాములు. అయితే ఈ విషయాన్ని తెలుగువారే దాదాపు మర్చిపోయారని, ఇతర భాషా ప్రాంతాలలో పొట్టి శ్రీరాములు తెలియని వ్యక్తిగా పరిణమించారని 2003 మార్చి 30న ప్రముఖ చరిత్రకారులు డాక్టర్ రామచంద్ర గుహ 'ది హిందూ' పత్రికలో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పొట్టి శ్రీరాములు 1952 డిసెంబర్ 15 రాత్రి 11 గంటల తర్వాత కన్నుమూసిన సందర్భంలో చాలా చోట్ల గొడవలు, ఆస్తినష్టం సంభవించాయి. ఆ రోజు విజయవాడ రైల్వే స్టేషన్‌లో కూడా జరిగిన విధ్వంసాన్ని కళ్లారా చూసిన గాంధేయవాది, వినోబాభావే భూదాన యాత్ర సహచరుడు జీవీ సుబ్బారావు ప్రకారం 1952 డిసెంబర్ 15, 1953 అక్టోబర్ 1వ తేదీ మధ్యకాలంలో జరిగిన రాజకీయ సంఘటనలను పూర్తిగా నమోదు చేయలేదు, విశ్లేషణ చేయలేదు. జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, సి. రాజగోపాలాచారి, భోగరాజు పట్టాభి సీతారామయ్య రాజకీయవ్యూహాల గురించి పెద్దగా చర్చించిన, నిలకడైన విశ్లేషణలు అందుబాటులోకి రాలేదు. ఇలాంటి ఎన్నింటినో ఆధునిక కాలానికి అవసరమైన రీతిలో చరిత్రకారుల సదస్సులు చర్చించవచ్చు, విశ్లేషణలు చేయవచ్చు!

▪ డా. నాగసూరి వేణుగోపాల్



దత్తపీఠంలో సీఎం చంద్రబాబు

పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో సీఎం చంద్రబాబు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గణపతి సచ్చిదానంద స్వామీజీతో భేటీ అయ్యారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.



పుస్తకమ్

6లో

పుస్తక మహోత్సవానికి పెరుగుతున్న రద్దీ

కూచిపూడి, అమరావతి వైభవం చాటేలా..

ఎయిర్‌పోర్టు కొత్త బిల్డింగ్

* జూన్ నెలాఖరుకు పూర్తిచేయాలని సీఎం ఆదేశం
* పనులను పరిశీలించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

8లో



బుడమేరు పునర్నిర్మాణానికి పటిష్ఠ ప్రణాళిక

వరద నష్టం పునరావృతం కానివ్వం

* 40 వేల క్యూసెక్కుల ప్రవాహం వచ్చినా తట్టుకునేలా చేస్తాం
* డైవర్షన్ చానల్ సామర్థ్యం పెంపునకు ప్లాన్
* పాత చానల్ కూడా అభివృద్ధి : నిమ్మల
* కేంద్రం సహకారంతో విస్తరణ పనులు : నారాయణ
* వరద నియంత్రణపై 3 శాఖలతో సమీక్ష



బుడమేరు ప్రక్షాళనపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రులు నిమ్మల రామానాయుడు, నారాయణ

విజయవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : వరద నష్టం పునరావృతం కాకుండా బుడమేరు పునర్నిర్మాణానికి పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా విజయవాడ నగరం భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్నారు. బుడమేరు వరద నియంత్రణపై శుక్రవారమిక్కడి ఇరిగేషన్ క్యాంప్ కార్యాలయంలో ఆయన, పురపాలక మంత్రి పి.నారాయణ 3 శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం నిమ్మల విలేకరులతో మాట్లాడారు. సీఎం సూచనలతో బుడమేరు వరదలపై జలవనరులు, పురపాలక, రెవెన్యూ శాఖలు ఇప్పటికే నాలుగు మిగతా 6లో..



భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం నగరంలో ఘనంగా జరిగింది. నటుడు బ్రహ్మానందం, నటి రేణూదేశాయ్, భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

8లో

మల్లవల్లి పారిశ్రామికవాడలో పోలీస్ పహారా

భారీగా మోహరించిన రెవెన్యూ, పోలీసులు

పారిశ్రామికవాడలోని భూమి స్వాధీనం

* బందోబస్తు నడుమ అభివృద్ధి పనులు
* 17మందికి పైగా రైతులు గృహ నిర్బంధం
* మల్లవల్లిలో 144 సెక్షన్ విధింపు
* నష్టపరిహారం ఇవ్వకుండా ఇదేం చర్య : రైతులు

6లో

ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిల్

డ్రైవర్ ముందుచూపుతో తప్పిన ప్రమాదం

ఎదురు వాహనాలపైకి దూసుకెళ్లకుండా పక్కకు మళ్లించిన డ్రైవర్

కార్ల షోరూమ్‌లోకి వెళ్లి ఆగిన బస్సు

పలువురికి గాయాలు.. ప్రసాదంపాడు వద్ద ఘటన



ప్రసాదంపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ సమయస్ఫూర్తితో బస్సు నడపడంతో ఎంతోమంది ప్రాణాలు నిలిచాయి. నిత్యం రద్దీగా ఉండే ఏలూరు వెళ్లే జాతీయ రహదారిలో ప్రసాదంపాడు వద్ద శుక్రవారం విజయవాడ నుంచి హనుమాన్ జంక్షన్ వెళ్తున్న మెట్రో ఎక్స్‌ప్రెస్ 252బీ బస్సు బ్రేక్ ఫెయిలై అదుపుతప్పింది. ఈ ఘటనలో మూడు కార్లు, ఓ ద్విచక్రవాహనం దెబ్బతిన్నాయి. ఇద్దరు వ్యక్తులు, ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు.

బ్రేక్ ఫెయిల్ కావడం వల్లే..

డ్రైవర్ శ్యామ్‌ప్రసాదరావు కథనం మేరకు.. 'ప్రసాదంపాడు ఏపీ సీడ్స్ వద్ద ఉన్న బస్టాప్ నుంచి ప్రయాణికులను ఎక్కించుకున్నాను. నేను నడుపుతున్న బస్సు ఎదురుగా ద్విచక్ర వాహనాలు, కార్లు ఉన్నాయి. అదే సమయంలో స్కోడా షోరూమ్ ఎదురుగా ఉన్న యూటర్న్ వద్ద మూడు కార్లు వెళ్తున్నాయి. ఎడమ పక్కన మార్జిన్ వద్ద బస్సును నడుపుతున్నాను. యూటర్న్ వద్ద బ్రేక్ వేయాల్సి వచ్చింది. బ్రేక్ వేయడానికి ప్రయత్నించినా అవ్వలేదు. బ్రేక్ ఫెయిల్ అయినట్టు తెలిసింది. దీంతో బస్సు నిలపడం కష్టమని భావించాను. ముందుకెళ్తే చాలామంది మిగతా 6లో..



పుస్తక మహోత్సవానికి సందర్శకుల తాకిడి

ఆంగ్లంపై మక్కువ!

పుస్తక మహోత్సవంలో కొత్త ఒరవడి

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో ఈ ఏడాది కొత్త ఒరవడి కనిపిస్తోంది. పాఠకుల్లో ఎక్కువమంది ఇంగ్లీషు పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. పెద్దలు, చిన్నపిల్లలు తెలుగు పుస్తకాల కంటే ఇంగ్లీషు పుస్తకాలనే కొనుగోలు చేస్తున్నారని ప్రచురణకర్తలు చెబుతున్నారు. పుస్తక మహోత్సవానికి తల్లిదండ్రులు పిల్లలను తీసుకు వస్తున్నారు. ఎక్కువ మంది పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో విద్యాభ్యాసం సాగిస్తున్నందున తల్లిదండ్రులు ఇంగ్లీష్ పుస్తకాలను కొనిస్తున్నారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిప్లమో కోర్సులు చేస్తున్న విద్యార్థులు ఈ పుస్తకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలే కాకుండా ఇంగ్లీష్ వివిధ ప్రముఖులు రాసిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. సాహిత్య పుస్తకాలను చదివే అభిలాష ఉన్న వాళ్లు ఆంగ్ల సాహిత్య పుస్తకాలను తీసుకుంటున్నారు. కొన్ని విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు పుస్తక మహోత్సవంలో కొనుగోలు చేయాల్సిన పుస్తకాల పేర్లను రాసి ఇస్తున్నారు. తల్లిదండ్రులకు చెప్పి ఆ పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మహిళలు, యువతులు సైతం ఇంగ్లీషు పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారని ప్రచురణకర్తలు చెబుతున్నారు. ఇప్పటి వరకు పుస్తక మహోత్సవాల్లో ఇలాంటి ఒరవడి కనిపించలేదని స్పష్టం చేస్తున్నారు.

ఆధ్యాత్మికంపై ఆసక్తి

- రాజశేఖరరెడ్డి, మంగళగిరి



నాకు భగవద్గీత అంటే చాలా ఇష్టం. ఇప్పటి వరకు అనేకసార్లు ఈ పుస్తకాన్ని చదివాను. ఇందులో మంచి, చెడుల గురించి వివరిస్తూ.. ఏ సమయంలో మనం ఎలా నడుచుకోవాలో బోధిస్తుంది. ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్నా. ఐదో తరగతి నుంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నాను. ఇప్పటి వరకు 50 పుస్తకాలు చదివాను. వివేకానంద గురించి రాసిన 'మేలుకో నేస్తం' పుస్తకం నా తొలి పుస్తకం. ఆధ్యాత్మిక పుస్తకాలు చదవడానికి ఎక్కువ ఇష్టపడతా. మా స్కూల్‌లో వారానికి ఒకసారి లైబ్రరీ పీరియడ్ ఉంటుంది. ఇందులో తెలుగుతోపాటు హిందీ, ఇంగ్లీష్ కథల పుస్తకాలను చదివిస్తారు.



శర్మ శతకం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న గుమ్మా సాంబశివరావు, చలపాక ప్రకాష్ తదితరులు

శర్మ శతకం గ్రంథావిష్కరణ

విజయవాడ కల్చరల్ : సామాజిక, సమకాలీన, రాజకీయ అంశాలను స్పృశిస్తూ కవి, రచయిత శర్మ సీహెచ్, రాసిన శర్మ శతకము పద్య సంపుటి శుక్రవారం ఆవిష్కృతమైంది. పుస్తక ప్రదర్శనలో భాగంగా శుక్రవారం రైటర్స్ స్టాల్‌లో సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శర్మ రాసిన పద్యాలు సమాజానికి ఉపకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రచయిత శర్మ సీహెచ్, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు చిల్లర భవానీదేవి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, 64 కళలు డాట్‌కామ్ ఎడిటర్ కళాసాగర్ పాల్గొన్నారు.

నేటికీ మార్గదర్శకం.. నార్ల చిరంజీవి సాహిత్యం

నేటి బాలలే రేపటి నాయకులని గుర్తించి, వారి హృదయాలను అభ్యుదయ భావాలతో నింపేందుకు అప్రతిహత కృషి చేసిన సాహిత్యవేత్త నార్ల చిరంజీవి అని ప్రముఖ కవి, విమర్శకుడు సీతారాం అన్నారు. రామోజీరావు సాహిత్య వేదికపై నిర్వహించిన నార్ల చిరంజీవి శతజయంతి సభలో ఆయన ప్రసంగించారు. నార్ల చిరంజీవి 70 సంవత్సరాల క్రితం రాసిన 'తెలుగుపూలు' పుస్తకం నేటికీ బాలలకూ, తల్లిదండ్రులకూ, ఉపాధ్యాయులకూ మార్గదర్శకంగా వుందని సీతారాం తెలిపారు. అయితే నార్ల చిరంజీవి సేవలు కేవలం బాలసాహిత్యానికే పరిమితం కాలేదని, ఆయన రచనలు అభ్యుదయ భావాలు, ప్రజాస్వామ్య పరిరక్షణలో కూడా ప్రధాన పాత్ర పోషించాయని అన్నారు. నార్ల చిరంజీవి సామ్యవాద భావాలను హింసలేకుండా పిల్లలకు కథల ద్వారా అందించిన ఘనత కలిగిన వ్యక్తి అని ఆకాశవాణి పూర్వ సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి పేర్కొన్నారు. ఆయన కథలు సమాజానికి ఆచరణ సాధ్యమైన మార్గాలను సూచించాయని చెప్పారు. కార్యక్రమంలో శ్రీశ్రీ పబ్లిషర్స్ అధినేత విశ్వేశ్వరరావు, సాహితీ మిత్రులు, సంస్థ నిర్వాహకులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.




దేశానికే గర్వకారణం రతన్ టాటా

- ఎఫ్‌ట్రానిక్స్ అధినేత దాసరి రామకృష్ణ

దేశాభివృద్ధిలో పరిశ్రమల పాత్రను గుర్తించి దానిని సమాజం, ప్రభుత్వం అంగీకరించే స్థాయికి చేర్చిన విశిష్ట పారిశ్రామికవేత్త రతన్ టాటా అని ఎఫ్‌ట్రానిక్స్ అధినేత దాసరి రామకృష్ణ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా రతన్ టాటా ప్రతిభా వేదికపై నిర్వహించిన ప్రత్యేక సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. రతన్ టాటా నడిచే మార్గం ఇతర పారిశ్రామికవేత్తలకు ఆదర్శమని, ఆయన పరిశ్రమల అభివృద్ధికి మాత్రమే కాకుండా సమాజ శ్రేయస్సు కోసం చేసిన కృషి ప్రశంసనీయమని రామకృష్ణ పేర్కొన్నారు. పారిశ్రామికరంగంలో దీర్ఘకాలిక విజయాలు సాధించాలంటే సామాజిక బాధ్యతలు నిర్వర్తించాలి. ఈ సూత్రాన్ని రతన్ టాటా తమ జీవితంతో నిరూపించారు అని అన్నారు. రతన్ టాటా వంటి వ్యక్తులు పరిశ్రమల ప్రాధాన్యాన్ని మాత్రమే కాకుండా, వారి సామాజిక బాధ్యతను కూడా అందరికీ గుర్తుచేశారని అభిప్రాయపడ్డారు. ఇది సమాజ, అభివృద్ధికి మార్గదర్శకమని చెప్పడంలో సందేహం లేదన్నారు.

సరిహద్దుల్లో సాహసవీరులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్)



భారతదేశానికి, పాకిస్థాన్‌కు మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి రేయింబవళ్లు సైనికుల పహారా. చలిపులి వణికిస్తున్నా, వర్షం తడిపి ముద్ద చేస్తున్నా అనుక్షణం అప్రమత్తంగా ఉండే నిలువెత్తు సింహాలు మన జవాన్లు. సరిహద్దుల్లో ప్రతికూలం వాతావరణం ఎప్పటికప్పుడు మారుతుంటుంది. ఒకవైపు మంచుతో కప్పబడి ఉంటే.. మరో చోట ఎండలు మండిపోతాయి. మంచు తెరల వెనక ఉగ్రమూకల అరాచకాలు నిత్యం వేడిని రగిలిస్తూనే ఉంటాయి. సరిహద్దుల్లో పరిస్థితులు, జవాన్లు పడుతున్న కష్టాలు, ఆపరేషన్ల సమయంలో ఎదురయ్యే సవాళ్ల ఇటువంటి విషయాలను 'భారత సైనికుల వీరగాధలు' పుస్తకం తెలియజేస్తుంది. మాజీ లెఫ్టినెంట్ జనరల్ సతీష్ దువా ఈ పుస్తకాన్ని రాశారు. ఎల్‌ఓసీ వద్ద సర్జికల్ స్ట్రయిక్స్ ముందుండి నడిపించడం, ఎల్‌ఓసీ వద్ద సైనికుల జీవితం, నేనూ నా హెల్మెట్, మృత్యువుకు అతి దగ్గరగా.., గ్రామంలో ఒక మహిళ, సైనికుడికి ఫోన్ చేయకండి, ఒక హీరో కథ, విషాద వార్త వంటి అంశాలతో సరిహద్దుల్లో ఉన్న పరిస్థితులకు ఆయన అక్షరరూపం ఇచ్చారు. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబరు 157 అజు పబ్లికేషన్స్‌లో ఈ పుస్తకం అందుబాటులో ఉంది.

కవలపూడి కథలకు కాంప్లిమెంట్స్

పుస్తకప్రియులు పుస్తకాలను చదివే సమయంలో ఎంతవరకు చదివారో గుర్తుకోసం ఆ పేజీల వద్ద కాగితాలను పెడతారు. లేకపోతే చదివిన పేజీని మడతపెడతారు. దీన్ని బుక్‌మార్క్‌గా వ్యవహరిస్తారు. ఈసారి పుస్తకమహోత్సవంలో కొత్తగా ఈ బుక్‌మార్క్‌లను కానుకలుగా ఇస్తున్నారు. కొంతమంది రచయితలు రాసిన పుస్తకలను కొనుగోలు చేసిన వారికి ఈ బుక్‌మార్క్‌లను ఉచితంగా ఇస్తున్నారు. వాటిపై ఆ రచయితలు రాసిన పుస్తకాల పేర్లను, చిత్రాలను ముద్రించారు.





బహిరంగ సభలో ప్రసంగిస్తున్న వి.శ్రీనివాసరావు

విభజన హామీలు మరిచిన మోదీ!

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఎద్దేవా

తిరువూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగురాష్ట్రాలు తనకు రెండు కళ్లు అని కపటి ప్రేమ కురిపించిన ప్రధాని మోదీ విభజన హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, అధికారాన్ని కాపాడుకునేందుకు, ప్రజల్లో మతతత్వాన్ని పెంచేకుట్రకు బీజేపీ పూనుకుందని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సీపీఎం 25వ జిల్లా మహాసభలు పురస్కరించుకొని, స్థానిక ఫ్యాక్టరీ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఎన్టీఆర్ తెలుగువాడి ఆత్మగౌరవం నినాదాన్ని, రాష్ట్ర పాలకులు ఢిల్లీలో తాకట్టుపెట్టారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థల సంక్షేమమే లక్ష్యంగా పాలనసాగిస్తు, ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నాయన్నారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటనలో ఉక్కుఫ్యాక్టరీ సంరక్షణ, విభజన హామీలపై ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ నాయకులు చిగురుపాటి బాబూరావు, డీవీ కృష్ణ, సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, కాశీనాథ్, శ్రీదేవి, గుళ్లపల్లి వెంకరత్నం తదితరులు ప్రసంగించారు. పార్టీశ్రేణులు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించడంతో పట్టణం ఎరుపెక్కింది.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

నూతనోత్సాహంతో సేవలందించండి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కొత్త ఏడాది మరింత ఉత్సాహంతో పనిచేసి అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను కోరారు. ఏపీ ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లాశాఖ 2025 క్యాలెండర్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు సమర్థవంతమైన సేవలందించడంలో ఉద్యోగులది కీలకపాత్ర అన్నారు. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ చేయడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు పి.రమేష్, కోశాధికారి బి.సతీష్‌కుమార్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో డిజిటల్ లైసెన్సు విధానం

» ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ వనరులైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారానికి అనుమతి లైసెన్స్ విధానంలో డిజిటల్ ఆన్‌లైన్ వ్యవస్థను అమలుచేస్తున్నట్టు ఏపీ వ్యవసాయ శాఖ సంచాలకుడు ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మంగళగిరిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ వనరుల తయారీదారులు, పంపిణీదారులు, డీలర్లు ప్రస్తుత విధానంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించి, క్రయ విక్రయాలను మరింత సులభతరం చేయడానికి డిజిటల్ లైసెన్స్ విధానం ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. డిజిటల్ లైసెన్స్ ఆన్‌లైన్ నిర్వహణ వ్యవస్థను 2025 నుంచి అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. డిజిటల్ ఆన్‌లైన్ వ్యవస్థతో వ్యాపారుల లైసెన్సు కాలపరిమితి, వారి దరఖాస్తు ఏ దశలో వున్నదో సూచించడం, రెన్యువల్ తదితర విషయాలను (మెసేజ్) సంక్షిప్త సమాచారంతో దరఖాస్తుదారునికి తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

యువతలో స్ఫూర్తినింపడమే లక్ష్యం

మంత్రి కొల్లు రవీంద్ర

» భావితరాల భవిష్యత్తుకు యువకెరటాలు నాంది : మంత్రి సవిత

» అలరించిన నాట్య ప్రదర్శనలు

» చిత్రలేఖనం పోటీలకు 10,500 మంది విద్యార్థులు

» ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు దరఖాస్తు





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, హాజరైన యువత, విద్యార్థులు

మచిలీపట్నం టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : యువతలో స్ఫూర్తినింపడమే లక్ష్యంగా యువకెరటాలు నిర్వహిస్తున్నామని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. యువకెరటాలు 2025 కార్యక్రమంలో శుక్రవారం సాయంత్రం కొల్లు రవీంద్ర ప్రసంగించారు. 2014 నుంచి 2019 వరకు దిగ్విజయంగా నిర్వహిస్తూ వచ్చామన్నారు. 2019లో ప్రభుత్వం మారాక పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యువతను చైతన్యవంతం చేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రం నుంచి కూడా ఒలింపిక్ మెడల్స్ తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని, అందుకే ఒలింపిక్ క్రీడాకారులను ఇక్కడకు రప్పించామన్నారు. ప్రపంచ చెస్ ఛాంపియన్ మన తెలుగుబిడ్డ కోనేరు హంపి నిలవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంతో మందిని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా యువకెరటాలు నిర్వహిస్తున్నామని, ఎన్నడూ లేని విధంగా 15 వేల మంది చిన్నారులతో తొలి రోజు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. భావితరాల భవిష్యత్తుకు యువకెరటాలు నాంది పలికిందని రాష్ట్ర వెనుకబడిన తరగతులు, ఈడబ్ల్యుఎస్ సంక్షేమం, చేనేత జౌళిశాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన యువకెరటాలు కార్యక్రమాన్ని మంత్రి సవిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు, మంత్రి రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ, కుమారుడు కొల్లు పునీత్, వీరంకి గురుమూర్తి, మోటమర్రి బాబాప్రసాద్, బండి రామకృష్ణ, మాదివాడ రాము, గడ్డం రాజు, బత్తిన దాసు, గొర్రెపాటి గోపీచంద్, ఎండి ఇలియాస్ పాషా, యార్లగడ్డ సీతారామయ్య, గోపు సత్యనారాయణ, లంకిశెట్టి నీరజ, సుశీల, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన కార్యక్రమాలు

యువకుల కేరింతలు.. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు.. ప్రముఖకళాకారుల కూచిపూడి నాట్య ప్రదర్శనలతో యువకెరటాలు 2025 నగర యువతను ఉర్రూతలూగించింది. వేలాది ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో హిందూ కళాశాల ప్రాంగణం మార్మోగింది.

బుడమేరు పునర్నిర్మాణానికి పటిష్ఠ ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

సార్లు సమీక్షలు జరిపాయన్నారు. 'వరదల సమయంలో బుడమేరు నుంచి వెళ్లే ప్రవాహ వేగాన్ని పెంచడంతో పాటు 40 వేల క్యూసెక్కులు వచ్చినా తట్టుకునే విధంగా భవిష్యత్ ప్రణాళికను తయారు చేస్తున్నాం. దీనిపై సమగ్ర నివేదికను సీఎంకు అందిస్తాం. బుడమేరు డైవర్షన్ కెనాల్ సామర్థ్యం ప్రస్తుతం 17,500 క్యూసెక్కులు మాత్రమే ఉంది. దానిని 37,500 క్యూసెక్కులకు పెంచడంతో పాటు పెండింగ్ పనులు పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం. వెలగలేరు రెగ్యులేటర్ నుంచి కొల్లేరు వరకు పాత చానల్ సామర్థ్యాన్ని పెంచేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. బుడమేరు చానల్‌కు సమాంతరంగా పాత చానల్‌ను కూడా 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కొల్లేరు నుంచి వరద నీరు ఎటువంటి అడ్డంకులూ లేకుండా సముద్రంలోకి వెళ్లేలా ఉప్పుటేరును అభివృద్ధి చేస్తాం. ఈ అంశంపై ఈ నెల 18న మరోసారి సమీక్ష చేస్తాం' అని వివరించారు. 2014-19 నడుమ టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు డైవర్షన్ చానల్ సామర్థ్యాన్ని 35 వేల క్యూసెక్కులకు పెంచేందుకు రూ.464 కోట్లతో టెండర్లు ఖరారు చేశామని, అప్పట్లో 80 శాతం పనులు కూడా పూర్తి చేశామని చెప్పారు.

అయితే, గత ప్రభుత్వం నిధులున్నా మిగిలిన 20 శాతం పనులకు సంబంధించి తట్ట మట్టికి గానీ, బస్తా సిమెంటుకు గానీ ఖర్చు చేయలేదని.. ఎనికేపాడు యూటీ నుంచి కొల్లేరు వరకు వెళ్లే చానల్ విస్తరణ పనులను కూడా రద్దు చేసిందన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. బుడమేరు వరద నియంత్రణ ప్రణాళికను కేంద్రానికి నివేదించి దాని సహకారంతో విస్తరణ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం బుడమేరు టెండర్లు రద్దు చేయకుండా ఉంటే విజయవాడ ముంపునకు గురయ్యేది కాదని చెప్పారు. బుడమేరు, కృష్ణానదికి ఒకేసారి వరద వస్తే ఏం చేయాలో ప్రధానంగా చర్చించామన్నారు. దీనిపై విపత్తు నిర్వహణ శాఖతో కూడా చర్చించాల్సి ఉందని తెలిపారు. సమీక్షలో జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కన్నబాబు, సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, ప్రభుత్వ సలహాదారు-ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు.

మల్లవల్లి పారిశ్రామికవాడలో పోలీస్ పహారా

హనుమాన్ జంక్షన్ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి పారిశ్రామికవాడ వద్ద శుక్రవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. పారిశ్రామికవాడను అభివృద్ధి చేసేందుకు అడ్డుగా ఉండి, అన్యాక్రాంతమైన భూములను తిరిగి ఏపీఐఐసీకి అప్పగించేందుకు భారీగా మోహరించారు. నష్టపరిహారం కోసం పోరాడిన సుమారు 17 మందికిపైగా రైతులను గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. గ్రామంలో 144 సెక్షన్ విధించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే దారికి ఇరువైపులా ఉన్న భూమిలోని చెట్లను తొలగించి చదును చేయడంతో పాటు రహదారుల నిర్మాణానికి పనులు మొదలుపెట్టారు. పారిశ్రామికవాడకు వెళ్లే ప్రధాన రహదారి (గ్రీన్‌ఫీల్డ్ రహదారి)తో పాటు మల్లవల్లి, గొల్లపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులను బ్యారికేడ్లతో దిగ్బంధించారు. రెవెన్యూ, పోలీసు అధికారులను తప్ప ఇతరులను అనుమతించలేదు. పరిశ్రమలకు వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడ్డారు. ఫ్యాక్టరీల ప్రతినిధులను గుర్తింపుకార్డులను చూసి మాత్రమే అనుమతించారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఉయ్యూరు ఆర్డీవో హేలాషరోన్, జోనల్ మేనేజర్ బాబ్జీ, చీఫ్ ఇంజనీర్ (మాజీ జోనల్ మేనేజర్) సీతారాం, తహసీల్దార్ నాగభూషణం, రెవెన్యూ, సర్వే సిబ్బంది పర్యవేక్షణలో ఈ పనులు జరిగాయి.

భూ వివాదానికి కారణం రెవెన్యూ అధికారులే : రైతులు

అభివృద్ధికి అడ్డుపడబోమని, నష్టపరిహారం అందజేస్తే చాలని గతంలో పారిశ్రామికవాడకు వచ్చిన పవన్ కల్యాణ్‌కు, యువగళం పాదయాత్రలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో నారా లోకేశ్‌కు విన్నవించామని ప్రసాద్ అనే రైతు తెలిపారు. అధికారంలోకి రాగానే సమస్యను పరిష్కరించి నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అభివృద్ధికి అడ్డుపడని తమపై బలవంతపు అరెస్టులు, గృహ నిర్బంధాలు ఎందుకని ప్రశ్నించారు. ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారుల నియంతృత్వ ధోరణి కేవలం రెచ్చగొట్టే చర్యలేనని శ్రీనివాసరావు, మురళీకృష్ణ, రామకృష్ణ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

'రిజిస్ట్రేషన్ సింగ్'.. అవినీతి కింగ్!

» సబ్‌రిజిస్ట్రార్ అరెస్టు, రిమాండ్

» 2023లోనే ఏసీబీ సీఐయూ సోదాలు

» అప్పటి నుంచి పరారీలో ఉన్న సింగ్

» జగన్ సన్నిహిత ఎమ్మెల్సీ సాయం?

విజయవాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ పరారీలో ఉన్న ఎల్.బాలాజీసింగ్ అలియాస్ సింగ్‌ను ఎట్టకేలకు ఏసీబీ సీఐయూ విభాగం అరెస్టు చేసింది. 2023 నుంచి ఆయన పరారీలో ఉన్నారు. ఆ ఏడాది నవంబరులో ఏసీబీ అధికారులు ఆయన ఇంట్లో సోదాలకు వెళ్లినప్పుడు ప్రహరీదూకి పారిపోయారు. అప్పటి నుంచి ఏసీబీకి చిక్కలేదు. తాజాగా రెండు రోజుల క్రితం అరెస్టు చేసి సింగ్‌ను జైలుకు పంపారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని సింగ్‌పై ఫిర్యాదులు రావడంతో ఏసీపీ అధికారులు అప్పట్లోనే సోదాలు చేశారు. ఏసీబీ సీఐయూ విభాగానికి చెందిన ఎనిమిది బృందాలు ఇందులో పాల్గొన్నాయి. ఇబ్రహీంపట్నంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, గొల్లపూడిలోని సింగ్ నివాసంలో రెండు బృందాలు సోదాలు చేశాయి. సింగ్ స్వగ్రామం గుంటూరు జిల్లా కొల్లూరులోని భవానీమాత ట్రస్టు, విజయవాడ దుర్గాపురంలోని లలితా పరమేశ్వరి పీఠంలోనూ అధికారులు తనిఖీ చేశారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలోను, రంగారెడ్డి జిల్లా నార్సింగిలోను భారీగా ఆస్తులను కూడగట్టారనే ఆరోపణలు ఉన్నాయి. విజయవాడలో పదేళ్లపాటు సింగ్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేశారు. గుణదల,గాంధీనగర్‌లో పనిచేసినప్పుడు భారీగా సొమ్ములు గుంజినట్టు ఆరోపణలున్నాయి. గాంధీనగర్‌లో పనిచేసినప్పుడు సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న సత్రంలో సింగ్ ప్రత్యేకంగా ఒక కార్యాలయాన్ని నిర్వహించినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. 2023లో చేపట్టిన సోదాల్లో సింగ్ ఇంట్లో భారీగా నగదు, బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సింగ్ ఆస్తి రూ.10 కోట్లకు పైగా ఉన్నట్టు గుర్తించారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఓ ఎమ్మెల్సీ ప్రొద్బలంతో సింగ్ ఈ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.



మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్‌రావు

రేపు ట్రాఫిక్ ఆంక్షలు

» హైందవ శంఖారావం మహాసభ పురస్కరించుకుని మళ్లింపు

» కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

మచిలీపట్నం/గన్నవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం బహిరంగ సభ ఉన్న కారణంగా ట్రాఫిక్ మళ్లింపు చేసినట్లు కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆదివారం రాత్రి 10 గంటల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.

- విశాఖపట్నం నుంచి చెన్నై వైపు వాహనాలు కాకినాడ జిల్లా కత్తిపూడి సెంటర్ నుంచి వయా కాకినాడ, యానాం, అమలాపురం, రాజోలు, నరసాపురం, మచిలీపట్నం, రేపల్లె, బాపట్ల మీదుగా ఒంగోలు వెళ్లాలి.
- చెన్నై నుంచి విశాఖపట్నం వైపు వాహనాలు ఒంగోలు నుంచి త్రోవగుంట, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, మచిలీపట్నం, లోస్రా బ్రిడ్జి, నరసాపురం, అమలాపురం, కాకినాడ, కత్తిపూడి మీదుగా విశాఖపట్నం వెళ్లాలి.
- విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వైపు వెళ్ల వాహనాలు తూర్పుగోదావరి జిల్లా మీదుగా దివాన్‌చెరువు, వైజాగ్ మీదుగా వయా గమాన్ బ్రిడ్జి, దేవరపల్లి, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి, ఖమ్మం సూర్యాపేట వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లు వాహనాలు ఎన్టీఆర్ జిల్లా మీదుగా నందిగామ, మధిర, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గామన్ బ్రిడ్జి మీదుగా విశాఖపట్నం వెళ్లాలి. ఇబ్రహీంపట్నం, మైలవరం, నూజివీడు, హనుమాన్ జంక్షన్, ఏలూరు మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లాలి. రామవరప్పాడు రింగ్, నున్న, పాములు కాలువ, వెలగలేరు, జి.కొండూరు, మైలవరం, నూజివాడు, హనుమాన్ జంక్షన్, ఏలూరు మీదుగా విశాఖపట్నం వెళ్లాలి. గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చేవారు రామవరప్పాడు ఫ్లై ఓవర్ మీదుగా ముస్తాబాద, సూరంపల్లి అండర్‌పాస్ ద్వారా కొత్త బైపాస్ రోడ్డుపై నుంచి బీబీ గూడెం అండర్‌పాస్ ద్వారా గన్నవరం చైతన్య స్కూల్ జంక్షన్ వద్ద ఎన్‌హెచ్ 16 అక్కడి నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లాలి.

ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిల్

(5వ పేజీ తరువాయి)

చనిపోయే అవకాశముంది. దీంతో బస్సును ఆపడానికి ఫుట్‌పాత్‌వైపు మళ్లించాను. బస్సు కంట్రోల్ కాకపోవడంతో ఎదురుగా ఉన్న స్కోడా షోరూమ్ గ్రీల్‌ను ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండా వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, షోరూమ్‌లో పార్కింగ్ చేసిన కార్లపైకి వెళ్లి ఆగింది.' అని చెప్పారు. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన వారిని పటమట పోలీసులు కొత్త ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో జాతీయ రహదారిపై పది నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పటమట, నాల్గో ట్రాఫిక్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పటమట పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109,117, 128
చికెన్ విత్ స్కిన్	212
చికెన్ స్కిన్‌లెస్	222

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

ట్రైబల్ విజన్ క్యాలెండర్ ఆవిష్కరణ



వన్‌టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని విజయవాడ ఎంపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ట్రైబల్ విజన్ -2025 క్యాలెండర్‌ను ఎంపీ శివనాథ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టీడీపీ రాష్ట్ర నాయకుడు మాదిగాని గుర్నాథం, దాములూరి మధుసూదనరావు, డి.నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ రోడ్ల నిర్మాణానికి అంచనాలు

- తీరనున్న ట్రాఫిక్ సమస్య
- ఆక్రమణల చెరలో గుంటతిప్ప కాల్వ

(ఆంధ్రజ్యోతి, ఆటోనగర్)

మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ నిర్మాణం, గన్నవరం మెట్రో కారిడార్ పనులకు కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. దీంతో నగరానికి ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. నిర్మాణ పనుల సమయంలో ట్రాఫిక్ సమస్యలు నివారించేలా ఆటోనగర్ చుట్టూ ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు దృష్టి సారించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ ఆటోనగర్ రహదారుల నిర్మాణానికి కావాల్సిన అంచనాలను రూపొందించారు. ట్రాఫిక్ కష్టాలు తీరేలా, రహదారుల నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

పనుల్లేక వెలవెల

జవహర్ ఆటోనగర్‌లో ప్రత్యేక్షంగా, పరోక్షంగా దాదాపు లక్ష మంది కార్మికులు ఆధారపడి జీవినం సాగిస్తున్నారు. నగరానికి నడిబొడ్డున ఉన్న ఆటోనగర్‌కు అప్రోచ్ రహదారులు లేక వ్యాపారం కుదేలైంది. ఏటా ఆస్తిపన్ను కింద ఏపీఐఐసీకి సూమారు రూ.4 కోట్ల ఆదాయం చేకూరుతుంది. పన్నుల పరంగా మరో రూ.10 కోట్ల మేర రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తోంది. ప్రధానంగా ఆటోమొబైల్ రంగంతో ఆటోనగర్ ముడిపడి ఉంది. భారీ లారీల రాకపోకలకు అంతరాయంతో ఆటోనగర్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

ట్రాఫిక్ ఆంక్షలతో ఆటోనగర్ కుదేలు

బందర్‌రోడ్డు, గురునానక్ రోడ్డు, మహానాడు జంక్షన్, రామవరప్పాడులోని బల్లెం వారి వీధిల నుంచి ఆటోనగర్ చేరుకోవచ్చు. ప్రస్తుతం నగరంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. దీంతో మహానాడు జంక్షన్, రామవరప్పాడులోని బల్లెంవారి వీధి నుంచి ఆటోనగర్‌కు లారీలు అనుమతిస్తున్నారు. ప్రస్తుతం వచ్చే లారీలు 14 టైర్ల బండ్లు కావడంతో మహానాడు రోడ్డు మాత్రమే అనుకూలంగా ఉంది. బల్లెంవారి వీధి వైపు ఈ లారీలు వెళ్లే అవకాశాలు లేవు. దీంతో పెద్ద లారీలు ఆటోనగర్ వైపు కన్నెత్తి చూడటం లేదని ఆటోనగర్ యాజమాన్యాలు అంటున్నాయి.



గుంటతిప్ప కాలువ ప్రవాహాన్ని మళ్లించి ఆక్రమణ

అసలు తొంబై ఉంది పదడుగులే

గుంటతిప్ప కాలువను ఆనుకుని ఉన్న రహదారితో కలిపి మొత్తం 90 అడుగులు ఉండాలి. 10 అడుగుల కాల్వ ఆక్రమణలతో కుంచించుకుపోయింది. 80 అడుగుల రహదారిపై లారీ బాడీలు పెట్టి ఆక్రమించడంతో కేవలం 20 అడుగుల రహదారి మాత్రమే కనిపిస్తోంది. గుంటతిప్ప కాల్వపైన అనధికారకంగా చప్టాలు నిర్మించడంతో మురుగునీరు పారడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



రహదారిపైనే వ్యర్థాలు

ఈ విషయంలో ఇరిగేషన్, ఐలా అధికారులు మీనమేషాలు లెక్కించడంతో ఏళ్ల తరబడి గుంటతిప్ప కాల్వ నిర్లక్ష్యానికి గురైంది. గుంటతిప్ప కాల్వ వెంబడి ఉన్న రహదారిని ప్రక్షాళన చేసి అభివృద్ధి పరచాలని కోరుతున్నారు. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే బందర్‌రోడ్డు నుంచి రామవరప్పాడు జాతీయ రహదారికి నేరుగా చేరుకోవచ్చు. దీంతో ఆటోనగర్, సనత్‌నగర్, మురళీనగర్ ప్రాంతాల మీదుగా భారీ వాహనాలు ప్రయాణిస్తాయి. దీంతో ట్రాఫిక్ కష్టాలు తీరతాయని స్థానికులు అంటున్నారు.

శ్రీవారి ఆలయంలో

ముక్కోటి ఏకాదశి, గోదాదేవి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

లబ్బీపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయంలో ఈ నెల 10నుంచి ముక్కోటి ఏకాదశి, 13న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీగోదాదేవి కల్యాణం కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాటు చేస్తున్నారు. 10న శుక్రవారం ముక్కోటి



ఏకాదశి సందర్భంగా ఉదయం 4.30గంటల నుంచి వైకుంఠ ద్వార సర్వ దర్శనం ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్వామి దర్శనానికి అధికంగా వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాటు, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్న ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా ధనుర్మాస ముగింపు సందర్భంగా ఈ నెల 13న ఉదయం 9.30గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ గోదాదేవి, శ్రీ రంగనాయకుల స్వామి వార్ల కల్యాణోత్సవం, అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

క్రాంతి యువసేన 2025 క్యాలెండర్ ఆవిష్కరణ



పటమట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గానికి చెందిన గద్దె క్రాంతి యువసేన శ్రేణులు వరదల సమయంలో చేసిన సేవా కార్యక్రమాలను వివరిస్తూ ముద్రించిన 2025 క్యాలెండర్‌ను శుక్రవారం అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో యువ నాయకులు గద్దె క్రాంతి ఆవిష్కరించారు. తుమ్మల వెంకట్, నిమ్మగడ్డ చిన్న, మాగంటి నితిన్, తెన్నేటి ఉదయ్‌లు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారని క్రాంతి అన్నారు. గద్దె రమేష్, పటమట సతీష్ చంద్ర, పెనుగొండ శ్రీనివాస్, లీలా శంకర్ తదితరులు క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

నాటక పోటీలు ప్రారంభం

విజయవాడ కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : అజో-విభొ-కందాళం ఫౌండేషన్, జాషువా సాంస్కృతి కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. పలువురు నాటక రంగ, సినీ, సాహిత్య ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అజో-విభొ-కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, చైర్మన్ డాక్టర్ కేవీ రామానుజాచార్యులు, జాషువా సాంస్కృతిక వేదిక కన్వీనర్ గుండు నారాయణరావు, తెలుగు డ్రామా నిర్వాహకుడు డి.రామకోటేశ్వరరావు, సినీ నటుడు వైఎస్ కృష్ణేశ్వరరావు, ఉత్సవాల ప్రిన్సిపాల్ కోఆర్డినేటర్ జీవీ రంగారెడ్డి, ప్రతినిధి చలసాని కృష్ణప్రసాద్ తదితరులు సమన్వయాన్ని అందించారు. కార్యక్రమంలో తొలి ప్రదర్శనగా అన్నదాత నాటికను కళాంజలి కళాకారులు ప్రదర్శించారు. అనంతరం వేదాంతం నాటిక ప్రదర్శించారు. మూడో ప్రదర్శనగా వర్క్ ఫ్రం హోం, రెండో ప్రదర్శనగా అనశ్వరం నాటికను ప్రదర్శించారు. ఈ నాటిక ప్రేమకు సంబంధించిన అంశాలను చూపించింది.(అ)సత్యం అనే నాటిక ప్రదర్శితమైంది.



ఈ నాటికను శ్రీచైతన్య కళాస్రవంతి కళాకారులు ప్రదర్శించారు. అనంతరం విశిష్ట దళిత సాహిత్య పురస్కార ప్రదానం జరిగింది. అనశ్వరం నాటికను విజయవాడకు చెందిన శ్రీకృష్ణా ఆర్ట్ థియేటర్ ప్రదర్శించారు. మూడవ ప్రదర్శనగా బ్రహ్మస్వరూపం విజయవాడకు చెందిన మైత్రీ కళానిలయం కళాకారులు ప్రదర్శించారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ధనేకులలో సంక్రాంతి సంబరాలు రేపు

లబ్బీపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కమ్మ సేవా సమితి గ్రేటర్ విజయవాడ ఆధ్వర్యంలో ఈనెల 5న గంగూరులోని ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు, సంబరాల నిర్వాహకులు కిలారు ఫణి ప్రసాద్ తెలిపారు. లబ్బీపేటలోని ఒక హోటల్‌లో శుక్రవారం సంబరాలు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా, తెలంగాణా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశిష్ట అతిథిగా పాల్గొంటారని తెలిపారు. పందెపు ఎడ్లు, కోడిపుంజులు, పక్షులు, వివిధ జంతువుల ప్రదర్శన , వీర నాట్యం, కోలాటం, హరిదాసు, గంగిరెద్దుల ప్రదర్శన, ఆటల పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో వేములపల్లి అనురాధ, ముత్తవరపు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవ జీవితానికి భక్తి ప్రధానం

ప్రముఖ ప్రవచకుడు మేడసాని మోహన్





శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమంలో భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న మేడసాని మోహన్

విజయవాడ కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మానవ జీవితంలో భక్తి ప్రధానమని ప్రముఖ ప్రవచకుడు మేడసాని మోహన్ అన్నారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి కావాల్సిన భక్తి విశిష్టతను భాగవతం అనువణువునా తెలియజేస్తుందన్నారు. మహాభాగవతాన్ని వ్యాసుడు రాయడానికి పూనుకోవడం, వ్యాస-నారద మహర్షి గోష్టి భాగవత ఆవిర్భావం కోసం మహాభారం ప్రేరణగా నిలిచిన తీరు, పరిక్షిత్ మహారాజుకు సుఖ మహర్షి భాగవత సప్తాహాన్ని వివరించిన తీరును మేడసాని వీనుల విందుగా వినిపించారు. అనంతరం ఆయనను సిద్ధార్థ కళాపీఠం ఉపాధ్యక్షుడు వెల్లంకి నాగభూషణం, ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ లలిత్‌ప్రసాద్, కార్యదర్శి ప్రసాద్‌లు సత్కరించారు.

సామాజిక పోరాట యోధురాలు సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

విజయవాడ లీగల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సంఘసంస్కర్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు, రచయిత్రి సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన వ్యక్తి సావిత్రిబాయి అని తెలిపారు. తాను అనుకున్న లక్ష్య సాధన కోసం చివరి శ్వాస వరకు శ్రమించారని వారు తెలిపారు. సామాజిక పోరాట యోధురాలు సావిత్రిబాయి స్ఫూర్తిని కొనసాగించడమే మనం అర్పించే ఘన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సప్పా రమేష్, సంపర శ్రీనివాసరావు, నామాల కోటేశ్వరరావు, రావూరి చునావ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో దూకి యువకుడు ఆత్మహత్య

వన్‌టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాకు చెందిన యువకుడు (35) కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం, పోతినపల్లి మెయిన్ రోడ్డుకు చెందిన తేలూరి రాంబాబు, అతని భార్య సునీత, కుమార్తె (6) విజయవాడ గులాబీతోటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు.

ఇతను సూర్యారావుపేటలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. గత నెల 31న అతని భార్య, కుమార్తె సొంతూరు వెళ్లారు. ఇతను సంక్రాంతి సెలవులకు వస్తానని వారికి చెప్పాడు. ఈ క్రమంలో ఈనెల ఒకటో తేదీన సునీత భర్తకు ఫోన్ చేసి అతని తల్లికి ఆరోగ్యం బాగాలేదని చెప్పటంతో మరుసటి రోజు వస్తానని చెప్పాడు. ఆ తరువాత నుంచి రాంబాబు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. రాంబాబు సహ ఉద్యోగి పుల్లారెడ్డి శుక్రవారం ఉదయం రాంబాబు భార్య సునీతకు ఫోన్ చేసి రాంబాబు కృష్ణానదిలో పడటం వల్ల చనిపోయాడని తెలియపరిచాడు. దీంతో ఆమె, కుటుంబ సభ్యులు, బంధువులు విజయవాడ వచ్చారు.

పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాంబాబు ఇటీవల మద్యానికి బానిస అయ్యాడని, తన సొంతూరులో సుమారు రూ.4లక్షలు అప్పు ఉందని, మృతుడు భార్య సునీత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



17 రోజులుగా వాకర్స్ శాంతియుత నిరసన

భారతీనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతిని కోరుతూ లయోలా వాకర్స్ చేస్తున్న నిరసన శుక్రవారానికి 17వ రోజుకు చేరింది. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సమక్షంలో వాకర్స్ ప్రతినిధులకు, కళాశాల యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వాకర్స్‌ను గ్రౌండ్ లోనికి వాకింగ్‌కు అనుమతి ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకునేలా ఆలోచించాలని కలెక్టర్ లక్ష్మీశ యాజమాన్యాన్ని ఆదేశించారని వాకర్స్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘం ప్రతినిధులు గూడపాటి లక్ష్మీనారాయణ, తులసీ మోహన్, రావి రమేష్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆంధ్రా లయోలా కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

భారతీనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల ఈఐఎస్‌సీ (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్, స్టార్టప్,కెరీర్ హబ్) ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్‌లో శనివారం వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లుఈఐఎస్‌సీ కోఆర్డినేటర్ బీఆర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ జీపీ కిశోర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రభుదాస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

స్కూల్‌కి వెళ్లడం ఇష్టం లేక కిడ్నాప్ నాటకం

బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

వన్‌టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌కి వెళ్లడం ఇష్టం లేక ఓ బాలిక కిడ్నాప్ నాటకం ఆడిన సంఘటన శుక్రవారం కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల మేరకు ఈదులగూడెంకు చెందిన ఓ బాలిక (11) ఈదరలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతుంది. ఆ బాలికకు స్కూల్‌కు వెళ్లటం ఇష్టం లేక కొన్ని రోజుల పాటు ఇంటి వద్దే ఉంటుంది. తల్లిదండ్రులు ఒత్తిడి చేయటంతో శుక్రవారం ఉదయం స్కూల్‌కు వెళుతున్నానని చెప్పి బయటకు వచ్చింది. ఆర్టీసీ బస్సులో విజయవాడ బస్ స్టేషన్‌కు చేరుకుంది. ఒంటరిగా ఉన్న బాలికను ఆర్టీసీ ఉద్యోగులు పట్టుకుని ప్రశ్నించారు. మొదట తనను ఓ వృద్ధురాలు కిడ్నాప్ చేసి బస్ స్టేషన్‌కు తీసుకువచ్చిందని చెప్పింది. ఆర్టీసీ ఉద్యోగులకు అనుమానం రావటంతో అవుట్‌పోస్టులో ఉన్న పోలీసులకు అప్పగించారు. పోలీసులు బాలిక నుంచి పూర్తి వివరాలు తెలుసుకోగా తనకు స్కూల్‌కు వెళ్లటం ఇష్టం లేదని, తల్లిదండ్రులు బలవంతాన స్కూల్‌కు వెళ్లమనటంతో తాను ఆర్టీసీ బస్సులో విజయవాడ వచ్చానని వివరించింది. పోలీసులు ఆమె వద్ద ఫోన్ నెంబరు తీసుకుని తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిలిపించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బాలికను అప్పగించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

వన్‌టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలో ఉన్న కళావేదిక మీద విజయవాడ, యనమలకుదురు, రామలింగేశ్వరనగర్‌లోని శ్రీనాట్య వేద అకాడమీ గురువు మననం లలితాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అనంతరం దేవస్థానం డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు.

సావిత్రిబాయి పూలేకు భారతరత్న ఇవ్వాలి

- బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ డిమాండ్
- ఉపాధ్యాయులకు సన్మానం..
- కారక్రమంలో పాల్గొన్న రేణుదేశాయ్, బ్రహ్మానందం

లబ్బీపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలేకి భారత రత్న ఇవ్వాలని భారత చైతన్య యువజన(బీసీవై) పార్టీ అధ్యక్షుడు రామ చంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. బందర్ రోడ్డులోని లెమన్ ట్రీ హోటల్‌లో బీసీవై పార్టీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పూలే జయంతిని ప్రభుత్వాలు అధికారికంగా జరిపించాలని డిమాండ్ చేశారు. సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేని మహిళా ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రొఫెసర్ సూరజ్ మండల్ అన్నారు. సావిత్రిబాయి పూలే జన్మించిన ప్రాంతంలోనే తాను జన్మించడం తన పూర్వ జన్మ సుకృతమని, ఎంతో గర్వంగా ఉందని సామాజిక సేవకురాలు, సినీ నటి రేణుదేశాయ్ అన్నారు. ఉపాధ్యాయుల గొప్పతనాన్ని ఎందరో ఉపాధ్యాయులు చేసిన సమాజాభివృద్ధిని తన బిడ్డలు ఆకీర, ఆద్యలకు చెప్పానన్నారు. మహిళల విద్యకు మొదటి టీచర్‌గా మారడమే కాకుండా మొదటి పాఠశాల స్థాపించిన సావిత్రిబాయి పూలే ఎందరికో ఆదర్శం అన్నారు. సినీనటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించే ఆలోచన రావడమే గొప్ప విషయమన్నారు. మహిళాభ్యుదయం కోసం పాటుపడిన అంబేడ్కర్, లాల్ బహదూర్ శాస్త్రి, డొక్కా సీతమ్మ వంటి మహనీయుల గొప్పతన్నాన్నిన అందరూ తెలుసుకోవాలన్నారు. సావిత్రిబాయి పూలే బొమ్మతో ఉన్న సిల్వర్ కాయిన్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

మనిషికంటే గొప్ప ధర్మం ఏదీ లేదు

- సాహిత్య సమ్మేళనంలో రెవెన్యూ కార్యదర్శి సిసోడియా

విజయవాడ కల్చరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మనిషి కంటే గొప్ప ధర్మం ఏదీలేదని రచయిత, కథకుడు, రెవెన్యూ కార్యదర్శి ఆర్పీ సిసోడియా అన్నారు. 35వ పుస్తక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదికపై నిర్వహించిన క్షణ పశ్చిమ సాహిత్య సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. మీర్జా గాలిబ్ సెక్యులరిజంపై రాసిన ఉర్దూ గజల్స్ హరివంశరాయ్ బచ్చన్ రాసిన మధుశాల సాహిత్యాన్ని ఉదహరిస్తూ మానవ మనోభావాలు, ప్రేమ, దుఃఖం, జీవిత గమనాన్ని సాహిత్య రచనల ద్వారా అన్వేషించిన విధానాన్ని ఆవిష్కరించారు. మనుషులందరూ ఒకేలా ఉన్నప్పుడు దేవుని సమాజంలో వేర్వేరుగా చూస్తున్నారని అన్నారు. కవిత్వం విశ్వభాష అని, దాని ద్వారా దేశవ్యాప్తంగా ఎదురవుతున్న హింస అనే వస్తువుపై వ్యతిరేకంగా మరింత సాహిత్యం రావాలని సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ పేర్కొన్నారు. మలయాళ కవి పీఎస్ గోపీకృష్ణ 'అమ్మ మీద మంచి కవిత్వం వినిపించారు. తమిళ కవి షణ్ముఖం విమల్ కుమార్ అన్నదమ్ముల మధ్య స్వార్థపూరితమైన అంశాలపైన, మరాఠీ కవి డాక్టర్ స్వాతి సిందే పవార్ వంగలి పురుగు నుంచి స్త్రీ సీతాకోకచిలుక రూపాంతరం చెందడంపైన, కన్నడ కవి సుమిత్ మైత్రి తన జన్మభూమిపైన, మంకిని కవి ప్రకాష్ దత్తారం నాయక్ శతక బాధలు వివరిస్తూ రైతు జాతి కుచించుకుపోతోందని ఆవేదనతో కవిత్వం వినిపించారు. సింధి భాషలో హరీష్ కరం చందాని కవిత్వం వినిపించారు. సభకు ఎమెస్కో విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యదర్శి మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు.



రుణం తీర్చుకున్నారు



సర్వాంగ సుందరంగా మోగులూరు హైస్కూల్

తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉండడాన్ని చూసి చలించిపోయారు ఆ దంపతులు. వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బంది పడడాన్ని ప్రత్యక్షంగా చూసి పాఠశాల అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. తమ ఉన్నత స్థితికి పునాదైన ఆ పాఠశాల రుణం తీర్చుకునేందుకు ముందుకు కదిలారు. ఖర్చుకు వెనుకాడకుండా తరగతి గదుల నిర్మాణంతో పాటు అన్ని వసతులూ కల్పించారు. వారి చేయూతతో నేడు ఆ పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయి సర్వాంగ సుందరంగా తయారయింది. కంచికచర్ల మండలం మోగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూపురేఖలు మార్చిన లారస్ ల్యాబ్స్ సీఈవో డాక్టర్ చావా సత్యనారాయణ- నాగరాణి దంపతులు అందరి ప్రశంస లందుకుంటున్నారు.

- చదువుకున్న బడిలో రూ.6 కోట్లు పైగా ఖర్చు పెట్టి అన్ని సదుపాయాలూ కల్పించారు
- లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ-నాగరాణి దంపతుల ఆర్థిక చేయూత
- మారిన మోగులూరు హైస్కూల్ రూపురేఖలు


పాఠశాలలో నిర్మించిన సిమెంట్‌రోడ్డు


భోజనాలు చేసేందుకు డైనింగ్ హాల్


విద్యార్థుల తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

మోగులూరు హైస్కూల్ భవనాన్ని 1962లో నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరింది. ప్రమాదం పొంచి ఉండటంతో భవనాన్ని తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పాఠశాలలో సైన్సు ల్యాబ్‌లు లేవు. తాగునీటి సదుపాయం లేదు. బోర్‌వెల్ లేకపోవడంతో వాడుక నీరు కూడా లేదు. టాయిలెట్లు లేవు. విశాలమైన ఐదు ఎకరాల ఆవరణ ఉన్నప్పటికీ ఆటలకు అనువుగా లేదు. ఆవరణ లోతట్టుగా చెట్లు, పిచ్చి మొక్కలతో చిట్టడవిగా ఉండేది.

రూ.4.70 కోట్లతో తరగతి గదులు, ల్యాబ్‌లు

మున్నలూరు గ్రామానికి చెందిన లారస్ లాబ్స్ సీఈవో డాక్టర్ చావా సత్యనారాయణ, ఆయన సతీమణి నాగరాణి దంపతులు మోగులూరు పాఠశాలలోనే విద్యనభ్యసించారు. పాఠశాల దుస్థితిని మోగులూరు, మున్నలూరు గ్రామాలకు చెందిన పలువురు చావా సత్యనారాయణ దృష్టికి తీసుకెళారు. బాగు చేయాల్సిందిగా కోరారు. వెంటనే వారు సానుకూలంగా స్పందించారు. దీనస్థితికి చేరుకున్న పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయం అందించారు. రూ.4.70 కోట్లతో తరగతి గదులు, ఫిజిక్స్, బయాలజీ ల్యాబ్‌లు, రూ.49 లక్షలతో ప్రహరీ, రూ.25 లక్షలతో పాఠశాలకు రెండు వైపులా నాలుగు వందల మీటర్ల సిమెంట్ రోడ్లు నిర్మించారు. రూ.37.5 లక్షలతో ఆవరణ బాగుచేసి గ్రావెల్‌తో మెరక చేశారు. మధ్యాహ్న భోజనం కోసం కిచెన్‌రూమ్ నిర్మించారు. తాగునీటి కోసం ప్రత్యేకంగా బోర్‌వెల్ వేసి, 15వందల లీటర్ల సామర్థ్యం ఉన్న ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. బాలబాలికలకు విడివిడిగా టాయిలెట్ల సదుపాయం కల్పించారు.

ప్రారంభించేందుకు సన్నాహాలు

ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా నూతన భవనాలను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విద్యాశాఖాధికారులు శుక్రవారం పాఠశాలకు వచ్చి పరిశీలించి వెళ్లారు. ఈనెల ఆరో తేదీన కార్యక్రమం ఖరారైందని చెబుతున్నారు. అయితే అధికారిక సమాచారం లేదు. మోగులూరుతో పాటుగా మున్నలూరు, కునికినపాడు గ్రామాలకు అందుబాటులో ఉన్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 16 మంది ఉపాధ్యాయులు, 314 మంది విద్యార్థులున్నారు.

విమానాశ్రయం నూతన టెర్మినల్ బిల్డింగ్

కూచిపూడి, అమరావతిల వైభవం ఉట్టి పడేలా..

నూతన డిజైన్లకు సీఎం చంద్రబాబు ఆమోదముద్ర

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /గన్నవరం): నవ్యాంధ్రకు తలమానికంగా ఉన్న విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ను అమరావతి, కూచిపూడిల వైభవం ఉట్టిపడేలా తీర్చిదిద్దేలా రూపొందించిన సరికొత్త డిజైన్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. టెర్మినల్ బిల్డింగ్ పనులు 50 శాతం పూర్తి కావడంతో ఆర్కిటెక్చరల్ డిజైన్లను శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫైనల్ చేశారు. టెర్మినల్ బిల్డింగ్ ఎలివేషన్ ఒకే మాదిరిగానే ఉన్నా థీమ్ మారుతుంది. టెర్మినల్ ముందు, వెనుక, లోపల, బయట పూర్తిగా కూచిపూడి వైభవం కనిపించేలా ఉంటుంది. దేశ విదేశాల నుంచి వచ్చే వారికి కూచిపూడి గొప్పతనాన్ని వివరించేలా ఎయిర్‌పోర్టులో కూచిపూడి భంగిమలు ఉంటాయి. అమరావతి రాజధాని స్థూపాలు, ధర్మచక్రాలు టెర్మినల్ బిల్డింగ్‌లో కనిపిస్తాయి. ఓవైపు కూచిపూడి, మరోవైపు అమరావతిల విశిష్టతల కలబోతతో ఉట్టిపడే సరికొత్త డిజైన్లు ఆకర్షిస్తున్నాయి. టెర్మినల్ బిల్డింగ్ పనులు 50 శాతం పూర్తి కావటంతో జూన్ నెలాఖరుకల్లా నూతన టెర్మినల్ బిల్డింగ్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది.


అధికారులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

జూన్‌లోపు పనులు పూర్తిచేయాలి: రామ్మోహన్‌నాయుడు

నూతన టెర్మినల్ భవనం నిర్మాణ పనులు జూన్‌లోపు పూర్తి చేయాలని అధికారులను కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. శుక్రవారం టెర్మినల్ నిర్మాణ పనులను ఎంపీ కేశినేని శివనాథ్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులు నిర్మాణ పనుల పురోగతిని వివరించారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


రోటా ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

పారిశ్రామిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రోటా ఫెయిర్ ప్రారంభోత్సవంలో మంత్రి టీజీ భరత్

లబ్బీపేట, జనవరి 3ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజధాని ప్రాంతానికి పూర్వ వైభవం వచ్చింది. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. యువ పారిశ్రామికవేత్తలకు చేయూత అందించాలనే సంకల్పంతో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది.' అని పరిశ్రమలు శాఖ రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్లో మూడు రోజుల పాటు నిర్వహించే రోటా ఫెయిర్‌ను శుక్రవారం అయన ప్రారభించారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పరిశ్రమల అభివృద్ధికి చర్యలు శూన్యమన్నారు. మూడు రోజుల పాటు రోటా ఫెయిర్ జరగనుందని, సంక్రాంతి పండుగ షాపింగ్‌కు రోటా ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని, నగర ప్రజలు ఈ ఫెయిర్‌ను సందర్శించాలని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ బాబు కోరారు. దీని ద్వారా లభించే నగదును పోలియో నిర్మూలన కోసం వినియోగిస్తామని తెలిపారు. రోటరీ క్లబ్ మిడిల్ టౌన్ కార్యదర్శి సుందర్ రెడ్డి, రోటా ఫెయిర్ ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్లు చిన్నం మధుబాబు, అమూల్య శ్రీనివాస్, క్యూనిక్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.


ఔటర్ రింగ్ రోడ్డు రెండో ఫ్లైవోవర్ నుంచి ముస్తాబాద వెళ్లే రోడ్డుపై భారీ గోతులు

ముస్తాబాధ రోడ్డు

- అధ్వానపు రహదారిపై వాహనదారుల అవస్థలు
- బుడమేరు వరద పోవడానికి దగ్గరుండి రోడ్డుకు గండ్లు కొట్టించిన మంత్రి నారాయణ, అప్పటి కమిషనర్
- మరమ్మతులు పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు



రామవరప్పాడు ఔటర్ రింగ్‌రోడ్డుపై రెండో ఫ్లై ఓవర్ నుంచి ముస్తాబాద గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. బుడమేరు వరద పోవడానికి అప్పట్లో మంత్రి నారాయణ, విజయవాడ కమిషనర్ దగ్గరుండి రోడ్డుపై పలుచోట్ల గండ్లు కొట్టించారు. వరద తగ్గాక పూడ్చించారు. కానీ రహదారి మరమ్మతులు పట్టించుకోలేదు. దీంతో ఈ రహదారిపై పలుచోట్ల గోతులు ఏర్పడి అధ్వానంగా ఉంది. ఈ రహదారిలో పలు వ్యాపార సంస్థలు, గోడౌన్లు ఉన్నాయి. వందలాది ఉద్యోగులు, వ్యాపార సంస్థల్లోకి వచ్చే కంటెయినర్లు, లారీలతో రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. వారంతా ప్రయాణానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు. -విజయవాడ

ప్రజారవాణా సంస్థ ఉద్యోగుల

సమస్యలు పరిష్కరించండి

వన్‌టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎ.విజయానంద్‌ను ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం సచివాలయంలో విజయానంద్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపర్తి వెంకట రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పీవీ విశ్వమోహన్ పాల్గొన్నారు.


రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ విజయానంద్‌తో పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

010 పద్దు ద్వారా జీతాలు ఇప్పించండి

- ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌కు గ్రంథాలయ ఉద్యోగుల వినతి

వన్‌టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించి, 010 పద్దు ద్వారా గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు ఇప్పించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపుదల చేయాలని, పెన్షన్, పీఆర్సీ బకాయిల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌కు నూతనంగా ఎన్నికైన జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల కార్యవర్గం విన్నవించింది. కార్యవర్గ ప్రమాణస్వీకారం శుక్రవారం గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు రాష్ట్ర నాయకులను కలిశారు. గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బీరం వెంకటరమణ, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కళ్లేపల్లి మధుసూదనరాజు, పూర్వ అధ్యక్షుడు కోన దేవదాసు, జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడు ఐ.వి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి బాలిక మృతి

పెనుగంచిప్రోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శనగపాడు గ్రామానికి చెందిన కీసర ఎస్తేరురాణి(14) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎస్తేరురాణి నందిగామలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన ఆమె బంధువులు 108 అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రాణి మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎం.ఎస్.కె.అర్జున తెలిపారు. ఎస్తేరురాణి భౌతికకాయం నందిగామ ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో ఉందని శనివారం పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్సై తెలిపారు.

వలంటీర్లను కొనసాగించాలి


లెనిన్ సెంటర్‌లో భిక్షాటన చేస్తున్న వలంటీర్లు

గవర్నర్‌పేట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): 'గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లను కొనసాగించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి' అంటూ కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్(ఏఐవైఎఫ్) నేతలు కోరారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం లెనిన్ సెంటర్‌లో వలంటీర్లు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడారు. వలంటీర్లకు న్యాయం చేయాలని, ఉద్యోగాల నుంచి తొలగించొద్దని, ఎన్నికల వాగ్దానం అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని, నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. సుదీర్ఘ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటపై నిలబడకుండా యూటర్న్ తీసుకోవడం బాధాకరమని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు అన్నారు. వలంటీర్లకు న్యాయం జరిగే వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. వలంటీర్లతో పాటు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వర్లరాజు, బి.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

ఎలుకల మందు తాగడంతో వారం నుంచి ఆస్పత్రిలో చికిత్స

వన్‌టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న బోయ కల్యాణ్ వారం క్రితం ఎలుకల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటన కాలేజీలో విద్యార్థి వర్గాల్లో కలకలం రేపింది. దీంతో కళాశాలకు సెలవు ప్రకటించారు. విద్యాధరపురానికి చెందిన కల్యాణ్ విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అతని నుంచి ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు ఆత్మహత్యాయత్నానికి కారణాలపై వాంగ్మూలం తీసుకున్నారు. పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలో కల్యాణ్ బీటెక్-ఈఈఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడని, రెండు నెలలుగా కాలేజీలో ప్రాజెక్టు పనులపై గ్రూపులో మెసేజ్‌లు పెడుతున్నాడని, కాలేజీలో అందరూ ఆ మెసేజ్‌లు ఓ విద్యార్థిని గురించి పెడుతున్నాడంటూ గేలి చేయడం, మానసికంగా ఒత్తిడి తీసుకువచ్చాడని, దీంతో డిసెంబరు 27వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో ఇంటిలో ఉన్న ఎలుకల మందును తినేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడని వాంగ్మూలంలో పేర్కొన్నాడని పోలీసులు తెలిపారు. ఈ విషయాన్ని ఇంటిలో ఎవరికీ చెప్పలేదని, 28వ తేదీ ఉదయం తన అన్న దిలీప్‌కు చెప్పడంతో అతను వెంటనే బైక్ పైన సితార సెంటర్‌లోని పీహెచ్‌సీకి కిత్స నిమిత్తం తీసుకెళ్లాడని తెలిపారు. అక్కడ నుంచి కొత్త ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు.

హెచ్‌వోడీ మందలించాడని ఆరోపణ

హెచ్‌వోడీ మందలించడంతోనే ఎలుకలు మందు తాగాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. యాజమాన్యం కాలేజీకి సెలవు ప్రకటించి, విషయాన్ని గోప్యంగా ఉంచిందని, హెచ్‌వోడీని సస్పెండ్ చేసిందని సమాచారం. బోయ కల్యాణ్ మృతిపై తల్లిదండ్రులు చేసని ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చురుగ్గా హైందవ శంఖారావం సభ ఏర్పాట్లు

- 30 ఎకరాల్లో బహిరంగ సభ
- 150 మంది స్వామీజీలు కూర్చునేందుకు వీలుగా భారీ స్టేజీ
- 50 గ్యాలరీల్లో లక్ష కుర్చీలు


సభా ప్రాంగణం వద్ద భారీ స్టేజీ, స్క్రీన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

గన్నవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో ఈనెల 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభ ఏర్పాట్లు వేగంతంగా సాగుతున్నాయి. 30 ఎకరాల్లో బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నారు. 150మంది స్వామీజీలు కూర్చునేందుకు భారీ స్టేజీ నిర్మిస్తున్నారు. 50 గ్యాలరీల్లో లక్షకు పైగా కుర్చీలు వేస్తున్నారు. సభకు వచ్చిన వారు వీక్షించేందుకు 14 భారీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. సభాస్థలికి నాలుగు మార్గాల్లో వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్కింగ్‌కు కంకిపాడు రోడ్డు, సావరగూడెం రోడ్డులో 150 ఎకరాలకుపైగా భూములను చదును చేస్తున్నారు. అక్కడ మార్కింగ్‌లు వేసి వాహనాలు నిలిపేలా ఏర్పాట్లు చేపట్టారు. 3500 బస్సులు, 7రైళ్లు, 20వేల బైకులలో హిందూ కుటుంబీకులు వస్తున్నారని చెబుతున్నారు. రైళ్లల్లో వచ్చేవారికి ఉప్పులూరు స్టేషన్ వద్ద దిగి సభకు వచ్చేటప్పుడు అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. మరుగు దొడ్లు ఏర్పాటు చేశారు. అయోధ్య రామాలయం ట్రస్టు కోశాధికారి గోవింద గిరి మహరాజ్‌తో పాటు దేశంలోనే ప్రధాన స్వామీజీలు హాజరుకానున్నారు. స్టేజీ మీద స్వామీజీలు మాత్రమే కూర్చుంటారు. ఏర్పాట్లను వీహెచ్‌పీ అఖిల భారత ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, కన్వీనర్ తనికెళ్ల సత్య రవికుమార్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే గ్యాలరీలను నిర్మించి కుర్చీలు వేశారు.

3 లక్షల మందిపైనే సభకొస్తారు

- వీహెచ్‌పీ అఖిల భారత ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు


హైందవ శంఖారావం బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ అఖిల భారత ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, క్షేత్ర సంఘటన కార్యదర్శి సత్యం

'హిందూ ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టాం. ప్రభుత్వాల చేతుల నుంచి దేవాలయాలను విముక్తి చేయించేందుకే ఈనెల 5న హైందవ శంఖారావం నిర్వహిస్తున్నాం. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేస్తాం. దీనికి రాష్ట్రం నుంచి అంకురార్పణ చేస్తున్నాం.' అని విశ్వ హిందూ పరిషత్ అఖిల భారత ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు తెలిపారు. హైందవ శంఖారావానికి 3,500 బస్సులు, 7 రైళ్లు, 20వేల బైకులపై రాష్ట్ర నలుమూలల నుంచి 3లక్షలకు పైగా హిందూ కుటుంబీకులు వస్తారని చెప్పారు. కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో జరగనున్న హైందవ శంఖారావం పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. బహిరంగ సభకు వచ్చే వారందరికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని గంగరాజు తెలిపారు. హిందువులంతా సంఘటితంగా పోరాడేందుకు ఈ సభకు వస్తున్నారని, రాజకీయాలతో సంబంధం లేదని క్షేత్ర సంఘటన కార్యదర్శి సత్యం పేర్కొన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్, రాష్ట్ర కోశాధికారి దుర్గాప్రసాద్ రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ముల్లంగిని దక్షిణభారత దేశంలో కన్నా ఉత్తర భారత దేశంలో ఎక్కువగా తింటారు. శీతాకాలంలో పండే ఈ దుంప చూడటానికి చాలా అందంగా ఉంటుంది. ఈ వారం ముల్లంగితో చేసే కొన్ని వంటలు నేర్చుకుందాం...

ముల్లంగితో రుచి రుచిగా

ముల్లంగి కూర

కావాల్సిన పదార్థాలు

ముల్లంగి కోరు- రెండు కప్పులు, తరిగిన టమోటా ముక్కలు- ఒక కప్పు, జీలకర్ర- ఒక చెంచా, ఆవాలు- ఒక చెంచా, శనగపప్పు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, కరివేపాకు- ఒక చెంచా, తరిగిన కొత్తిమీర- ఒక చెంచా, పల్లీల పొడి- నాలుగు చెంచాలు, నువ్వులు- రెండు చెంచాలు, పచ్చిమిరపకాయ ముక్కలు- ఒక చెంచా, వెల్లుల్లి రెబ్బలు- రెండు, ఇంగువ- తగినంత, ఉప్పు- తగినంత, పసుపు- అరచెంచా, కారం- అర చెంచా, నూనె- నాలుగు చెంచాలు, నీళ్లు- తగినన్ని.


తయారీ విధానం

- ఒక మూకుడులో నూనెను వేడి చేసి జీలకర్ర, ఆవాలు, శనగపప్పు, మినపప్పులను వేయించాలి. అవి వేగిన తర్వాత కరివేపాకు, పచ్చిమిరపకాయ ముక్కలను కూడా వేసి వేయించాలి.
- ఆ తర్వాత టమోటా ముక్కలు, ఇంగువ, కారం కలిపాలి. టమోటా ముక్కలు పచ్చి వాసన పోయే దాకా వేగనివ్వాలి.
- ఈ మిశ్రమంలో ముల్లంగి కోరును వేయాలి. ఈ మిశ్రమం దగ్గర పడిన తర్వాత పల్లీల పొడి, నువ్వులు, ఉప్పు కలపాలి.
- మూకుడు మీద నుంచి కిందకు దింపే ముందు కొత్తిమీర వేయాలి.

జాగ్రత్తలు

- పచ్చి ముల్లంగికి కొద్దిగా వాసన ఉంటుంది. కానీ ముల్లంగి కోరును వేయిస్తే పోతుంది.
- హైబ్రీడ్ టమోటాల కన్నా దేశవాళి టమోటాలను వాడితే బావుంటుంది.
- పల్లీల పొడి బదులుగా కొబ్బరి కోరును కూడా వాడవచ్చు.





ముల్లంగి సలాడ్

కావాల్సిన పదార్థాలు:

ముల్లంగి ముక్కలు- ఒక కప్పు, ఉడికించిన బీన్స్- ఒక కప్పు, పళ్ల ముక్కలు- ఒక కప్పు, నిమ్మ కాయ రసం- రెండు చెంచాలు, ఆవపిండి- ఒక చెంచా, తేనె- ఒక చెంచా, సోయా సాస్- ఒక చెంచా, మిరియాల పొడి- ఒక చెంచా, ఆవ నూనె- పావు చెంచా, ఉప్పు- తగినంత

జాగ్రత్తలు

- కొందరు ముల్లంగి ముక్కలను నూనె లేదా నెయ్యిలలో వేయిస్తారు. దీని వల్ల ఈ ముక్కలు దోరగా అవుతాయి.
- కొందరు సలాడ్‌లో బూందీ మిక్సర్‌ను కలుపుతారు. దీని వల్ల అదనపు రుచి వస్తుంది.

తయారీ విధానం

- ఒక గిన్నెలో ముల్లంగి ముక్కలు, ఉడికించిన బీన్స్, పళ్లముక్కలను బాగా కలపాలి.
- ఆ మిశ్రమంలో నిమ్మకాయ రసం, ఆవపిండి, సోయా సాస్ వేసి కలపాలి.
- దానిపై మిరయాల పొడి, ఆవ నూనె, ఉప్పు వేసి కలపాలి. ఈ సలాడ్ సూప్‌లో బావుంటుంది.

ముల్లంగి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

ముల్లంగి ముక్కలు: ఒక కప్పు, ఎర్ర ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, తెల్ల వెనిగర్: ఒక కప్పు, పంచదార- అర కప్పు, ఆవాలు- ఒక చెంచా, మిరియాల పొడి- ఒక చెంచా, లవంగాలు- ఆరు

తయారీ విధానం

- ఒక మూకుడులో తెల్ల వెనిగర్, పంచదార, ఆవాలు, మిరియాల పొడి వేసి- పంచదార కరిగే దాకా వేడిచేయాలి.
- ఆ తర్వాత ఆ మిశ్రమంలో ముల్లంగి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేయాలి. ఒక నిమిషం తర్వాత దింపేయాలి.
- ఈ మిశ్రమం బాగా చల్లారిన తర్వాత ఒక గ్లాస్ జార్‌లో వేయాలి. దానిలో లవంగాలు వేయాలి.

జాగ్రత్తలు

- ముల్లంగి, ఉల్లిపాయ ముక్కలను ఎక్కువ వేడి చేయకూడదు. ఎక్కువ వేడి చేస్తే చెడు వాసన వచ్చే ప్రమాదం ఉంది.
- ఈ పచ్చడి బాగా చల్లారిన తర్వాత కానీ ఫ్రిజ్‌లో పెట్టకూడదు. ఇది రెండు వారాల దాకా నిల్వ ఉంటుంది.



శాకాలు... పోషకాల నిధులు



"మూల పత్ర కరీరాగ్ర ఫల కాండాధిరూఢకా
త్వక్ పుష్పం కవకంచేతి శాకం దశవిధం స్మృతమ్"

అంటాడు భోజన కుతూహల రచయిత రఘనాథ సూరి. ఆహారంలో శాకాలది ప్రధానమైన భాగస్వామమని దీని అర్థం. దుంప కూరలు, ఆకు కూరలు, చిగుర్లు, పండ్లు, కాయలు, కాడలు, మొలకలు, బెరళ్లు, పూలు, పుట్టగొడుగులు... వీటిని మనం తరచూ తింటూ ఉంటే ఆరోగ్యంగా ఉండగలుగుతాం. ఇప్పుడు మనం వీటిగురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం.

శాకాలలో చాలా పోషకపదార్థాలు ఉంటాయి. ఇవి రూపం మారినప్పుడు వాటిలో పోషక విలువలు కూడా మారిపోతూ ఉంటాయి. ఉదాహరణకు ఒక గింజను నానబెట్టి వుంచితే మొలకలొస్తాయి. ఈ మొలకల నుంచి కూరగాయలు పండుతాయి. మొలకలలో పోషక విలువలు.. కూరగాయల్లో పోషక విలువలు వేర్వేరుగా ఉంటాయి. అయితే ఈ శాకాలను తినే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఒకే రకం కూరగాయని విడవకుండా తింటే అస్థిభేదక (ఎముకలు దెబ్బతినటం). నేత్రశక్తి నాశక (కంటి చూపు మందగించటం), రక్తశుక్ర నాశక (రక్త కణాల్ని, పురుషుల్లో జీవకణాల్ని నశింపచేయటం), ప్రజ్ఞాక్షయం (మేథశక్తిని హరిస్తుంది), ఫాలిత్యకారక (జుట్టు నెరిసిపోతుంది), స్మరణ శక్తి నాశక (జ్ఞాపక శక్తిని నశింప చేస్తుంది) అని భావప్రకాశ అనే ఆయుర్వేద గ్రంథం వివరించింది. కాబట్టి ప్రతి రోజూ ఒకే రకం కూరగాయలు కాకుండా ఒక రోజు దుంపకూర, ఒకరోజు ఆకు కూర, ఒకరోజు కాయగూర ఇలా ఆరు రకాల్నీ మార్చిమార్చి తినాలనేది ఆయిర్వేద నిపుణుల చెబుతూ ఉంటారు. దీనికి తగిన విధంగానే మన ఆహార ప్రణాళిక కూడా ఉండాలి. అంతే కాకుండా శరీర తత్వానికి ఏది మంచిదో దానినే తినాలి. లేక పోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది.

క్యారెట్, ముల్లంగి, కీరా, టమోటా లాంటి శాకాల్ని వండకపోయినా తేలికగానే అరుగుతాయి. తక్కిన కూరగాయల్ని సుపక్వంగా అంటే చక్కగావండుకొని తినటమే మంచిది.



ఈ మధ్యకాలంలో కూరల్లో కూరగాయలు తక్కువగా ఉంటున్నాయి. మసాలా గ్రేవీ లేదా చింతపండు రసం వంటివి సింహ భాగం కనిపిస్తున్నాయి. శాస్త్ర ప్రకారంలో కూరలో- కూరగాయ ముక్కలు ఎక్కువగా ఉండాలి. పోపు లేదా మసాలా తక్కువగా ఉండాలి. పోపు లేదా మసాలా వాసన కూరగాయలకు సహజంగా వచ్చే రుచిని చంపేయకూడదు.

తెల్లని దంతాలకు...

తెల్లగా మెరిసే దంతాలు అందంగా కనిపించడమే కాదు నోటి ఆరోగ్యానికి చిహ్నం కూడా. సమస్య వచ్చినప్పుడు చాలామంది రసాయనాలతో కూడిన చికిత్సలను ఆశ్రయిస్తుంటారు. వీటివల్ల పళ్ల మీద ఎనామిల్ పొర దెబ్బతినే అవకాశం ఉంది. అలాకాకుండా సహజ రీతిలో దంతాలను తెల్లగా మెరిపించే చిట్కాల గురించి తెలుసుకుందాం!




ఆయిల్ పుల్లింగ్

- ఇది ఆయుర్వేద విధానం. నోటిలో రెండు చెంచాల నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనె వేసుకుని ఇరవై నిమిషాలపాటు పుక్కిలించి ఆ తరవాత ఉమ్మివేయాలి. తరచూ ఇలా చేస్తుంటే నోటిలోని హానికారక సూక్ష్మజీవులు నశించిపోతాయి. నోటి కండరాలు బలోపేతమవుతాయి. చిగుళ్లకు రక్త ప్రసరణ జరుగుతుంది. దంతాలమీద పేరుకున్న పాచి, ఇతర పదార్థాల అవశేషాలు క్రమంగా కరిగిపోతాయి.

వేప పుల్ల...

- లావుగా ఉండే వేప పుల్లను తీసుకొని దాని కొనను నమిలి బ్రష్‌లా చేయాలి. ఇలా నములుతున్నపుడు నోటిలో ఊరే లాలాజలాన్ని ఉమ్మివేయాలి. చిగుళ్లను, దంతాలను మెల్లగా తోమాలి. వేప పుల్ల నుంచి వెలువడే యాంటీ బ్యాక్టీరియల్ దంతాలపై పేరుకున్న పాచిని తొలగిస్తుంది. ఇలా రోజూ చేస్తూ ఉంటే దంతాలు తెల్లగా ఆరోగ్యంగా ఉంటాయి. చిగుళ్ల వాపు, నోటి దుర్వాసన, దంతక్షయం లాంటి సమస్యలు రావు.

ముత్యాల ముగ్గు



11 మధ్య 6



చందన
తణుకు

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

మచ్చలు మటుమాయం చేసేలా...

ముఖం మీద మొటిమలు, గాట్లు, పుట్టుమచ్చల్లాంటి వాటిని దాచేయాలంటే, కొన్ని మేకప్ మెలకువలు అనుసరించాలి. అవేంటో తెలుసుకుందాం!

కన్‌సీలర్‌తో: మచ్చల రంగును బట్టి వాటిని కనిపించకుండా చేసే కన్‌సీలర్ ఎంచుకోవాలి. మచ్చ ఎర్రగా ఉండే గ్రీన్ టింట్ కలిగి ఉండే కన్‌సీలర్ అద్దుకోవాలి. నల్లగా ఉంటే, ఎరుపు రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి. ఇందుకోసం మేకప్ స్పాంజ్‌తో ఈ కన్‌సీలర్ పలుచగా అద్దుకుని, ఆ తర్వాత సాధారణ కన్‌సీలర్‌ను మచ్చ ఉన్న ప్రదేశంలో అద్దుకోవాలి. ఇందుకోసం మేకప్ స్పాంజ్ మీద కన్‌సీలర్ వొంపి, మచ్చతో పాటు, దాని చుట్టూరా అద్దుకోవాలి.

మేకప్



ఫౌండేషన్ ఇలా: కన్‌సీలర్ అద్దుకున్న తర్వాత మేకప్ స్పాంజ్‌తో ఫౌండేషన్ పూసుకోవాలి. అసహజమైన గీతలు కనిపించకుండా, ముఖం మొత్తం ఫౌండేషన్ సమంగా పరుచుకునేలా స్పాంజ్‌తో అద్దుకోవాలి. తర్వాత మేకప్ దవడ ఎముక దిగువ వరకూ బ్లెండ్ చేయాలి. తర్వాత పెద్ద బ్రష్‌తో లూజ్ మ్యాట్ పౌడర్‌ను తీసుకుని, వృత్తాకారంలో ముఖం మీద అద్దుకోవాలి. మచ్చ మీద పౌడర్ పరుచుకోవడం వల్ల, అది చర్మంలో కలిసిపోతుంది.

ఎన్నారైల మానసిక సమస్యలు- పరిష్కారాలు



ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రవంతి ఉత్పల ఇంటర్వ్యూ
మీ ఏబీఎన్ యూట్యూబ్ ఛానల్‌లో

యువ

మన సారా మంచి కోసం

తండ్రి ఆస్తిపాస్తులకే కాదు... ఆయన ఆశయాలకు కూడా వారసురాలిగా నిలిచింది సారా టెండూల్కర్. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తెగా ఆమె ప్రపంచానికి సుపరిచితురాలు. కానీ నాన్న నీడలో కాకుండా స్వశక్తితో ఎదిగి... తనదైన బాటను నిర్మించుకొంటోంది. ప్రముఖ బ్రాండ్లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న సారా... మోడల్‌గానే కాకుండా సామాజిక సేవ వైపూ అడుగులు వేస్తోంది. 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్' డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి... ఆపన్నులకు అండగా నిలుస్తోంది.



క్రికెట్ దేవుడు సచిన్ కుమార్తె సారా టెండూల్కర్ ఇప్పుడు ఇంటర్నెట్ సంచలనం. షార్ట్ రీల్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్... రోజూ ఎక్కడో అక్కడ కనిపిస్తూనే ఉంటుంది. భారత క్రికెట్ స్టార్ శుభ్‌మన్ గిల్ ప్రేయసి అంటూ 27 ఏళ్ల సారా గురించి కొన్ని మాధ్యమాలు ఊదరగొడుతున్నాయి. అందులో వాస్తవం ఎంతనేది పక్కన పెడితే... దీనివల్ల ఆమెకు ఊహించని ప్రచారం లభించింది. కోట్ల మంది అభిమాన తార అయింది. ముంబయిలో పుట్టి పెరిగిన సారా... 'ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదివింది. 2018లో యూకేలోని 'యూనివర్సిటీ కాలేజీ లండన్' (యూసీఎల్) నుంచి బయోకెమికల్ సైన్స్ పట్టా పొందింది. అదే కాలేజీలో క్లినికల్ అండ్ పబ్లిక్ హెల్త్ న్యూట్రిషన్‌తో 2023లో ఎంఎస్సీ పూర్తి చేసింది. తరువాత భారత్‌కు తిరిగివచ్చింది. యూకే 'అసోసియేషన్ ఫర్ న్యూట్రిషన్'లో రిజిస్టర్డ్ న్యూట్రిషనిస్టు. పోషకాహార నిపుణురాలిగా కొనసాగాలన్నది ఆమె నిర్దేశించుకున్న లక్ష్యాల్లో ఒకటి. తమ్ముడు అర్జున్ టెండూల్కర్ క్రికెటర్. అమ్మ అంజలి వైద్యురాలు.

అదే ఆమె ఆకాంక్ష...

సచిన్ నీడలో కాకుండా... స్వయంకృషితో ఎదిగి, తనదైన ముద్ర వేయడానికి సారా తాపత్రయపడుతోంది. ఎక్కడకు వెళ్లినా టెండూల్కర్ కూతురుగా కాకుండా తనను తనుగా గుర్తించాలనేది ఆమె ఆకాంక్ష. అందుకే తనకు నచ్చినట్టు కెరీర్‌ను మలుచుకొనే ప్రయత్నం చేస్తోంది. అందుకు ఆమె తల్లితండ్రులు కూడా పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఏదికావాలన్నా సమకూరుస్తున్నారు. ఆ క్రమంలోనే ఇన్‌స్టాలోకి అడుగుపెట్టిన సారాకు ఆరంభంలోనే మంచి స్పందన లభించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పుడామెకు 75 లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. అందుకే బడా బ్రాండ్లు సారా వెంట పడుతున్నాయి. తన దైనందిన జీవిత విశేషాలు, కుటుంబం, స్నేహితులు, సన్నిహితులతో కలిసి విహార యాత్రల్లో ఆస్వాదిస్తున్న మధుర క్షణాలకు సంబంధించిన చిత్రాలు, చిన్న చిన్న వీడియోలను ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంటుంది. వాటితోపాటు 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్' (ఎస్‌టీఎఫ్) చేపట్టే కార్యక్రమాలు, దానితో కలిసి పని చేస్తున్న పలు సంస్థల వివరాలు, తను ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న ప్రకటనలను అక్కడ పంచుకొంటోంది.

ఫిట్‌నెస్ తరువాతే ఏదైనా...

ఎంత పని ఒత్తిడిలో ఉన్నా సారా జిమ్‌కు వెళ్లడం మాత్రం మానదు. ఆమెకు ఫిట్‌నెస్ తరువాతే ఏదైనా. సెలవు రోజుల్లో అయినా, ఇతర ప్రాంతాల్లో పర్యటిస్తున్నా... దగ్గర్లోని జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేస్తుంది. ఇటీవల తమ్ముడు అర్జున్‌తో కలిసి విహార యాత్రకు దుబాయ్ వెళ్లిన ఆమె... ఫిట్‌నెస్‌ను మాత్రం మరిచిపోలేదు. ఉదయం లేవగానే కొంత సమయం కసరత్తులకు కేటాయించింది. ఆహార విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటుంది. చర్మ సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుంది. పలు చర్మసౌందర్య ఉత్పత్తుల ప్రకటనల్లో కూడా నటించింది. భారతీయ సంప్రదాయ వంటలతో పాటు ఇటాలియన్ రుచులంటే ఆమెకు ఇష్టం. బాలి, ఇటలీ నచ్చిన పర్యాటక ప్రాంతాలు. సారా జంతు ప్రేమికురాలు కూడా. పిల్లులు, అరుదైన చేపలు పెంచుకొంటోంది. రెండు మేలు జాతి కుక్కలు కూడా ఇంట్లో ఉన్నాయి.

> **మనం ఎదగడమే కాదు... మనం జీవిస్తున్న సమాజం గురించి కూడా పట్టించుకోవాలనేది సారా అభిమతం. ఇటీవల తండ్రి నెలకొల్పిన 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్'కు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, ఆ దిశగా తొలి అడుగు వేసింది.**



సామాజిక చైతన్యం...

మనం ఎదగడమే కాదు... మనం జీవిస్తున్న సమాజం గురించి కూడా పట్టించుకోవాలనేది సారా అభిమతం. ఇటీవల తండ్రి నెలకొల్పిన 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్'కు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, ఆ దిశగా తొలి అడుగు వేసింది. 'ఈ కొత్త పాత్రలో సారాను చూస్తుంటే నాకు గర్వంగా ఉంది. ప్రజలకు, సమాజానికి చేయూత అందించడంలో తను ఎప్పుడూ ముందుంటుంది. మా ఫౌండేషన్‌ను మరో ఎత్తుకు తీసుకెళతుందన్న నమ్మకం నాకు ఉంది. వైద్య రంగంపై ఉన్న పరిజ్ఞానం సమాజ సాధికారతకు మరింతగా తోడ్పడుతుంది' అంటూ ఈ సందర్భంగా సచిన్ తన ట్వీట్ చేశారు.

'మా నాన్న చేపట్టిన ఈ అద్భుతమైన పనిలో భాగమై, సమాజంలో మార్పు తీసుకురావడానికి నేను కూడా దోహదపడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది' అంటూ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సారా పేర్కొంది. మారుమూల పల్లె ప్రాంతాల్లోని పిల్లలకు వైద్య సేవలు అందిస్తూ, పోషకాహార లోపాన్ని అధిగమించేలా ఈ ఫౌండేషన్ కార్యక్రమాలు చేపడుతుంది. క్రీడలు, విద్య, ఆరోగ్య సంరక్షణ ద్వారా వారిని సమున్నతంగా నిలిపేందుకు కృషి చేస్తోంది.

ప్రత్యేక సమయం...

ఎస్‌టీఎఫ్ డైరెక్టర్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి సారా ప్రత్యేక సమయం కేటాయిస్తోంది. మోడల్‌గా, న్యూట్రిషనిస్టుగా తన కెరీర్‌కు సంబంధించిన అంశాలతో పాటు ఫౌండేషన్ కార్యక్రమాలు కూడా చూసుకొంటోంది. తరచూ మారుమూల గ్రామాలకు వెళ్లి, అక్కడి పిల్లలతో మమేకం అవుతోంది. ఈ మధ్య తల్లితో కలిసి రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని గ్రామానికి వెళ్లింది. 'అక్కడి అణగారిన వర్గాలకు చెందిన చిన్నారులను కలిశాను. వారి ఆరోగ్య సంరక్షణకు క్లినిక్స్ నెలకొల్పాం. పోషకాహారం అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశాం. ఆ పర్యటన అర్థవంతంగా ముగిసినందుకు సంతృప్తిగా ఉంది' అంటూ తన సంతోషాన్ని పంచుకుంది. మరింతమంది చిన్నారుల ఆరోగ్యం, అభివృద్ధికి తన వంతు సహకారం అందించే దిశగా భవిష్యత్తు ప్రణాళికలు రచించే పనిలో సారా నిమగ్నమైంది.

స్పోర్ట్స్



రోహిత్‌కు ముందే చెప్పేశారా?

» అందుకే 'విశ్రాంతి' పేరిట దూరం

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ ఆఖరి టెస్టుకు కెప్టెన్ రోహిత్ శర్మ 'విశ్రాంతి' పేరుతో దూరంగా ఉండడం వెనుక పెద్ద కథే నడిచినట్టు సమాచారం. టెస్టులకు సంబంధించి భారత జట్టు ప్రణాళికల్లో 37 ఏళ్ల రోహిత్ లేడని బీసీసీఐ ఇటీవల అతడికి స్పష్టం జేసినట్టు తెలిసింది. భారత జట్టు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు సంక్లిష్టంగా ఉన్నాయి. పరిస్థితులు అనుకూలించి ఒకవేళ టీమిండియా తుది పోరుకు చేరినా.. బుమ్రానే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని బోర్డు పెద్దలు రోహిత్‌కు చెప్పినట్టు సమాచారం. మొత్తంగా పరిస్థితులు అనుకూలంగా లేవని గ్రహించిన హిట్‌మ్యాన్ సిడ్నీ టెస్టుకు 'విశ్రాంతి' పేరిట దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈనేపథ్యంలో బాక్సింగ్ డే టెస్టుతోనే రోహిత్ సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆఖరి మ్యాచ్ ఆడేశాడన్నమాట!

రోడ్ మ్యాప్ ఇదే!

చివరి టెస్టు ఆడేసిన రోహిత్‌కు..అంతర్జాతీయంగా మిగిలింది వన్డేలే. వాస్తవంగా దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చే 2027 వన్డే ప్రపంచ కప్ వరకు ఆడాలనేది రోహిత్ అభిలాష. కానీ ఇప్పుడు అది నెరవేరేలా కనిపించడంలేదు. భారత జట్టు వచ్చే నెలలో స్వదేశంలో ఇంగ్లండ్‌తో మూడు వన్డేలు ఆడనుంది. ఆపై చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొననుంది. అంటే..ఇంగ్లండ్‌తో సిరీస్‌తోపాటు చాంపియన్స్ ట్రోఫీలో కెప్టెన్‌గా ఆడించడం ద్వారా 50 ఓవర్ల ఫార్మాట్‌కూ రోహిత్ వీడ్కోలు పలికేలా బీసీసీఐ ప్రణాళిక తయారు చేయనున్నట్టు సమాచారం. ఒకవేళ చాంపియన్స్ ట్రోఫీని భారత్ గెలిస్తే రోహిత్ అంతర్జాతీయ కెరీర్‌కు ఘనమైన ముగింపు లభించినట్టే. అలాగే ధోనీ (2007 టీ20, 2011 వన్డే వరల్డ్ కప్‌లు) తర్వాత సారథిగా రెండు ఐసీసీ ట్రోఫీలు అందుకున్న ఘనత రోహిత్‌కు దక్కుతుంది.

షే.. అదే తీరు

కొనసాగిన బ్యాటింగ్ వైఫల్యం

ఐదో టెస్టు

భారత్ తొలి ఇన్నింగ్స్ 185

ఆసీస్ మొదటి ఇన్నింగ్స్ 9/1

రోహిత్‌కు విశ్రాంతి



కోహ్లీని అవుట్ చేసిన బోలాండ్ ఆనందం

సిడ్నీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో వేదికలు మారుతున్నాయి కానీ భారత బ్యాటింగ్ తీరు మాత్రం మారడం లేదు. పేలవ ఫామ్ కారణంగా కెప్టెన్ రోహిత్ శర్మపై వేటు పడినా.. ఎలాంటి ఫలితమూ కనిపించలేదు. కొత్త ఏడాదిలో ఆరంభమైన ఐదో టెస్టులో శుక్రవారం తొలి రోజే జట్టు కుప్పకూలింది. బంతి అనూహ్యంగా బౌన్స్ కావడంతో ఆస్ట్రేలియా పేసర్ల ధాటికి పరుగులు సాధించడంలో వెనుకబడ్డారు. అయితే రిషభ్ పంత్ (40) మాత్రం బౌన్సర్లను కాచుకుంటూ ఒళ్లు హూనమవుతున్నా ఓపిగ్గా క్రీజులో నిలిచాడు. కానీ అతడి అద్భుత పోరాటం మరోసారి అనవసర షాట్‌తో ముగిసింది. అటు విరాట్ (17) సైతం తన బలహీనతను ఈసారీ అధిగమించలేకపోయాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 72.2 ఓవర్లలో 185 పరుగులు మాత్రమే చేసింది. పంత్‌కు జడేజా (26) సహకరించగా, చివర్లో తాత్కాలిక కెప్టెన్ బుమ్రా (22) చెలరేగాడు. పేసర్లు బోలాండ్‌కు 4, స్టార్క్‌కు 3, కమిన్స్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బరిలోకి దిగిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 3 ఓవర్లలో ఖవాజా (2) వికెట్ కోల్పోయి 9 రన్స్ చేసింది. క్రీజులో కాన్‌స్టాస్ (7) ఉన్నాడు. రోహిత్ స్థానంలో గిల్, ఆకాశ్ స్థానంలో ప్రసిద్ధ్ బరిలోకి దిగారు.

ఆరంభం నుంచే..: భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగడం ప్రతికూల ప్రభావాన్ని చూపింది. సిడ్నీ పిచ్ సహజంగా ఆరంభంలో బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుందన్న అంచనాతో బుమ్రా ఈ నిర్ణయం తీసుకున్నాడు. కానీ ఆకాశం మబ్బుపట్టి ఉండడంతో పాటు పిచ్‌పై పచ్చిక ఉండడంతో ఆసీస్ పేసర్లు పండగ చేసుకున్నారు. చక్కటి సీమ్‌తో భారత బ్యాటర్లకు చుక్కలు చూపించారు. దీంతో ఒక్కో పరుగు కోసం కష్టపడిన జట్టు తొలి సెషన్‌లో 57 పరుగులు మాత్రమే సాధించి రాహుల్ (4), జైస్వాల్ (10), గిల్ (20) వికెట్లను కోల్పోయింది. విరాట్ సైతం గోల్డెన్ డకౌట్ అయ్యేవాడే. స్లిప్‌లో స్మిత్ అందుకున్న క్యాచ్ తిరిగి గాల్లోకి లేవగా బోలాండ్ అందుకున్నాడు. అయితే రీప్లేలో స్మిత్ చేతిలో ఉన్నప్పుడే బంతి నేలకు తాకినట్టు తేలింది. ఆ తర్వాత విరాట్ దీటుగా క్రీజులో నిలిచాడు. ఆఫ్‌సైడ్ ఆవలి బంతులను వదిలేస్తూ ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. ఈసారి తన స్టాన్స్‌ను కూడా మార్చుకున్నాడు. కానీ 69 బంతులాడిన కోహ్లీ ఆసీస్ ఉచ్చులో పడక తప్పలేదు.

ఒక్క బౌండరీ కూడా బాదకుండా ఎక్కువ బంతులు (69) ఎదుర్కోవడం కోహ్లీకిదే తొలిసారి.

1 విదేశీ గడ్డపై ఓ సిరీస్‌లో ఎక్కువ వికెట్లు (31) తీసిన భారత బౌలర్‌గా బిషన్ సింగ్ రికార్డును సమం చేసిన బుమ్రా.

పంత్-జడేజా పోరాటం: కోచ్ గంభీర్ సూచనల మేరకు పంత్ ఈసారి భారీ షాట్లకు వెళ్లకుండా ఓపిగ్గా ఆడాడు. అటు జడేజా కూడా సహకరించడంతో ఐదో వికెట్‌కు 48 పరుగులు సమకూరాయి. జడ్డూ మూడు పరుగుల వద్ద ఉన్నప్పుడు స్లిప్‌లో స్మిత్ సులువైన క్యాచ్‌ను వదిలేశాడు. అయితే చివరి సెషన్‌లో ఆసీస్ మరోసారి దెబ్బతీసింది. ఒకే ఓవర్‌లో పంత్, నితీశ్ (0)లను వరుస బంతుల్లో బోలాండ్ అవుట్ చేసి షాకిచ్చాడు. 120/6 స్కోరుతో నిలిచిన జట్టుకు చివర్లో బుమ్రా వేగంగా పరుగులు అందించాడు. 68వ ఓవర్‌లో 3 ఫోర్లతో, ఆ తర్వాత ఓ సిక్సర్ బాది ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) వెబ్‌స్టర్ (బి) బోలాండ్ 10; రాహుల్ (సి) కాన్‌స్టాస్ (బి) స్టార్క్ 4; గిల్ (సి) స్మిత్ (బి) లియోన్ 20; కోహ్లీ (సి) వెబ్‌స్టర్ (బి) బోలాండ్ 17; పంత్ (సి) కమిన్స్ (బి) బోలాండ్ 40; జడేజా (ఎల్బీ) స్టార్క్ 26; నితీశ్ (సి) స్మిత్ (బి) బోలాండ్ 0; సుందర్ (సి) క్యారీ (బి) కమిన్స్ 14; ప్రసిద్ధ్ (సి) కాన్‌స్టాస్ (బి) స్టార్క్ 3; బుమ్రా (సి) స్టార్క్ (బి) కమిన్స్ 22; సిరాజ్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 26; మొత్తం: 72.2 ఓవర్లలో 185 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-11, 2-17, 3-57, 4-72, 5-120, 6-120, 7-134, 8-148, 9-168, 10-185. **బౌలింగ్:** స్టార్క్ 18-5-49-3; కమిన్స్ 15.2-4-37-2; బోలాండ్ 20-8-31-4; వెబ్‌స్టర్ 13-4-29-0; లియోన్ 6-2-19-1.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (బ్యాటింగ్) 7; ఉస్మాన్ ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 2; **మొత్తం: 3 ఓవర్లలో 9/1. వికెట్ పతనం:** 1-9; **బౌలింగ్:** బుమ్రా 2-0-7-1; సిరాజ్ 1-0-2-0.

పోటెత్తిన ఫ్యాన్స్

సిడ్నీ టెస్టులో తొలి రోజు ఆటను తిలకించేందుకు అభిమానులు భారీ స్థాయిలో హాజరయ్యారు. గ్రౌండ్ సామర్థ్యం 48 వేలు కాగా, శుక్రవారం 47,556 మంది ఆటను తిలకించారు. 1976 తర్వాత ఈస్థాయిలో హాజరుకావడం ఇదే తొలిసారని క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది.

తొలి సెషన్‌లో చెలరేగితే..

సిడ్నీ పిచ్‌పై తొలి రోజు బంతి ఇంతలా బౌన్స్ కావడం గతంలో జరగలేదని విశ్లేషకులు చెబుతున్నారు. పంత్‌కు తగిలిన బంతులు కూడా అలాంటివే. అందుకే ఆసీస్‌కు టాస్ కోల్పోవడమే లాభించిందని చెబుతున్నారు. ఇక రెండో రోజు శనివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. దీంతో ఆరంభంలోనే బుమ్రా మరింతగా చెలరేగి ఆసీస్ వికెట్లను త్వరత్వరగా పడగొడితే మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించే అవకాశం ఉంటుంది.

దెబ్బలే దెబ్బలు



భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ పేసర్ల నుంచి బుల్లెట్‌లాంటి బంతులు నేరుగా శరీరాన్ని తాకడంతో రిషభ్ పంత్ బాధతో విలవిల్లాడాడు. ఈక్రమంలో అతడి పొత్తి కడుపులో రెండుసార్లు, ఓసారి హెల్మెట్‌కు బంతి తాకింది. ఇక మిచెల్ స్టార్క్ ఓవర్‌లో దూసుకువచ్చిన ఓ బంతి అయితే అతడి మోచేతికి కాస్త పైన తాకడంతో ఆ ప్రాంతమంతా ఎర్రగా కమిలిపోయింది. ఇక వాషింగ్టన్ సుందర్, సిరాజ్ కూడా బంతి తగలడంతో ఇబ్బంది పడ్డారు.



మాటల తూటాలతో ముగిసె..

ఆసీస్ తొలి రోజు ఆడింది కేవలం మూడు ఓవర్లే అయినా మైదానంలో ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. శుక్రవారం ఆట ఆఖరి బంతికి ఓపెనర్ ఖవాజాను బుమ్రా అవుట్ చేశాడు. స్లిప్‌లో రాహుల్ క్యాచ్ తీసుకోవడంతో భారత ఆటగాళ్లు ఒక్కసారిగా మరో టీనేజ్ ఓపెనర్ కాన్‌స్టాస్ వైపు దూసుకువచ్చి కసిగా సంబరాలు చేసుకున్నారు. దీనికి కారణం.. ఆ బంతి వేయడానికి ముందు బుమ్రా, కాన్‌స్టాస్ మధ్య జరిగిన వాగ్వాదమే. బుమ్రా బౌలింగ్ వేసేందుకు ప్రయత్నిస్తుండగా ఓపెనర్ ఖవాజా కాస్త ఆగమన్నట్టు సైగ చేశాడు. దీంతో బుమ్రా ఏమైందంటూ రెండు చేతులు చాపి అసహనం వ్యక్తం చేశాడు. ఇంతలో నాన్‌స్ట్రయికింగ్ ఎండ్‌లో ఉన్న కాన్‌స్టాస్ కలుగజేసుకున్నాడు. దీంతో సీరియస్ అయిన బుమ్రా 'మధ్యలో నీకెందుకు?' అన్నట్టుగా ముందుకు వచ్చాడు. అటు కాన్‌స్టాస్ ఏమాత్రం తగ్గకుండా బుమ్రా వైపు రావడంతో అంపైర్ సర్దిచెప్పాడు. ఆ వెంటనే తక్కువ ఎత్తులో వచ్చిన బంతిని ఆడి ఖవాజా అవుటయ్యాడు. అంతే.. ఎన్నడూ ప్రశాంతత కోల్పోని బుమ్రా ఒక్కసారిగా కాన్‌స్టాస్ వైపు దూసుకువచ్చి సంబరాలు చేసుకున్నాడు. పెవిలియన్ వైపు వెళుతున్న కాన్‌స్టాస్‌ను ఆటగాళ్లు కూడా చుట్టుముట్టి సీరియస్‌గా చూడడం కనిపించింది. బుమ్రాతో పెట్టుకుంటే ఇలాగే ఉంటుందని నెట్టింట ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

ఆవులు కడుపునిండా తినేలా..

సిడ్నీ పిచ్ పచ్చికపై గవాస్కర్ వ్యంగ్యం

బ్యాటింగ్‌కు అనుకూలిస్తుందని అంచనా వేసిన సిడ్నీ వికెట్‌పై పరిస్థితి తారుమారైంది. బంతి శరీరంపైకి దూసుకురావడంతో పరుగులు చేయడానికి భారత బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. పిచ్‌పై విపరీతంగా పచ్చిక ఉండడాన్ని దిగ్గజ బ్యాటర్ సునీల్ గవాస్కర్ తీవ్రంగా ఆక్షేపించాడు. 'సిడ్నీ వికెట్‌పై ఇంతగా పచ్చిక ఉండడం గతంలో నేను ఎప్పుడూ చూడలేదు. దాంతో బ్యాటింగ్ చేయడం కష్టమైంది. ఆవులు కడుపునిండా తినేలా పిచ్‌పై పచ్చిక ఉంచారు' అని గవాస్కర్ ఎద్దేవా చేశాడు.



న్యూయార్క్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్‌లో విజేతగా నిలిచిన కోనేరు హంపి న్యూఢిల్లీలో ప్రధాని మోదీని శుక్రవారం కలుసుకున్న దృశ్యం

లోకేశ్‌ను కలిసిన 'బాలపురస్కార్' గ్రహీత



తాడేపల్లి (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025 అవార్డు అందుకున్న గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లి నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. భవిష్యత్‌లో ఆమె ఉన్నత శిఖరాలను అధిరోహించాలని లోకేశ్ ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

కరుణ్ కొత్త రికార్డు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విదర్భ కెప్టెన్ కరుణ్ నాయర్ విజయ్ హజారే టోర్నమెంట్‌లో సరికొత్త రికార్డు సృష్టించాడు. ఉత్తరప్రదేశ్‌తో శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో సెంచరీ సాధించిన కరుణ్ నాయర్ (112).. లిస్ట్-ఎ క్రికెట్ (50 ఓవర్ల ఫార్మాట్)లో అవుట్ కాకుండా అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. నాయర్ అవుట్ కాకుండా ఓవరాల్‌గా 541 పరుగులు కొల్లగొట్టాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ జేమ్స్ ఫ్రాంక్లిన్ (527) పేరిటనున్న రికార్డును అధిగమించాడు. అంతేకాదు.. ఈ టోర్నీలో నాయర్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో నాలుగు సెంచరీలు చేసి మరో రికార్డును కూడా ఖాతాలో వేసుకున్నాడు. ఇక, యూపీతో పోరులో విదర్భ 8 వికెట్లతో గెలిచింది.

ఆంధ్రకు నిరాశ

నవీ ముంబై: విజయ్ హజారే టోర్నీలో ఆంధ్ర జట్టుకు నిరాశ ఎదురైంది. మహారాష్ట్రతో మ్యాచ్‌లో తొలుత ఆంధ్ర 7 వికెట్లకు 270 పరుగులు చేసింది. శశికాంత్ (52 నాటౌట్) అశ్విన్ హెబ్బర్ (49)రాణించారు. ఛేదనలో సిద్దేశ్ వీర్ (115 నాటౌట్) సెంచరీకి తోడు రాహుల్ త్రిపాఠి (69) అదరగొట్టడంతో మహారాష్ట్ర 47.3 ఓవర్లలోనే 274/5 స్కోరు చేసి గెలిచింది. ఇక, గ్రూప్-సిలో హైదరాబాద్ 80 పరుగుల తేడాతో పంజాబ్ చేతిలో చిత్తయింది.

ఎస్‌బీఐ రెండు కొత్త డిపాజిట్ పథకాలు

న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. హర్ ఘర్ లఖ్‌పతీ, ఎస్‌బీఐ ప్యాట్రన్స్ పేరుతో రెండు కొత్త డిపాజిట్ పథకాలను ప్రారంభించింది. హర్ ఘర్ లఖ్‌పతీ ప్రీ-క్యాల్కులేటెడ్ రికరింగ్ డిపాజిట్ పథకమని, కస్టమర్లు రూ.లక్ష చొప్పున పోగేసుకునేందుకు దోహదపడనుందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఎస్‌బీఐ తెలిపింది. ఈ పథకం ఆర్థిక లక్ష్యాల సాధన ప్రక్రియను సరళీకరిస్తుందని, కస్టమర్లు భవిష్యత్ ఆర్థిక ప్రణాళిక రచించుకోవడంతో పాటు సమర్థవంతంగా ఆదా చేసేందుకు అనుమతిస్తుందని బ్యాంక్ పేర్కొంది. కాగా, 80 ఏళ్లు, ఆపైబడిన సీనియర్ సిటిజన్ల కోసం ఎస్‌బీఐ ప్యాట్రన్స్ డిపాజిట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టినట్లు బ్యాంక్ వెల్లడించింది.

ప్రస్తుత, కొత్త కస్టమర్లందరికీ ఈ పథకం అందుబాటులో ఉంటుందని.. ఈ పథకంపై సీనియర్ సిటిజన్లకు ఆఫర్ చేసే వడ్డీ రేటు కంటే 0.10 శాతం అధికంగా చెల్లించడం జరుగుతుందని బ్యాంక్ స్పష్టం చేసింది. రికరింగ్ డిపాజిట్ పథకానికి వినగా ఎఫ్‌డీలకు చెల్లించే వడ్డీనే లభించనుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ ఏడాదికి పైగా కాలపరిమితి డిపాజిట్లపై 6.80 శాతం, రెండేళ్లకు పైగా ఎఫ్‌డీపై 7 శాతం, 3-5 ఏళ్ల డిపాజిట్‌పై 6.75 శాతం, 5-10 ఏళ్ల డిపాజిట్‌పై 6.5 శాతం వార్షిక వడ్డీ ఆఫర్ చేస్తోంది. రికరింగ్ డిపాజిట్ కనీస కాలపరిమితి ఏడాది. గరిష్ఠ కాలపరిమితి 10 ఏళ్లుగా ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ



హైదరాబాద్	525	విజయవాడ	535
వరంగల్	527	గోదావరి	525
చిత్తూరు	563	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	108
వరంగల్	103	గుంటూరు	108
కరీంనగర్	103	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	88
కర్నూలు	103	నెల్లూరు	92
విశాఖపట్నం	97	అనంతపురం	92
గోదావరి	108		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,200 ▲	72,600 ▲	1,00,000 ▲
విజయవాడ	81,000 ▲	75,000 ▲	92,500 ▲
విశాఖపట్నం	77,980 ▲	71,480 ▲	89,830 ▲
రాజమండ్రి	79,200 ▲	72,600 ▲	90,300 ▲
ప్రొద్దుటూరు	78,200 ▼	73,340 ▲	90,200 ▲
ముంబై	77,504 ▲	70,994 ▲	88,221 ▲

ఐటీ ఉద్యోగాలకు 'టెక్' గండం

2030 నాటికి కోటి కొలువులు కష్టమే.. కొత్త టెక్నాలజీల్లోనే 20 లక్షల ఉద్యోగాలు

అదనంగా రూ.13 లక్షల కోట్ల టర్నోవర్

క్వెస్ట్ ఐటీ స్టాఫింగ్

న్యూఢిల్లీ: ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో నియామకాల భవిష్యత్ ఆశాజనకంగా కనిపించడం లేదు. కంపెనీలు ఇప్పటికే ఆచితూచి నియామకాలు జరుపుతున్నాయి. గత రెండేళ్లలో ఐఐటీలతో సహా ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ ప్రాంగణ నియామకాలు భారీగా తగ్గాయి. అమెరికా, యూరప్‌ల నుంచి మన ఐటీ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులు తగ్గడం ఇందుకు ఒక కారణమైతే, కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి సరికొత్త టెక్నాలజీలు ఇందుకు మరో కారణం. ప్రస్తుతం భారత ఐటీ రంగం 54 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఇది కోటికి చేరుతుందని' క్వెస్ట్ ఐటీ స్టాఫింగ్' అనే సంస్థ గతంలో అంచనా వేసింది. అయితే ఏఐ వంటి టెక్నాలజీల కారణంగా 2030 నాటికి ఇది 75 లక్షలకు మించకపోవచ్చని తన తాజా నివేదికలో తెలిపింది.

మారుతున్న సమీకరణాలు: ఏఐ, ఎంఎల్, ఆటోమేషన్ కారణంగా మన ఐటీ కంపెనీల స్వరూప, స్వభావాలు మారిపోతున్నాయి. కంపెనీలు సాధారణ టెక్ ఉద్యోగుల కంటే జనరేటివ్ ఏఐ, ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్, డేటా సైన్స్ ఆటోమేషన్ వంటి ప్రత్యేక నైపుణ్యాల్లో పట్టు ఉన్న వారి కోసం వెదుకుతున్నాయి. ఈ సంవత్సరం వీరి నియామకాలు 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని టీమ్‌లీజ్ డిజిటల్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ విజ్ చెప్పారు. కాగా 2030 నాటికి ఈ ప్రత్యేక రంగాల్లో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు, రూ.12.86 లక్షల కోట్ల వ్యాపారం లభించే అవకాశం ఉందని క్వెస్ట్ ఐటీ స్టాఫింగ్ సీఈఓ కపిల్ జోషి అంచనా. అయితే ప్రస్తుతం దేశీయ ఐటీ కంపెనీలకు ఈ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులు చాలినంత మంది దొరకడం లేదు. దీంతో కంపెనీలు ఉన్న ఉద్యోగులకే ఈ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తూ నెట్టుకొస్తున్నట్టు జోషి చెప్పారు. ఈ మార్పులతో భారత ఐటీ పరిశ్రమ ముందు ముందు హై వాల్యూ టెక్ సేవలు, నవకల్పనలకు కేంద్రంగా మారనుందన్నారు.



'జీసీసీ'లదే హవా

నిన్న మొన్నటి వరకు ఐటీ కంపెనీలు పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టేవి. ఇప్పుడు గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాలు (జీసీసీ) ఆ స్థానాన్ని ఆక్రమించాయి. ప్రస్తుతం మన దేశంలోని 1,700 జీసీసీల్లో 19 లక్షల మంది పని చేస్తున్నారు. 2030 నాటికి ఈ కేంద్రాల సంఖ్య 2,200కు, ఉద్యోగుల సంఖ్య 25 నుంచి 28 లక్షలకు పెరుగుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

బెంగళూరు టాప్

కంపెనీలు, ఉద్యోగాలపరంగా చూస్తే దేశ ఐటీ రంగంలో ఇప్పటికీ బెంగళూరుదే హవా. సరికొత్త టెక్నాలజీ కంపెనీల పరంగా చూసినా బెంగళూరు మిగతా అన్ని నగరాల కంటే ముందుంది. బెంగళూరు తర్వాత ఈ విషయంలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్నట్టు క్వెస్ట్ ఐటీ స్టాఫింగ్ తెలిపింది.

బిజినెస్

పెన్షన్ చెల్లింపులకు కేంద్రీయ వ్యవస్థ

అన్ని ప్రాంతీయ కార్యాలయాల్లోనూ అందుబాటు

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థకు (ఈపీఎఫ్‌ఓ) చెందిన దేశంలోని అన్ని ప్రాంతీయ కార్యాలయాల్లోను కేంద్రీయ పెన్షన్ చెల్లింపు వ్యవస్థ (సీపీపీఎస్) అందుబాటులోకి వచ్చింది. ఇది 68 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం కలిగిస్తుందని కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుతం పెన్షన్ చెల్లింపుల వ్యవస్థ వికేంద్రీకృతంగా ఉన్నందు వల్ల ప్రతి జోనల్/ప్రాంతీయ కార్యాలయం వేర్వేరుగా 3 లేదా 4 బ్యాంకులతో అంగీకారాలు కుదుర్చుకోవాల్సి వస్తోందని అధికారులు తెలిపారు. ఈ సీపీపీఎస్ వ్యవస్థ కింద లబ్ధిదారుడు ఏ బ్యాంకు నుంచైనా పెన్షన్ డ్రా చేసుకోవచ్చు. పెన్షన్ ప్రారంభం సమయంలో వెరిఫికేషన్ కోసం బ్యాంకుకు కూడా వెళ్లాల్సిన పని ఉండదు. పెన్షన్ మొత్తం విడుదల కాగానే లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ అయిపోతుంది. పెన్షనర్ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారినా లేదా లబ్ధిదారుని బ్యాంక్/బ్రాంచి మారిన సందర్భాల్లో ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి పెన్షన్ పేమెంట్ ఆర్డర్ల (పీపీఓ) జారీ చేయాల్సిన అవసరం లేకుండానే ఈ జనవరి నుంచి సీపీపీఎస్ వ్యవస్థ కింద పెన్షన్లు చెల్లించగలుగుతారు. రిటైర్మెంట్ అనంతరం స్వస్థలాలకు వెళ్లే పెన్షనర్లకు దీని ద్వారా పెద్ద ఊరట లభిస్తుంది. డిసెంబరు నాటికి ఈపీఎఫ్ఓ 122 పెన్షన్ చెల్లింపు ప్రాంతీయ కార్యాలయాల ద్వారా 68 లక్షల మంది పైగా పెన్షనర్లకు రూ.1570 కోట్ల మొత్తంలో పెన్షన్లు చెల్లిస్తోంది.

2025లో స్మార్ట్‌ఫోన్ మార్కెట్ రూ.4.29 లక్షల కోట్లు

కౌంటర్ పాయింట్ అంచనా

న్యూఢిల్లీ: ప్రీమియం డివైస్‌లకు డిమాండ్ పెరగడంతో దేశంలో ఈ ఏడాది స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 5,000 కోట్ల డాలర్లకు (రూ.4,28,900 కోట్లు) చేరుతుందని అంచనా. 2021 సంవత్సరంలో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ పరిమాణం 3790 కోట్ల డాలర్ల (రూ.3.25 లక్షల కోట్లు) స్థాయిలో ఉంది. ప్రధానంగా యాపిల్, సామ్‌సంగ్ ప్రీమియం, అల్ట్రా ప్రీమియం ఫోన్ల మార్కెట్‌కు చోదకంగా ఉన్నాయని టెక్నాలజీ మార్కెట్ పరిశోధన సంస్థ కౌంటర్ పాయింట్ తాజా నివేదికలో తెలిపింది. మొబైల్ ఫోన్ల విభాగం ద్వారా 2024 సంవత్సరంలో యాపిల్ రూ.67,121.6 కోట్లు, సామ్‌సంగ్ రూ.71,1,57.6 కోట్ల ఆదాయం నమోదు చేశాయి. దేశంలో స్మార్ట్‌ఫోన్ల రిటైల్ సగటు విక్రయ ధర 300 డాలర్ల (రూ.25,700) దాటుతుందని ఆ నివేదిక అంచనా వేసింది. యాపిల్ స్మార్ట్‌ఫోన్లను స్థానికంగా తయారుచేయడం, ఐఫోన్ల ధరలు ఇటీవల తగ్గింపు వల్ల ఆ కంపెనీకి చెందిన ప్రో మోడళ్లకు బలమైన డిమాండ్ కనిపిస్తోంది. అలాగే సామ్‌సంగ్ ఎస్ సిరీస్ ఫోన్ల ద్వారా విలువ ఆధారిత వ్యూహం అనుసరిస్తోంది. నివేదిక ముఖ్యాంశాలు...

- చైనాకు చెందిన వివో, ఒప్పో, వన్‌ప్లస్ బ్రాండ్లు రూ.30,000-రూ.45,000 ధరల శ్రేణిలో అత్యాధునిక కెమెరా ద్వారా కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి.
- వన్‌ప్లస్ తన స్మార్ట్‌ఫోన్లలో ఎదురైన మదర్‌బోర్డ్ సమస్యను, రిటైలర్ల ఫిర్యాదులను కూడా పరిష్కరించి పూర్వ వైభవం సాధించేందుకు కృషి చేస్తోంది. దీనికి తోడు ఈ కంపెనీ స్థానిక మార్కెట్లో విస్తరణపై రూ.6,000 కోట్లు పెట్టుబడి పెడుతోంది.
- ఈ ఏడాది ప్రీమియం విభాగం (రూ.30,000 ధర పైన) 20 శాతం పైబడిన మార్కెట్ వాటా సాధిస్తుందని అంచనా.

హెచ్‌యూఎల్ గూటికి మినిమలిస్ట్!

- డీల్ విలువ రూ.3,000 కోట్లు

న్యూఢిల్లీ: దేశీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) భారీ కొనుగోలుకు సిద్ధమైనట్లు తెలిసింది. జైపూర్‌కు చెందిన స్కిన్‌కేర్ ఉత్పత్తుల స్టార్టప్ మినిమలిస్ట్‌ను టేకోవర్ చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ డీల్ విలువ రూ.3,000 కోట్ల స్థాయిలో ఉండే అవకాశం ఉంది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ పీక్ ఎక్స్‌వీ పార్ట్‌నర్స్ పెట్టుబడులు కలిగిన మినిమలిస్ట్.. గతంలో హెచ్‌యూఎల్ మాతృసంస్థ యూనిలీవర్‌కు చెందిన పెట్టుబడి విభాగమైన యూనిలీవర్ వెంచర్స్ నుంచి రూ.110 కోట్లు సమీకరించింది. చర్మ సంరక్షణ ఉత్పత్తుల మార్కెట్లో మినిమలిస్ట్ అనతి కాలంలోనే ప్రముఖ బ్రాండ్‌గా ఎదిగింది. 2022-23లో రూ.184 కోట్లుగా నమోదైన ఈ స్టార్టప్ ఆదాయం.. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 89 శాతం వృద్ధితో రూ.350 కోట్లకు పెరిగింది.

మార్కెట్ జోరుకు బ్రేకులు

ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు..

సెన్సెక్స్ 720 పాయింట్లు పతనం

ముంబై: కొత్త ఏడాదికి శుభారంభంగా తొలి రెండు సెషన్లలో భారీగా పుంజుకున్న స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ చతికిలపడ్డాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో దాదాపు ఒక శాతం క్షీణించాయి. సెన్సెక్స్ 720.60 పాయింట్ల నష్టంతో 79,223.11 వద్దకు జారుకుంది. నిఫ్టీ 183.90 పాయింట్లు కోల్పోయి 24,004.75 వద్ద స్థిరపడింది. వచ్చే వారంలో డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. డాలర్ బలోపేతం, రూపాయి క్షీణత, అధిక వాల్యుయేషన్లు వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 నష్టపోయాయి.

- భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి క్షీణించింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 4 పైసలు తగ్గి రూ.85.79 వద్ద ముగిసింది. దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరగడంతో పాటు ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి.
- గత నెల 27తో ముగిసిన వారంలో భారత్ వద్ద విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు 411 కోట్ల డాలర్ల మేర తగ్గి 64,027 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. గత వారంలోనూ నిల్వలు 847 కోట్ల డాలర్ల మేర తగ్గాయి. గత కొన్ని వారాలుగా నిల్వలు క్షీణిస్తూ వస్తున్నాయి.

ఐపీఓ సమాచారం: గుజరాత్‌కు చెందిన రాజ్‌పుతానా స్టెయిన్‌లెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ను ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ 1.9 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్‌కు చెందిన 35 లక్షల ఈక్విటీ షేర్లను సైతం జారీ చేయనుంది.

- క్వాడంట్ ఫ్యూచర్ రూ.290 కోట్ల ఐపీఓ ఈ నెల 7న ప్రారంభమై 9న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.275-290గా నిర్ణయించింది.

హెచ్-1బీ వీసాలపై రచ్చ!

- డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీల్లో భిన్నస్వరాలు
- హెచ్-1బీ వీసాలకు మేం అనుకూలమే: ట్రంప్
- విదేశీ కార్మికుల నుంచి దోపిడీకే : బెర్నీ

వాషింగ్టన్, జనవరి 3: అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ముంచుకొస్తున్న వేళ హెచ్-1బీ వీసాలపై చర్చ తీవ్రరూపం దాల్చింది. ఈ వ్యవహారం డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీల్లో అంతర్గతంగా మంటలు రేపుతోంది. వివిధ దేశాలకు చెందిన వృత్తి నిపుణుల సేవలను వినియోగించుకోవాలని భావించే అమెరికా సంస్థలు ఈ వీసాలను స్పాన్సర్ చేస్తుంటాయి. ఇందుకోసం ప్రతి ఏడాది 85వేల హెచ్-1బీ వీసాలను అమెరికా జారీ చేస్తుంది. వీటిలో 65 వేలు రెగ్యులర్ క్యాప్ కాగా, మరో 20 వేల వీసాలను తమ దేశంలో అడ్వాన్స్ డిగ్రీలు పూర్తిచేసిన వారికి మాత్రమే ఇస్తుంది. ఈ వీసా ద్వారా లబ్ధి పొందిన వారిలో భారతీయులే అధికంగా ఉన్నారు. వీసాల అంశంపై ట్రంప్ ఇటీవల స్పందించారు. తాను ఎల్లప్పుడూ హెచ్-1బీ వీసాలకు అనుకూలమేనని, అందుకే తమ దేశంలో ఆ వీసాలు ఉన్నాయని అమెరికా 47వ అధ్యక్షుడిగా ఈ నెల 20న ప్రమాణ స్వీకారం చేయనున్న ట్రంప్ మద్దతు పలికారు. 'అమెరికాలో అత్యంత సమర్థులైన వ్యక్తులు ఉండాలని నేను ఎల్లప్పుడూ భావిస్తాను. మనకు సమర్థులు అవసరం. మన దేశంలోకి తెలివైన వ్యక్తులు చాలామంది రావాలి. మునుపెన్నడూ లేని స్థాయిలో మనకు ఉద్యోగాలు రాబోతున్నాయి' అని కొత్త సంవత్సరం వేడుకల్లో ఆయన మీడియాతో అన్నారు. ఆయన సన్నిహితులైన ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి సైతం ఈ వీసాలకు మద్దతు ప్రకటించారు.

శ్రీరామ్ నియామకంతో మొదలైన వివాదం

ఏఐపై వైట్‌హౌస్ సీనియర్ పాలసీ అడ్వైజర్‌గా శ్రీరామ్ కృష్ణన్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. ఆయన నియామకంతో హెచ్-1బీ వీసాలపై వ్యతిరేకత ప్రారంభమైంది. నైపుణ్యం కలిగిన వలసదారుల కోసం గ్రీన్‌కార్డుల విషయంలో ఉన్న పరిమితులను తొలగించాలని గతంలో శ్రీరామ్ పిలుపునిచ్చారు. దీనిపై ట్రంప్ మద్దతుదారుల నుంచి తీవ్ర ప్రతిఘటన వ్యక్తమవుతోంది. ఈ విధానం అమెరికన్ల ఉద్యోగాలను



హరిస్తోందని వారు వాదించడంపై మస్క్ మండిపడ్డారు. 'స్పేస్ ఎక్స్ టెస్లా తరహాలో అమెరికాను బలోపేతం చేసిన వందలాది కంపెనీలను స్థాపించిన నాలాంటి వ్యక్తులు ఇక్కడకు రావడంలో హెచ్1బీ వీసాలదే కీలక పాత్ర. అందుకే ఈ వీసాలపై ఎవరితోనైనా యుద్ధానికి సిద్ధమే' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. అలాగే వివేక్ రామస్వామి మాట్లాడుతూ, నైపుణ్యం కలిగిన గ్రాడ్యుయేట్లను అమెరికా తక్కువ స్థాయిలో తయారు చేస్తున్నందున విదేశీ నిపుణులను దేశంలోకి అనుమతించడానికి హెచ్-1బీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

కార్పొరేట్ల కోసమే ఈ వ్యవస్థ: శాండర్స్

హెచ్-1బీ వీసాల వ్యవహారంలో ట్రంప్ సన్నిహితులు ఇద్దరూ తప్పు చేస్తున్నారని డెమొక్రటిక్ సెనేటర్ బెర్నీ శాండర్స్ గురువారం వ్యాఖ్యానించారు. 'అత్యంత నైపుణ్యం కలిగిన అమెరికన్ ఇంజనీర్లు, ఇతర టెక్ వర్కర్ల కొరత కారణంగా ఈ ఫెడరల్ ప్రోగ్రాం మన దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత ముఖ్యమైనదని మస్క్, అనేకమంది ఇతర బిలియనీర్ టెక్ కంపెనీ యజమానులు వాదించారు. దీనికి నేను అంగీకరించను. ఉత్తమమైన, ప్రతిభావంతులను నియమించుకోవడం ప్రస్తుతం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం కాదు. మంచి వేతనంతో కూడిన అమెరికన్ ఉద్యోగాల్లో విదేశాల నుంచి తక్కువ వేతనంతో కూడిన ఒప్పంద సేవకులను నియమించడమే లక్ష్యం. ఎంత చౌకగా కార్మికులను నియమించుకుంటే అంత ఎక్కువ డబ్బును ఈ బిలియనీర్లు ఆదా చేసుకుంటారు' అని శాండర్స్ పేర్కొన్నారు. కార్పొరేట్లను సుసంపన్నం చేస్తూ, విదేశాల నుంచి వచ్చే కార్మికులను దోపిడీ చేయడానికి ఈ వ్యవస్థను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అయితే ఆయన సొంత పార్టీకే చెందిన ఇండో-అమెరికన్ డెమొక్రటిక్ చట్టసభ్యులు రో ఖన్నా, రాజా కృష్ణమూర్తి, శ్రీ థానేదార్ మాత్రం ఈ కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు.

త్వరలో '22ఏ'పై నిషేధం ఎత్తివేత

పేదల ఇళ్ల పట్టాలు, భూములకే విముక్తి

- 22ఏ జాబితాలో 1.88 కోట్ల ఎకరాలు
- 25 వరకు రెవెన్యూ సదస్సుల కొనసాగింపు
- రెవెన్యూ సదస్సులో మంత్రి అనగాని వెల్లడి

విజయవాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 22ఏ జాబితాలో ఉన్న పేదల భూములపై నిషేధం ఎత్తివేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.88 కోట్ల ఎకరాల భూములు 22ఏ జాబితాలో ఉన్నాయని తెలిపారు. వీటిలో దేవదాయ, ప్రభుత్వ భూములు, అనేక కేటగిరీ భూములు ఉన్నాయన్నారు. శుక్రవారం మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో జోన్-2, జోన్-3 లకు సంబంధించిన 11 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవదాయ, ప్రభుత్వ భూములు పోనూ పేదలకు నివేశనా స్థలాలు, సాగు పట్టాలుగా ఇచ్చినవి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ 22ఏలోనే ఉన్నాయని, పేదలకు లబ్ధి కలిగించాలన్న ఉద్దేశంతో ఇలాంటి వాటన్నింటినీ 22ఏ జాబితా నుంచి తొలగించేందుకు కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్టు వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదల భూములను కొట్టేయాలన్న ఉద్దేశంతో అక్రమంగా కొందరి భూములను 22ఏలో చేర్చిందన్నారు. ప్రజా ప్రతినిధుల నుంచి పెద్ద ఎత్తున వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని 22ఏ కేటగిరీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో ప్రధానంగా 32 రకాల అర్జీలు వస్తున్నాయని, ఆర్ఓఆర్‌కు సంబంధించి 1.01 లక్షల అర్జీలు, సర్వే వివాదాలపై 7 వేల అర్జీలు వచ్చాయని తెలిపారు.

25 వరకు రెవెన్యూ సదస్సులు

రెవెన్యూ సదస్సులు ఈ నెల 20వ తేదీ నాటికి ముగుస్తాయని, ఉత్తరాంధ్ర వంటి ప్రాంతంలో కొన్ని ఇబ్బందులు ఉండటం వల్ల మరో ఐదు రోజులు పొడిగించినట్టు మంత్రి తెలిపారు. ఈ నెల 25వ తేదీ తర్వాత 45 రోజులలో అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రీ సర్వేను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి అనగాని చెప్పారు. గతంలో మాదిరిగా కాకుండా ఒక మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా రోజుకు 20 ఎకరాల వరకు రీ సర్వే చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాస్‌పుస్తకాలపై ఫిర్యాదులు చేసిన వారికి రాజముద్రతో కూడిన కొత్త పుస్తకాలను అందిస్తామన్నారు.ఫ్రీహోల్డ్ భూములకు మంత్రుల కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అంతకుముందు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జోన్-2, జోన్-3 ప్రజా ప్రతినిధులంతా పేదల సమస్యలను మంత్రి అనగాని దృష్టికి తీసుకువచ్చారు. తమ నియోజకవర్గాల పరిధిలోని పేదల నివేశనా స్థలాలు, పేదలకు గతంలో సాగు భూములుగా ఇచ్చిన వాటిని 22ఏ నుంచి తొలగించాలన్న డిమాండ్లు భారీగా వచ్చాయని తెలిపారు. వీటిపై సత్వరం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



రెవెన్యూ రీజనల్ అధికారుల సమావేశంలో పాల్గొన్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి

లబ్ధిదారుల ఎంపికలో మినహాయింపులివ్వండి: మంత్రి పార్థసారథి

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో కొన్ని మినహాయింపులు ఇవ్వాలని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ శుక్రవారం ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. పీఎంఏవై గ్రామీణ్-2.0 లబ్ధిదారుల ఎంపిక విషయంలో 10 అంశాలు పరిగణించాలని కేంద్రం పేర్కొందని, వాటి పరిధిలోకి వచ్చేవారిని ఆటోమేటిక్‌గా అనర్హులుగా ప్రకటిస్తున్నారని తెలిపారు. వాటిలో 3 అంశాల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. 3, 4 చక్రాల వ్యవసాయ యంత్ర పరికరాలు, వాహనాలు కలిగినవారు, రూ.50వేలకు మించి క్రెడిట్ లిమిట్ కలిగిన కిసాన్ క్రెడిట్ కార్డులు కలిగినవారిని అనర్హులుగా ప్రకటించారని వివరించారు. అయితే ఎంతోమంది రుణంతో ఆటోలు, టాక్సీలు కొనుగోలు చేసుకుని బతుకుతున్నారని, వారిని అనర్హులుగా ప్రకటించడం సరికాదన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమలకు వన్-స్టాప్ హెల్ప్‌లైన్

- ప్రారంభించిన మంత్రి టీజీ భరత్

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించడంతోపాటు పెట్టుబడిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్న లక్ష్యంతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ 04045901100 నంబరుతో వన్-స్టాప్ హెల్ప్‌లైన్ సెంటరును అందుబాటులోకి తీసుకువచ్చింది. దీన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేవారు.. ప్రాజెక్ట్ రిపోర్టు సమర్పించడం మొదలు ప్రభుత్వ అనుమతులు పొందే వరకు వివిధ దశల్లో అవసరమైన సాయమందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద జిల్లా రిసోర్స్ పర్సన్‌లను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్స్‌తో అనుసంధానం చేసి బ్యాంకు రుణాలు పొందడంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తుందన్నారు.

భవన సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు శుక్రవారం లేఖ రాశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బోర్డు నిధులను జీవో 17 ద్వారా దారిమళ్లించి బోర్డును నిర్వీర్యం చేశారని తెలిపారు. రాష్ట్రంలోని 46వేల పెండింగ్ క్లెయిములకు నిధులు మంజూరు చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

నిపుణుల సమ్మతి రాలేదని.. ఎందుకు చెప్పలేదు?

- డయాఫ్రం వాల్ పనులు 2నే అన్నారుగా!
- ఇప్పుడు 8వ తేదీ అంటున్నారేంటి?
- జలవనరుల అధికారులపై నిమ్మల ఆగ్రహం
- నిపుణులు స్పష్టత ఇచ్చాకే తారీఖు ఖరారుకు ఆదేశం

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం డయాఫ్రం వాల్ పనుల విషయంలో గందరగోళం ఏమిటని తన శాఖ అధికారులపై జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణంలో వాడాల్సిన ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమానికి విదేశీ నిపుణులు ఇంకా అనుమతి ఇవ్వలేదని తనకు ముందుగా ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. శుక్రవారం బుడమేరు విస్తరణ పనులపై సమీక్ష సందర్భంగా వాల్ ప్రస్తావన వచ్చింది. పనులు ప్రారంభించేందుకు జర్మన్ కాంట్రాక్టు సంస్థ బావర్ యంత్రసామగ్రిని, నిపుణులను సిద్ధం చేసిందని.. ఈ నెల రెండో తేదీనే పనులు ప్రారంభిస్తామని నెలరోజులుగా చెబుతూ వచ్చారని.. ముఖ్యమంత్రి జరిపిన సమీక్షలోనే ఇదే చెప్పారని.. ఇప్పుడు వాయిదావేయడమేంటంటూ మంత్రి మండిపడ్డారు. వాల్ నిర్మాణానికి వాడాల్సిన ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్‌కు అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ ఆమోదం తీసుకోవాలని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిందని ఇప్పుడు చెబితే ఎలాగని నిలదీశారు. ముందస్తు సమాచారం తనకు ఇవ్వలేదని.. వాల్ పనులు వాయిదా పడ్డాయని 'ఆంధ్రజ్యోతి'లో చూశాకే ఆ విషయం తెలిసిందన్నారు. దీనిపై అధికారులు వివరణ ఇచ్చారు. రెండో తేదీన పనులు ప్రారంభించేందుకు పోలవరం ఇంజనీర్లు సిద్ధమయ్యారని, అయితే ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్చర్‌పై విదేశీ నిపుణులు.. డేవిడ్ బ్రియాన్ పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో (అమెరికా), సీన్ హించ్‌బెర్గర్, చార్లెస్ రిచర్డ్ డొనెల్లీ(కెనడా)తో కూడిన బృందం ఆమోదం పొందాల్సిందేనని జల సంఘం స్పష్టం చేసిందని తెలిపారు. అప్పటికప్పుడు ఆ నిపుణులతో సంప్రదింపులు జరిపేందుకు ఇంజనీర్లు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారులు ప్రయత్నించారని.. క్రిస్మస్ వేడుకల్లో మునిగి ఉన్న వారు అందుబాటులోకి రాలేదన్నారు. ఈ నెల 7-10 తేదీ మధ్య వారు అందుబాటులోకి రాగానే.. కాంక్రీట్ మిక్చర్‌పై స్పష్టత తీసుకుంటామని పీపీఏ తెలిపిందన్నారు. 8వ తేదీ నుంచి పనులు చేపట్టేలా ఒప్పిస్తామని కూడా చెప్పిందని తెలియజేశారు. దీంతో నిమ్మల మరింత అసహనానికి గురయ్యారు. డయాఫ్రం వాల్ పనులపై అంతర్జాతీయ నిపుణులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే తేదీని ఖరారు చేయాలని తేల్చిచెప్పారు. కాగా.. కాంక్రీట్ మిక్చర్‌పై నిపుణుల అనుమతి రాలేదన్న సమాచారం ప్రభుత్వం దృష్టికి ప్రాజెక్టు ఇంజనీర్లు తీసుకురాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయాన్ని ముందే మంత్రికి చెబితే.. సీఎం దృష్టికి తీసుకెళ్లేవారని.. ఆయన కేంద్ర జలశక్తి శాఖతో మాట్లాడితే.. ఈసరికి స్పష్టత వచ్చేదని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

చిత్రజ్యోతి
SINCE 1965

రెట్రో రీ లోడెడ్



హిమేష్ రేష్మియా కథానాయకుడిగా నటిస్తూ, నిర్మిస్తున్న బాలీవుడ్ చిత్రం 'బదాస్ రవికుమార్'. 1980ల నేపథ్యంలో సాగే కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. శుక్రవారం చిత్ర బృందం విడుదల తేదీని ప్రకటించింది. ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది. అలాగే ఈ నెల 5న ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ప్రభుదేవా ప్రతినాయక పాత్ర పోషించారు. రెట్రో రీ లోడెడ్ అంటూ యూనిట్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. పాతతరం బాలీవుడ్ హీరోల ఆహార్యాన్ని ప్రతిబింబించే లుక్‌లో హిమేశ్ ఆకట్టుకున్నారు. 80ల నాటి బాలీవుడ్ స్వర్ణయుగాన్ని ఈ తరానికి పరిచయం చేసే ప్రయత్నం ఈ చిత్రం ద్వారా చేస్తున్నామని దర్శకుడు కెయిత్ గోమెస్ తెలిపారు.



రీ రికార్డింగ్‌లో '1000 కోట్లు'

మోహన్‌లాల్ హీరోగా జోషి దర్శకత్వంలో కాసుల రామకృష్ణ, శ్రీకర గుప్త నిర్మించిన చిత్రం '1000 కోట్లు'. మలయాళంలో విజయవంతమైన ఈ చిత్రం త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కాసుల రామకృష్ణ మాట్లాడుతూ 'మలయాళంలో సూపర్‌హిట్ అయిన చిత్రాన్ని తెలుగులో '1000 కోట్లు' పేరుతో విడుదల చేస్తున్నాం. మోహన్ లాల్ సరసన కావ్య మాధవన్ నటించారు. ప్రముఖ సీనియర్ ఆర్టిస్ట్ నాగమహేశ్ మోహన్‌లాల్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ చిత్రాన్ని జనవరి చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని అన్నారు. పీఆర్ఓ వీరబాబు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

'నా ప్రయాణం ఓ కలలా ఉంది'

మీనాక్షి చౌదరి

'చిత్రపరిశ్రమలో నా ప్రయాణం ఓ కలలా ఉంది. నన్ను నమ్మి మంచి పాత్రలు ఇస్తున్న దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు' అన్నారు హీరోయిన్ మీనాక్షి చౌదరి. విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో ఆమె ఓ కథానాయికగా నటించారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలవుతున్న సందర్భంగా శుక్రవారం మీనాక్షి మీడియాతో ముచ్చటిస్తూ చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- గతేడాది సంక్రాంతికి నేను నటించిన 'గుంటూరు కారం' చిత్రం విడుదలైంది. ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో మరోసారి పండుగకు వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. తొలిసారిగా ఈ సినిమాలో కామెడీ జానర్ ట్రై చేశా. కామెడీ స్పేస్ కలిగిన పోలీస్ పాత్ర చేయడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్నగారు ఆర్మీ ఆఫీసర్. అందుకే ఆఫీసర్ బాడీ లాంగ్వేజ్ పై అవగాహన ఉంది. పోలీస్ పాత్ర చేయాలనేది నా కల. కెరీర్ ప్రారంభంలోనే ఆ అవకాశం రావడం లక్కీ. ఈ సినిమాలో యాక్షన్ సీన్లూ చేశాను. వాటిని చూసి జనం ఎంజాయ్ చేస్తారు.
- వెంకటేశ్ అద్భుతమైన వ్యక్తి. ఆయనతో వర్క్ చేయడం హ్యాపీ. ఆయన ముఖంలో ఎప్పుడూ ఆనందం కనిపిస్తుంటుంది. ఆయన కామెడీ టైమింగ్ అద్భుతం. అనిల్, వెంకీలది సూపర్ కాంబినేషన్. అన్ని సీన్లూ అద్భుతంగా కుదిరాయి.
- దర్శకుడు అనిల్ రావిపూడి కామెడీ టైమింగ్ ఫెంటాస్టిక్. సీన్‌ను పండించడంలో ఆయన ఆలోచనలు అద్భుతంగా ఉంటాయి. కామెడీ పాత్ర చేయడం నాకు తొలిసారే అయినా అనిల్ ఎంతో ఓపికగా ప్రతి సీన్ వివరించేవారు. ఇది ఫ్యామిలీ సబ్జెక్ట్ అయినా కామెడీది మేజర్ పార్ట్. అన్ని ఎమోషన్స్ ఉంటాయి.
- కొత్త సంవత్సరం కూడా ఆశాజనకంగానే ఉంటుందని అనుకుంటున్నాను. నవీన్ పోలిశెట్టితో ఓ సినిమా చేస్తున్నాను. మరో రెండు సినిమాలు ఉన్నాయి. నిర్మాతలే వాటిని ప్రకటిస్తారు.





అడ్వంచర్ లుక్ అదిరింది

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం 'బిఎస్ఎస్12'(వర్కింగ్ టైటిల్). మహేశ్ చందు నిర్మిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాలో అతని క్యారెక్టర్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. హీరోను అడ్వంచర్ అవతార్‌లో ప్రెజెంట్ చేశారు. రెండు కాళ్లు సీటుపై పెట్టుకుని బైక్‌ని నడుపుతూ ధైర్యంగా దూసుకెళ్తున్న లుక్ అదిరిపోయింది. బ్యాక్ గ్రౌండ్ మూమెంట్ ఇంటెన్సిటీని పెంచింది. ఒక విశాలమైన లోయ, అతని వెనుక ఒక కొండపై విష్ణు నామాలు కనిపించడం అద్భుతంగా ఉంది.



యాక్షన్ హీరోగా పేరు తెస్తుంది

సత్యరాజ్

దర్శకుడు మారుతి సమర్పకుడిగా రూపొందుతున్న చిత్రం 'బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో విజయపాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. సత్యరాజ్, వశిష్ఠ ఎన్ సింహ, సాంచి రాయ్, సత్యం రాజేశ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మారుతి మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం సలహాలు, సూచనలు ఇవ్వడం తప్ప నేనే మరేమీ చేయలేదు. ఇది రిస్కీ జానర్ అని మాత్రం చెప్పా. విజయ్ ఈ సినిమా కోసం చాలా ఖర్చు పెట్టారు. చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. పెద్ద హిట్ అవుతుంది' అన్నారు.

'ఈ సినిమాకు కథే హీరో. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది. ఏజ్డ్ యాక్షన్ హీరో అనే ట్యాగ్ కోసం ప్రయత్నిస్తున్న నాకా ఆ ట్యాగ్ ఈ సినిమాతో వస్తుంది. తెలుగులో నేనే డబ్బింగ్ చెప్పా' అన్నారు సత్యరాజ్. దర్శకుడు మారుతితో కలసి ఈ సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉందని నిర్మాత విజయపాల్ చెప్పారు. ఇంత పెద్ద సినిమా చేస్తానని అనుకోలేదనీ, చిత్రం అద్భుతంగా ఉంటుందని దర్శకుడు మోహన్ చెప్పారు.

మంచి స్పందన వస్తోంది



మూలవిరాట్, పద్మ, రాజ్‌కుమార్, స్వప్న నటీ నటులుగా ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో విజయలక్ష్మీ జైనీ నిర్మించిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ' బయోపిక్. ఇటీవలె విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత విజయలక్ష్మి మాట్లాడుతూ' తెలంగాణకు చెందిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. విద్యార్థుల కోసం ఉదయం ఆటను ఉచితంగా ప్రదర్శిస్తున్నాం. దీనికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోంది' అని తెలిపారు. చిత్ర దర్శకుడు ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ 'ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికన్నా ఎక్కువ రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమా విడుదలకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు నా ధన్యవాదాలు' అని అన్నారు.

దర్శకురాలు అపర్ణ మల్లాది కన్నుమూత



టాలీవుడ్ దర్శకురాలు అపర్ణ మల్లాది (54) కేన్సర్‌తో కన్నుమూశారు. నాలుగేళ్ల క్రితం కేన్సర్ బారిన పడిన అపర్ణ అమెరికాలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. 'ది అనుశ్రీ ఎక్స్‌పెరిమెంట్స్, పెళ్లికూతురు పార్టీ' చిత్రాలను ఆమె తెరకెక్కించారు. ఓటీటీల రాకకు పూర్వమే 'పోష్ పోరీస్' పేరుతో ఆమె రూపొందించిన వెబ్‌సిరీస్‌కు యూట్యూబ్‌లో మంచి ఆదరణ దక్కింది.

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం ఎగువ బోయపల్లెకు చెందిన టెంపో డ్రైవర్ మహేశ్ (28) ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి రూ.15 లక్షలు పోగొట్టుకున్నాడు. అప్పుల వాళ్ల ఒత్తిళ్లు తట్టుకోలేక.. ఇటీవల ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తంబళ్లపల్లె మండలం దిగువ గాలిగుట్టపల్లెకు చెందిన పద్మనాభరెడ్డి (26) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. బెట్టింగ్‌లకు అలవాటు పడి.. రూ.20 లక్షలకుపైగా పోగొట్టుకున్నాడు. అవి తీర్చే మార్గం కానరాక.. రెండు నెలల క్రితం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

అనంతపురం నగరంలోని ఎర్రనేల కొట్టాలకు చెందిన చిల్లర ప్రకాశ్ తరచూ గంజాయి సేవించేవాడు. అతని స్నేహితుడు హరి కూడా మద్యానికి బానిసయ్యాడు. వీటి కోసం వారికి డబ్బు అవసరమైంది. ఈ క్రమంలో ఇటీవల తమ ఇంటి పక్కన నివాసముండే గంగమ్మ అనే మహిళను హత్య చేసి.. ఆమె మెడలోని బంగారు గొలుసు, కొంత నగదు దోచుకెళ్లారు.

విష వలయం..!

వ్యసనాల ఉచ్చులో యువత కుదేలు

(మొదటి పేజీ తరువాయి)



పెరిగాక.. చేతిలోకి 5జీ స్పీడ్ సెల్‌ఫోన్ వచ్చాక.. యువతలో ఈ విష సంస్కృతి పెరిగింది. పెళ్లికోసం దాచిన సొమ్మును, ఇల్లు కట్టటకోవడం కోసం బ్యాంకులో ఉంచిన డబ్బుని, ధాన్యం అమ్మగా వచ్చిన ధనాన్ని ఆన్‌లైన్ గేముల్లో తగలేసి.. ఇంట్లో వాళ్లకు విషయం తెలిశాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులను తీరని క్షోభకు గురిచేస్తున్నారు. యువత మాత్రమే కాదు.. వివాహమై కుటుంబాన్ని బాధ్యతగా నడిపించాల్సిన వారు సైతం వ్యసనాలకు బానిసలై భారంగా తనువు చాలిస్తున్నారు. పోతూ పోతూ.. కుటుంబసభ్యులపై మోయలేని భారం మోపుతూ, వారికీ భవిష్యత్తు లేకుండా చేస్తున్నారు.

దొంగతనాలు.. దాడులు.. హత్యలు..

ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్‌లు ఆడి డబ్బులు పోగొట్టుకున్న వారిలో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా, మరికొందరు ఆ అప్పులు తీర్చేందుకు దొడ్డిదారులు వెతుక్కుంటున్నారు. గంజాయి, డ్రగ్స్ కోసం దొంగతనాలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఏడాది క్రితం శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండల కేంద్రానికి చెందిన ఓ లారీ డ్రైవర్‌ను ఇటీవల ఇద్దరు యువకులు బైక్ ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఇటుకలతో దాడి చేశారు. డ్రైవర్ ఎలాగోలా తప్పించుకుని లేపాక్షికి చేరుకున్నారు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నిందితులు గంజాయి మత్తులో ఈ హత్యచేసినట్లు పోలీసులు నిర్ధారించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం గోళ్లాపురంవద్ద జూలైలో గంజాయి సేవించిన కొందరు యువకులు అదే గ్రామానికి చెందిన సతీశ్ (42) అనే వ్యక్తిని ఊరుబయటకు తీసుకెళ్లి కిరాతకంగా కొట్టి చంపేశారు. గంజాయి మత్తులో హత్యచేసినట్లు పోలీసులు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని శాంతి టాకీస్ సమీపంలో ద్విచక్ర వాహనం ఇవ్వనందుకు ఓ వ్యక్తిపై సల్మాన్ అనే యువకుడు కత్తితో దాడి చేశాడు. అడ్డొచ్చిన మరో ఇద్దరినీ కత్తితో పొడిచాడు. నిందితుడు గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులు తేల్చారు.

ఆత్మహత్యకు పురిగొల్పుతున్న లోన్ యాప్‌లు

గంజాయి, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వ్యసనాల బారిన పడినవారు.. తక్షణ అవసరం కోసం వెంటనే అప్పు ఇచ్చే లోన్ యాప్‌లు, మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తూ.. వాటి ఉచ్చులో చిక్కుకుంటున్నారు. 'ఎటువంటి పత్రాలతో పనిలేకుండా.. తక్షణమే రుణం పొందండి' అంటూ లోన్ యాప్‌లు అదే పనిగా మొబైల్ ఫోన్‌కు మెసేజ్ పంపిస్తుండడంతో బాధితులు అప్పటికే డబ్బు కోసం ఎదురు చూస్తుండడంతో.. సదరు లోన్ యాప్ నుంచి వచ్చిన లింక్‌ను ఓపెన్ చేస్తున్నారు. దీంతో అతని మొబైల్‌లోని వివరాలన్నీ వెంటనే లోన్ యాప్ నిర్వాహకులకు చేరిపోతాయి. రుణం తీసుకున్నాక తిరిగి చెల్లించక పోతే.. పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. అప్పటికే బాధితుడి మొబైల్ నుంచి వివరాలను సేకరించిన యాప్ నిర్వాహకులు.. అతడి ఫోటోలను మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలను అతని కాంటాక్టు లిస్టులో ఉన్నవారికి పంపించడం మొదలుపెడతారు. అంతేకాకుండా.. కాంటాక్టు లిస్టులో ఉన్న వారికి ఫోన్లు చేసి బాధితుడి అప్పు గురించి చెబుతారు. అతనితో సంబంధం ఉన్నందున ఆ అప్పును వారు కూడా చెల్లించాలని బెదిరిస్తారు. ఇలా పరువు బజారున పడడంతోపాటు వేధింపులకు తాళలేక బాధితులు ఆత్మహత్యకు పాల్పడే పరిస్థితులు తలెత్తుతున్నాయి.

వ్యూహం మార్చిన గంజాయి ముఠాలు

గంజాయిని అరికట్టేందుకు పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. దాన్ని వినియోగిస్తున్న వారికి ఏదో రకంగా అది లభిస్తూనే ఉంది. ఏపీలోని ఏజెన్సీ ప్రాంతంతోపాటు ఒడిశా నుంచి కూడా గంజాయి సరఫరా అవుతోంది. రాష్ట్రంలో గంజాయి రవాణాకు పోలీసులు అడ్డుకట్ట వేస్తుండడంతో.. గతంతో పోలిస్తే దీని వినియోగం కొంత మేరకు తగ్గింది. అయితే విక్రయ ముఠాలు వ్యూహం మార్చి కొత్తరూపంలో గంజాయిని సరఫరా చేస్తున్నాయి. గతంలో క్వింటాళ్ల చొప్పున గంజాయిని వాహనాల్లో తరలించగా.. ఇప్పుడు తక్కువ పరిమాణంలో కిలోల చొప్పున తరలిస్తున్నారు. పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకుంటున్నారు. ఒకవేళ పట్టుబడినా.. తక్కువ పరిమాణంలో ఉన్నందున కేసు నుంచి కూడా త్వరగా బయటపడతామన్న ఆలోచనతో ఈ వ్యూహాన్ని ఎంచుకుంటున్నారు. ఇదే కాకుండా.. గంజాయిని ద్రవరూపంలోకి మార్చి అతితక్కువ పరిమాణంలో తరలిస్తున్నారు. ఒకటి రెండు లీటర్ల పరిమాణంలో తీసుకొస్తూ బస్సుల్లో, ఇతర వాహనాల్లో సులువుగా తరలిస్తున్నారు. అనంతరం దాన్ని 'హ్యాష్ ఆయిల్' పేరుతో అతి తక్కువ పరిమాణంలో 5 గ్రాములు, 10 గ్రాముల చొప్పున చిన్న చిన్న ట్యూబ్‌లలో విక్రయిస్తున్నారు.



ఒకే కుటుంబంలో నలుగురు బలి

చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు మండలం ఎగవూరు గ్రామానికి చెందిన నాగరాజులరెడ్డి కుమారుడు దినేశ్ కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగులతో డబ్బులు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. అప్పుల బాధలు తట్టుకోలేక ఈ ఏడాది అక్టోబరు 4న కుటుంబ సభ్యులంతా కలిసి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కుటుంబ పెద్ద నాగరాజులరెడ్డి (61), ఆయన సతీమణి జయంతి (50), కుమార్తె సునీత (26), కుమారుడు దినేశ్ (22)లను తమిళనాడులోని రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ నాలుగు రోజుల వ్యవధిలో నలుగురూ మరణించారు.

రాష్ట్రంలో విషాద గాథలు

- చిత్తూరులోని దుర్గా నగర్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ.. ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసగా మారాడు. ఈ క్రమంలో అప్పులు చేసిమరీ రూ.36 లక్షలు పోగొట్టుకున్నాడు. మూడు నెలల కిందట ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని చనిపోయాడు.
- చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలో దిలీప్‌రెడ్డి అనే ఇంజనీరింగ్ విద్యార్థి 2022లో ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారి డబ్బులు పోగొట్టుకున్నాడు. చదువుపై ఏకాగ్రత కూడా కోల్పోయి ఆత్మహత్య చేసుకున్నాడు.
- శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో అత్తా కోడళ్లపై అక్టోబరులో సామూహిక అత్యాచారం జరిగింది. నిందితులు ఎరుకల కావడి నాగేంద్ర, సాకె ప్రవీణ్‌కుమార్, చాకలి శ్రీనివాస్‌తో పాటు మరో ముగ్గురు మైనర్లు గంజాయి సేవించి, ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.
- శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణ పరిధిలోని మోతుకపల్లివద్ద చందు, రోహిత్ అనే ఇద్దరు స్నేహితులు పరస్పరం దూషించుకున్నారు. రోహిత్‌ను చందు కత్తితో పొడిచాడు. వీరిద్దరూ గంజాయి మత్తులో గొడవపడినట్లు పోలీసులు నిర్ధారించారు. వీరిలో ఒకరు గంజాయి విక్రయిస్తున్నట్లు కూడా గుర్తించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్క హిందూపురంలోనే 50 మంది గంజాయి విక్రేతలు, వినియోగదారులను అరెస్టు చేశారు.
- అనంతపురం రూరల్ మండలం పాముదాయికి చెందిన పప్పూరు రామాంజినేయులు (28) వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసై అప్పులు చేశాడు. అప్పులవారి నుంచి ఒత్తిడి పెరగడంతో దిక్కుతోచక పది రోజుల క్రితం తన ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు.



తెలుగులోనూ ప్రభుత్వ ఉత్తర్వులు

» కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి ప్రభుత్వం విడుదల చేసే అన్ని ఉత్తర్వులను తెలుగులోనూ జారీ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు, నిబంధనలు, సూచనలు ప్రజలకు తేలికగా అర్థమయ్యేందుకు ఇంగ్లిష్‌తో పాటు తెలుగు లోనూ ఉత్తర్వులు జారీ చేయాలని అన్ని శాఖలను ఆదేశించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం... జీవోఐఆర్ వెబ్‌సైట్‌లో తొలుత ఇంగ్లిష్‌లో ఉత్తర్వుల కాపీ అప్‌లోడ్ చేసిన రెండు రోజుల్లోగా తెలుగు కాపీని కూడా అప్‌లోడ్ చేయాలి. లేదా తొలుత తెలుగు కాపీ అప్‌లోడ్ చేసిన తర్వాత ఇంగ్లిష్ కాపీ అప్‌లోడ్ చేయవచ్చు. తెలుగు, ఇంగ్లిష్ కాపీలు ఒకేసారి అప్‌లోడ్ చేసే వెసులుబాటును కూడా ప్రభుత్వం కల్పించింది. జీవోలను తెలుగులోకి అనువదించే బాధ్యతలను డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్స్‌కు అప్పగించింది. ఆయా శాఖలు విడుదల చేసిన జీవోలను ట్రాన్స్‌లేషన్ విభాగం రెండు రోజుల్లో అనువదించి సంబంధిత శాఖలకు పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సచివాలయంలోని అన్ని శాఖల జీవోలను తెలుగులో కూడా అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యాసంస్థల్లో కులవివక్షపై తీసుకున్న చర్యలేమిటి?

» యూజీసీకి సుప్రీంకోర్టు ప్రశ్న

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో కులవివక్షపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి తీసుకున్న చర్యల వివరాలను తెలపాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఉన్నత విద్యాసంస్థల్లో సమాన అవకాశాల కేంద్రాల (ఈక్వల్ అపర్చ్యునిటీ సెల్స్) ఏర్పాటుపై కూడా వివరాలను సమర్పించాలని సూచించింది. విద్యాసంస్థలలో కులవివక్షను నిర్మూలించేలా తగిన చర్యలను కోరుతూ రోహిత్ వేముల తల్లి రాధిక వేముల, ఆదివాసీ విద్యార్థిని పాయల్ తాడ్వీ తల్లి అబేద సలీం తాడ్వీ దాఖలు చేసిన 'పిల్'పై శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, దిశా వాడేకర్‌లు... విద్యాసంస్థలలో కుల వివక్షను నిర్మూలించేలా నిబంధనలను అమలు చేయడంలో యూజీసీ విఫలమైందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల ఆత్మహత్యలపై కులాల వారీగా సవివరంగా నివేదిక ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. 2004-2024 మధ్యకాలంలో ఐఐటీల్లోనే 115 ఆత్మహత్యలు జరిగాయని తెలిపారు. ఈ వాదనలపై నాలుగు వారాలలోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, యూజీసీకి, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్‌లకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 28కి వాయిదా వేసింది.

రబీ పంటలు ఆశాజనకం

» సాధారణ విస్తీర్ణం 53.8 లక్షల ఎకరాలు

» ఇప్పటికే 26.42 లక్షల ఎకరాలు సాగులోకి

» పెరిగిన వాణిజ్య పంటల సాగు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ సీజన్ ఆశాజనకంగా సాగుతోంది. గత ఏడాదితో పోల్చితే సాగు చాలా మెరుగ్గా ఉంది. 53.8 లక్షల ఎకరాల రబీ సాధారణ సాగులో ఇప్పటికే 26.42 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి. నిరుడు రబీలో వర్షాభావం, ఇతర సమస్యలతో సాగు బాగా తగ్గింది. గతేడాదితో పోల్చితే ఇప్పుడు 5లక్షల ఎకరాల్లో ఎక్కువగా పంటలు వేశారు. కృష్ణా, గోదావరి డెల్టాల్లో మొదటి పంట వరి కోసిన కొందరు రైతులు రెండో పంటగా జొన్న, మొక్కజొన్న, అపరాలు వేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రెండో పంటగా వేసే వరి సాగు పుంజుకుంది. నిరుటి కంటే అధికంగా నాట్లు పడ్డాయి. నైరుతీ, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాయలసీమలో వర్షాలు ఆశాజనకంగా కురవడంతో రబీ సాగు ఆశాజనకంగా ఉంది. రైతులు రాగి, సజ్జ, ఇతర చిరుధాన్యాలతోపాటు వేరుశనగ, ఇతర నూనెగింజల పంటలు వేస్తున్నారు. అలాగే ప్రకాశం జిల్లాతోపాటు రాయలసీమలో ఉలవ సాగు గణనీయంగా పెరిగింది. ఈ సీజన్‌లో 45వేల ఎకరాల్లో వేసే ఉలవ పంట ఇప్పటికే లక్షన్నర ఎకరాలు దాటింది. ప్రకాశం, గుంటూరు జిల్లాలతోపాటు రాయలసీమతో కలిపి 10లక్షల ఎకరాలపైగా సాగవ్వాల్సిన శనగ (బెంగాలీ గ్రామ్) ఇప్పటికి 6లక్షల ఎకరాల్లో సాగులోకి వచ్చింది. కంది, మినుము, పెసర పంటలు కూడా 70-80% పడ్డాయి. పొగాకు సాగు సాధారణం కంటే 60వేల ఎకరాల్లో పెరిగింది.

వ్యవసాయ డీలర్లకు డిజిటల్ లైసెన్స్‌లు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏప్రిల్ నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారానికి జారీ చేసే లైసెన్స్‌ల ప్రక్రియలో డిజిటల్ ఆన్‌లైన్ లైసెన్స్ విధానాన్ని వ్యవసాయ శాఖ తీసుకొస్తోంది. గతంలో ఓఎల్‌ఎంఎస్ ఆన్‌లైన్ లైసెన్సు విధానం ఉండగా, 2019 నుంచి ఈ-ఆఫీస్ విధానంలో లైసెన్సులు మంజూరు చేస్తున్నారు. ఈ రెండు విధానాల్లో లోటుపాట్లను సవరించి, డిజిటల్ ఆన్‌లైన్ నిర్వహణ వ్యవస్థను తెస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో కృత్రిమ మేధ, డీప్ టెక్ సాంకేతికను వినియోగించి డిజిటల్ లైసెన్స్ విధానాన్ని అమలు చేయనున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం తెలిపారు. కొత్త విధానంలో వ్యాపారుల లైసెన్సుల కాలపరిమితి, వారి దరఖాస్తు ఏ దశలో ఉన్నదో సూచించడం, రెన్యువల్ వంటి విషయాలను సంక్షిప్త సమాచారం ద్వారా దరఖాస్తుదారునికి తెలియజేస్తామని చెప్పారు. డిజిటల్ ఆన్‌లైన్ నిర్వహణ ద్వారా ఎరువులు, పురుగు మందుల నమూనాలు సేకరించి, నాణ్యతను నిర్ధారించే ఇన్సైట్ యాప్‌తో జోడిస్తామన్నారు.

మనిషికో రూలా?

» రిటైర్డ్ అధికారుల పునర్నియామకంలో వేర్వేరు ప్రమాణాలు, పోస్టింగులు

» కింజరాపు ప్రభాకర్‌కు నిబంధనల వర్తింపు

» విజిలెన్స్‌లో ఓఎస్డీగా నియామకం

» బుడితి రాజశేఖర్‌పై అవ్యాజ ప్రేమ

» వ్యవసాయ శాఖలో మళ్లీ స్పెషల్ సీఎస్‌గా

» కూటమి సర్కారు నిర్ణయంపై విమర్శలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రూల్స్ అందరికీ ఒకటే. ఒక్కొక్కరికి ఒక్కో రూల్ ఉండదు. కానీ పదవీ విరమణ చేసిన అధికారుల పునర్నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై విమర్శలు చెలరేగుతున్నాయి. కొందరికి నిబంధనల ప్రకారం పోస్టింగులు ఇస్తూ, ఉన్నత స్థానాల్లో ఉన్న మరికొందరి విషయంలో వాటిని పక్కన పెట్టి అవ్యాజ ప్రేమ చూపించడం అధికార వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది. ప్రభుత్వం మనిషికో రూలు వర్తింప చేస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా పునర్నియామకం పొందిన ఇద్దరు అధికారులు కింజరాపు ప్రభాకర్, బుడితి రాజశేఖర్ విషయంలో ప్రభుత్వం చూపించిన తేడా విమర్శలకు బలం చేకూరుస్తోంది. మంత్రి అచ్చెన్నాయుడుకు స్వయానా సోదరుడైన కింజరాపు ప్రభాకర్‌కు సర్వీసు పొడిగించకుండా ఓఎస్డీగా నియమించింది. కానీ బుడితి రాజశేఖర్‌కు మాత్రం సర్వీసు పొడిగిస్తూ మళ్లీ అదే హోదాలో స్పెషల్ సీఎస్‌గా పోస్టింగ్ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలో కింజరాపు కుటుంబం మొదటి నుంచి టీడీపీలో ఉంది. ఎర్రన్నాయుడు హయాం నుంచి నేటి వరకూ ఆ కుటుంబం ఉత్తరాంధ్రలో ప్రాముఖ్యం పొందుతోంది. ఆ కుటుంబానికి చెందిన పోలీస్ అధికారి కింజరాపు ప్రభాకర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో అదనపు డీసీపీ స్థాయిలో పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ చేశారు. తనకు కొంతకాలం పొడిగింపు ఇవ్వాలని కోరుతూ ఆయన దరఖాస్తు చేశారు. ప్రభుత్వం ఆయన దరఖాస్తును పరిశీలించి విజిలెన్స్ విభాగంలో శాఖాపరమైన అవసరాల దృష్ట్యా, ఆ శాఖ పరిధిలో జరుగుతున్న విచారణల్లో ఆయన ఉన్నందువల్ల ఏడాది పాటు పనిచేయడానికి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కానీ ఆయనను తిరిగి అదనపు డీసీపీగా కాకుండా ఆ శాఖలో ఓఎస్డీగా నియమించింది. పదవీ విరమణ చేసిన వారిని తిరిగి తీసుకోవాలంటే ఓఎస్డీగానే నియమించాలన్నది నిబంధన. ఓఎస్డీ హోదాలో ఏ ఫైలుపైనా సంతకాలు చేయడం కుదరదు. పార్టీలో బాగా ప్రాముఖ్యం ఉన్న రాజకీయ కుటుంబం నుంచి వచ్చినా ప్రభాకర్ విషయంలో ప్రభుత్వం నిబంధనలను నిక్కచ్చిగా పాటించింది. కానీ ఇటీవలే పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ విషయంలో మాత్రం ప్రభుత్వం మరో రకంగా వ్యవహరించింది. ఆయన అప్పటిదాకా పనిచేసిన శాఖలో అదే హోదాలో స్పెషల్ సీఎస్‌గా పునర్నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ విరమణ చేసిన వారిని తిరిగి తీసుకోవాలంటే ఓఎస్డీగానో లేదా కన్సల్టెంట్‌గానో లేదా సలహాదారుగానో నియమించాల్సి ఉంటుంది. రిటైరయిన స్థానంలోనే అదే శాఖలో నియమించడం నిబంధనలకు విరుద్ధం. స్పెషల్ సీఎస్ హోదాలో నియమించడం వల్ల రాజశేఖర్‌కు ఇప్పుడు అధికారిక ఫైళ్లపై సంతకాలు చేసే అధికారం కూడా వస్తోంది. సర్వీసులో ఉన్న అధికారులు ఫైళ్లపై నిర్ణయం తీసుకొని సంతకం చేస్తే తప్పొప్పులకు వారు బాధ్యత వహిస్తారు. పదవీ విరమణ చేసిన వారికి అటువంటి బాధ్యత ఉండదు కాబట్టి పునర్నియామకం చేసినా వారికి ఫైళ్లపై సంతకం చేసే అధికారం ఇవ్వరు. అధికార యంత్రాంగంలో సాధారణంగా అనుసరించే పద్ధతి ఇది. కానీ బుడితి రాజశేఖర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవేవీ పాటించకుండా అత్యంత ఆపేక్ష ప్రదర్శించడం ఇతర అధికారులను విస్మయపరుస్తోంది. దాదాపు ఒకే సమయంలో రిటైరైన ఇద్దరు అధికారులను పునర్నియమించే విషయంలో వేర్వేరు ప్రమాణాలు పాటించడం.. వేర్వేరు రకాల పోస్టింగులు ఇవ్వడం ప్రశ్నలను లేవనెత్తుతోంది. వ్యవసాయ శాఖలో శాఖాపరమైన అవసరాల దృష్ట్యా ఆయనకు మళ్లీ పోస్టింగు ఇచ్చారని సమర్థకులు చెబుతున్నారు. కౌలుదారు చట్టం తయారీలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన కొనసాగింపు అవసరం ఉందని ఆయనకు సన్నిహితంగా ఉండే ఒకనేత శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా చట్టం తయారీ వంటి శాఖాపరమైన అవసరాలకు రాజశేఖర్‌ను మళ్లీ అదే హోదాలో నియమించి ఫైళ్లపై సంతకాలు పెట్టే అధికారం కల్పించాల్సిన అవసరం లేదని.. ఓఎస్డీగానో, కన్సల్టెంట్‌గానో నియమించినా ఆ పని పూర్తవుతుందని ఒక అధికారి వ్యాఖ్యానించారు.



విదేశీ ప్రయాణాలపై ఐటీ నజర్?

» దుబాయ్, అమెరికా ప్రయాణాలపై దృష్టి

» విమాన టికెట్, భోజనాలు, లగేజీ విశ్లేషణ

» వివరాల కోసం ఎయిర్‌లైన్స్‌కు సర్క్యులర్లు

» ఈ నెల 10వ తేదీ వరకు గడువు విధింపు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

విదేశీ ప్రయాణాలు జరిపే భారతీయులపై ఇకపై ఆదాయపన్ను(ఐటీ) శాఖ కూడా నిఘా పెట్టనుంది. ఇప్పటి వరకు అడ్వాన్స్‌డ్ ప్యాసింజర్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఏపీఐబీ) ద్వారా ఇంటెలిజెన్స్ వర్గాలు.. అతిథి యాప్ ద్వారా కస్టమ్స్ శాఖ, డీఆర్ఐ నిఘా పెట్టేవి. అదే కోవలో ఇప్పుడు ఐటీ శాఖ కూడా విమానయాన సంస్థలు భారతీయుల ప్రయాణాల వివరాలను అందించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. భారత్‌కు రాకపోకలు సాగించే దేశ, విదేశీ విమానయాన సంస్థలు ఈ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాల్సిందేనని.. ఈ నెల 10వ తేదీలోగా ఆ పనిని పూర్తి చేయాలని సర్క్యులర్లు జారీ చేసింది. అంతేకాదు.. ఏప్రిల్ 1 నుంచి రెండు విదేశీ విమానయాన సంస్థల విషయంలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేయనుంది. జూన్ 1 నుంచి అన్ని విమానయాన సంస్థలను తన నిఘా పరిధిలోకి తీసుకురానుంది.



ఆన్‌బోర్డ్ చాయ్ వివరాలు కూడా

విదేశీ ప్రయాణాలు చేసే భారతీయులు చాలా వరకు ఆదాయపన్ను చెల్లించేవారే ఉంటారు. అయితే.. కొందరు ఎగవేతదారులు కూడా విదేశీ ప్రయాణాలు చేస్తున్నట్లు ఐటీ శాఖ అనుమానిస్తోంది. ఈ క్రమంలో విమాన టికెట్ పీఎన్ఆర్ నంబరుపై ఎంత మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు? బంధుమిత్రులను వెంట తీసుకెళ్తున్నారా? టికెట్‌ను ఎంతకు కొన్నారు? ఎలా కొన్నారు? బ్యాగేజీ బరువెంత? విమానంలో ఏం తిన్నారు(చాయ్ మొదలు వెజ్, నాన్‌వెజ్, లిక్కర్)? అనే వివరాలను కొత్త సంవత్సరంలో రికార్డు చేయనుంది.

విమానయాన సంస్థలకు ఆదేశాలు

ఈ వివరాల సేకరణకు ఐటీ శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. భారత్‌కు రాకపోకలు సాగించే అన్ని విమానయాన సంస్థలు దీన్ని వినియోగించాలంటూ సర్క్యులర్లు జారీ చేసింది. ఈ నెల 10వ తేదీ వరకు గడువిచ్చింది. ఆలోగా సాఫ్ట్‌వేర్‌లో లాగిన్ అవ్వని విమానయాన సంస్థలకు దేశంలోని విమానాశ్రయాల్లో ప్రవేశం ఉండబోదని హుకుం జారీ చేసింది. ప్రయాణికుల సమ్మతితో సంబంధం లేకుండా.. ఈ సమాచారాన్ని అందజేయాలని విమానయాన సంస్థలను ఆదేశించింది. రెండు విదేశీ విమానాయాన సంస్థల్లో ఈ విధానాన్ని ఫిబ్రవరి 25 నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. మార్చి 1 నుంచి అన్ని విమానయాన సంస్థలకూ ఈ విధానం అమలవుతుంది.

వ్యక్తిగత వివరాలు ఇవే..

విమానయాన సంస్థల నుంచి ఐటీ శాఖ సేకరించే వ్యక్తిగత వివరాల్లో ప్రయాణికుడి పేరు, పుట్టిన తేదీ, పాస్‌పోర్టు నంబర్, మొబైల్ ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ, విమాన టికెట్ కొనుగోలు తేదీ, టికెట్ కొనుగోలు చేసేందుకు వినియోగించిన క్రెడిట్ కార్డు నంబర్ వంటి వివరాలను సేకరించనుంది. ఈ సమాచారాన్ని కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి(సీబీడీటీ) విశ్లేషించి, సంబంధిత ఐటీ జోన్ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(సీఐయూ)కు పంపుతుందని సమాచారం. సీబీడీటీ ఇప్పటికే ఈ వివరాలను కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో సేకరిస్తూ.. పన్ను మోసాలు, జీఎస్టీ ఎగవేతలను నియంత్రిస్తోంది. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా కచ్చితత్వంతో సమగ్ర డేటా అందుతుందని ఐటీ శాఖ భావిస్తోంది.

నేటి నుంచి జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం

» 475 కాలేజీల్లో 1.48 లక్షల విద్యార్థులకు అమలు

» విజయవాడలో ప్రారంభించనున్న మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్రంలోని అన్ని జూనియర్ కాలేజీల్లో శనివారం నుంచి ప్రారంభం కానుంది. విజయవాడలోని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 475 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే 1.48 లక్షలమంది ఈ పథకం వల్ల నేరుగా లబ్ధి పొందనున్నారు. ఈ పథకంలో భాగంగా.. 398 కాలేజీలను సమీపంలోని పాఠశాలలకు అనుసంధానం చేశారు. ఆ పాఠశాలల్లో భోజనం తయారుచేసి కాలేజీలకు పంపుతారు. మిగిలిన 77 కాలేజీలను సెంట్రలైజ్డ్ కిచెన్‌లకు అనుసంధానించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరంలో మిగిలిన కాలానికి రూ.27.39కోట్లు ఖర్చు చేయనుంది. వచ్చే విద్యా సంవత్సరంలో రూ.85.84కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజన పథకం వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉంది. వైసీపీ ప్రభుత్వం దానిని రద్దుచేసింది. ఆ నిర్ణయం పేద విద్యార్థులపై ప్రభావం చూపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటర్ విద్యలో సంస్కరణలు ప్రారంభించింది. విద్యార్థుల సంఖ్యను పెంచడం లక్ష్యంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసింది. మధ్యాహ్న భోజన పథకం లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించింది. దీంతో ఈ పథకాన్ని తిరిగి అమల్లోకి తీసుకొస్తోంది. అలాగే వచ్చే ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందించాలని నిర్ణయం తీసుకుంది.

ఎల్లుండి నుంచి రాష్ట్రస్థాయి పాలీ టెక్‌ఫెస్ట్

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పాలీ టెక్‌ఫెస్ట్‌ను ఈనెల ఆరు నుంచి ఎనిమిదో తేదీవరకు విజయవాడలో నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శిస్తారని పేర్కొంది. గత ఏడాది డిసెంబరులో జిల్లాలవారీగా పాలీ టెక్‌ఫెస్ట్ నిర్వహించగా, 1302 ప్రాజెక్టులు ప్రదర్శించారని, వాటిలో 249 రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికయ్యాయని ఆ ప్రకటనలో వివరించింది. రాష్ట్రస్థాయి ఫెస్ట్‌లో వాటిని ప్రదర్శిస్తారని, న్యాయ నిర్ణేతలు బహుమతులకు ఎంపికైన వాటిని ప్రదర్శిస్తారని తెలిపింది. రాష్ట్రస్థాయిలో మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.50వేలు, ప్రోత్సాహక బహుమతి కింద ప్రతి విభాగానికి ఒకటి చొప్పున ఎంపిక చేసి రూ.25వేలు నగదు బహుమతి అందజేస్తారని పేర్కొంది. ప్రాంతీయ స్థాయిలో మొదటి విజేతకు రూ.25వేలు, రెండో విజేతకు రూ.10వేలు ఇస్తారని తెలిపింది.

'సూపర్ సిక్స్' అమలు చేశాకే ప్రజల్లోకి

» మత్స్యకార బహిరంగ సభలో మంత్రి అచ్చెన్న



తాళ్లరేవు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో 5లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి దోచేశాడని, ఆ అప్పులకు కూటమి ప్రభుత్వం నెలకు రూ.22వేల కోట్ల వడ్డీలు కడుతోందని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. శుక్రవారం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మత్స్యకారుల ఓఎన్‌జీసీ నష్టపరిహారం బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వం వెంటిలేటర్‌పై ఉందని, కేంద్రం సహకారంతో ఆక్సిజన్‌ను పీల్చుకుంటోందని వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ హామీలు అమలుచేశాకే ప్రజల వద్దకు వెళతామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20వేల పరిహారం సీఎం చంద్రబాబు ఇవ్వనున్నారని, కూటమి ప్రభుత్వానికి మత్స్యకారులంతా అండగా ఉండాలన్నారు. అనంతరం ఓఎన్‌జీసీ అందించిన రూ.148 కోట్ల 37లక్షల 18,500ల చెక్కును అచ్చెన్నాయుడు మత్స్యకారులకు అందించారు.

జగన్ అర్జీలు తీసుకొని ఏం చేస్తారు?: యార్లగడ్డ

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 'పులివెందుల మరికొన్ని చోట్ల జగన్ ప్రజల నుంచి అర్జీలు తీసుకొంటున్నారు. తీసుకొని ఏం చేస్తారు? వాటిపై అసెంబ్లీలో మాట్లాడతారా? సమాధానం చెప్పాలి' అని టీడీపీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే వాట్సాప్ కాల్స్ నుంచి మామూలు ఫోన్లు మాట్లాడుకొనే పరిస్థితికి ప్రజలు వచ్చారని, జగన్ హయాంలో ప్రజలు ఎంత స్వేచ్ఛను ప్రజలు కోల్పోయారో ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఆరు నెలల పాలనలో ఎవరేం చేశారో ప్రజల ముందు చర్చించడానికి దమ్ముంటే వైసీపీ నేతలు బహిరంగ చర్చకు రావాలని యార్లగడ్డ సవాల్ విసిరారు.

జగన్ పాలనలో 13 లక్షల ఎకరాలు హాంఫట్: మర్రెడ్డి

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సకల శాఖల మంత్రిగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి దోచుకొన్న ప్రభుత్వ ఆస్తులు కక్కిస్తామని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. 'కడప, అన్నమయ్య జిల్లాల్లో సజ్జల, ఆయన కుటుంబం వందల ఎకరాల అటవీ, ప్రభుత్వ భూములను కబ్జా చేసి అనుభవిస్తోంది. జగన్ పాలనలో వివిధ రకాల భూములన్నీ కలిపి 13లక్షల ఎకరాలు కాజేశారు. ఇందులో 4.50 లక్షల ఎకరాలు అధికారికంగానే అన్యాక్రాంతమయ్యాయి. రాష్ట్రాన్ని ఏ స్థాయిలో దోచుకొన్నారో చెప్పడానికి ఇదే ఉదాహరణ' అని అన్నారు. 'సజ్జలకు చిత్తశుద్ధి ఉంటే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి. తమ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములు అప్పగించాలి. లేనిపక్షంలో శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉండాలి' అని హెచ్చరించారు.

మాట్లాడేటప్పుడు కంట్రోల్‌లో ఉండాలి

» జేసీ ప్రభాకర్‌రెడ్డిపై మంత్రి సత్యకుమార్ ఫైర్

అమరావతి, గుంటూరు మెడికల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): 'తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి మాట్లాడేటప్పుడు కంట్రోల్‌లో ఉండాలి. మీడియా అటెన్షన్ కోసం ఏదేదో మాట్లాడటం సరైన పద్ధతికాదు' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. 'జేసీ టీడీపీ అధికార ప్రతినిధి అవునో కాదో తెలీదు. ఆయన ఎందుకు ఇలాంటివి మాట్లాడుతూ ఉంటాడో తెలీదు. ఆయన అటువంటి భాషను ప్రయోగించడం మంచిది కాదు. ఆయన వయస్సుకు అస్సలు మంచిది కాదు. బీజేపీ ప్రభుత్వం తమ బస్సులను కాల్చిందని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. జేసీ ప్రభాకరరెడ్డికి మాజీ సీఎం జగన్‌పై ప్రేమ ఉంటే వెళ్లి ఆయన పంచన చేరమనండి. ఎవరు ఏం దుస్తులు ధరించాలి? ఎవరు ఏం మాట్లాడాలో ఆయన నిర్ణయిస్తే ఎట్లా? వివాదాల్లోకి వెళ్లడం ఆయనకు అలవాటు కానీ మాకు లేదు' అని మంత్రి అన్నారు.



కుక్కునూరులో నిర్వాసితులు, పార్టీల నాయకుల సంబరాలు

ఇన్నేళ్ల తర్వాత న్యాయం

నా బ్యాంకు ఖాతాలో వ్యక్తిగత పునరావాస పరిహారం కింద రూ.6.36 లక్షలు జమయ్యాయి. 2022లో గోదావరి వరదలకు మా ఇళ్లు మొత్తం కొట్టుకుపోవడంతో రెండేళ్లుగా పునరావాస కాలనీలోనే నివాసం ఉంటున్నాను. అప్పటి నుంచి ప్యాకేజీల కోసం ఎదురు చూస్తున్నాం. ఇన్ని రోజుల తర్వాత పరిహారం అందడంతో మాకు న్యాయం జరిగింది.

- పటాన్ వల్లిబాషా, కుక్కునూరు ఏ బ్లాక్ నిర్వాసితుడు.

చంద్రబాబు రాకతో మేలు

ఏటా గోదావరి వరదలు రాగానే ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కాలనీకి వెళ్లాల్సి వస్తోంది. మళ్లీ గోదావరి వరదలు తగ్గిన తర్వాత ఇంటికి వస్తున్నాం. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నాం. మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం రావడంతో నిర్వాసితులకు మేలు జరుగుతోంది.

- పిచ్చుక రాజు, ఉపసర్పంచ్, కుక్కునూరు

పరిహారం పండగ

(మొదటి పేజీ తరువాయి)

వచ్చాయి. 41.15 కాంటూరు లెవెల్‌లో ఉన్న నిర్వాసిత గ్రామాలకు.. వ్యక్తిగత పునరావాస పరిహారం, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం, పునరావాస కాలనీలో ఇళ్లు వద్దనుకున్న వారికి ఈ మొత్తం పరిహారం కింద జమ అవుతుండడంతో నిర్వాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'ఏదో ఒక పరిహారం ఖాతాలో పడుతుందనుకున్నాం. కానీ ఇలా పూర్తిస్థాయిలో జమ కావడం కొత్త సంవత్సర కానుకే' అని అభివర్ణిస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో వ్యక్తిగత పరిహారం పేరిట జగన్ అండ్ కో నాటకాలాడారు. ఇది నమ్మి ఓట్లు కుమ్మరించడంతో పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ ఘనవిజయం సాధించింది. అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత కూడా వ్యక్తిగత పరిహారం రూ.పది లక్షలకు పెంచుతామని జగన్ ప్రభుత్వం ప్రకటనలు గుప్పించింది. కానీ పైసా ఇవ్వలేదు. చివరకు 2024 ఎన్నికలకు ఆరు నెలలు ముందు.. మరోసారి పరిహారం పెంచి ఆ సొమ్మంతా జమ చేస్తున్నట్లు ప్రకటించి.. ఒకరిద్దరి ఖాతాల్లో వేసి.. మిగతా వారిని వలలో వేసుకునే ప్రయత్నాలు చేశారు. అయితే ఇదంతా ఓట్లు దండుకోవడానికి వైసీపీ పన్నాగంగా గమనించిన ఓటర్లు.. చుక్కలు చూపించారు. పోలవరంలో టీడీపీ కూటమి అభ్యర్థిని గెలిపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత పోలవరం ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కింది. పనులు వేగం పుంజుకున్నాయి. ఇప్పుడు నిర్వాసితులకు రూ.815 కోట్లు జమయ్యాయి. దేవీపట్నం మండలంలో 567 నిర్వాసిత కుటుంబాల ఖాతాల్లో శుక్రవారం రూ.37.45 కోట్లు పడ్డాయి. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడుతో పాటు మిగతా ప్రాంతాల్లోనూ పరిహారం జమయింది. పునరావాస కాలనీల్లో ఇల్లు వద్దనుకున్న ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల 85 వేలు, అదే కాలనీలో స్థలం వద్దనుకునే వారికి రూ.లక్ష చొప్పున ఇంతకు ముందే ప్రకటించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా ఆయా కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ఆరంభమైంది. ఎవరిరెవరికి ఎంత మొత్తం పడిందో పూర్తి వివరాలు శనివారం వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఊరూరా సంబరాలు..

ఎవరూ ఊహించని విధంగా పరిహారాలు జమవుతుండడంతో నిర్వాసిత గ్రామాలు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నాయి. ఊరూరా సంబరాలు జరుపుతున్నాయి. ముఖ్యంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు జేజేలు పలుకుతూ వారి చిత్రపటాలు, ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేశారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఏలూరు జిల్లా కుక్కునూరులో భారీ ప్రదర్శన చేపట్టారు. పాలాభిషేకం చేసి, బాణసంచా కాల్చారు. నిర్వాసితులతో పాటు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, బీజేపీ నాయకులు లక్ష్మణాచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలవరం మండలం టేకూరు, మాధాపురం, కోండ్రుకోట తదితర గ్రామాలకు ఇతర మండలాలకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారాలు, ఇళ్ల పరిహారాలు, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.2.85 లక్షలు, మృతి చెందిన లబ్ధిదారుల నామినీలకు పరిహారాలను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. 95 శాతం పరిహారాలు అందాయి. గిరిజనులకు రూ.7.11 లక్షలు, గిరిజనేతరులకు రూ.6.36 లక్షల చొప్పున ఖాతాల్లో పడ్డాయి. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్న 567 కుటుంబాల ఖాతాల్లో రూ.3.74 కోట్లు జమయ్యాయి. దీంతో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్వాసితులు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభలతో కూడిన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

రాష్ట్రప్రభుత్వం నుంచే..

పోలవరం పనుల పూర్తికి రూ.12,157 కోట్లు అడ్వాన్సుగా ఇవ్వాలని సీఎం చంద్రబాబు గతంలో ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్‌లను కోరడం.. కేంద్ర కేబినెట్ కూడా అందుకు సమ్మతించడం.. ముందస్తుగా రూ.2,300 కోట్లు విడుదల చేయడం తెలిసిందే. ప్రత్యేక ఖాతా తెరిస్తే అందులో ఈ మొత్తం జమ చేస్తామని కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. అయితే రాష్ట్ర జలవనరుల శాఖ రూ.300 కోట్లే చేసింది. విగతా మొత్తాన్ని ఇతర అవసరాలకు ఖర్చుచేసింది. ఈ నేపథ్యంలో తామిచ్చిన మొత్తం ప్రత్యేక ఖాతాలో వేస్తేనే తదుపరి నిధులు విడుదల చేస్తామని కేంద్రం తేల్చిచెప్పడంతో రాష్ట్రం గురువారం రూ.815 కోట్లను అందులో జమచేసింది. దీని నుంచే ఇప్పుడు నిర్వాసితుల ఖాతాలకు డబ్బు పడుతోంది.



సీఎం చంద్రబాబు భద్రత కోసం కొత్తగా స్టేట్ సెక్యూరిటీ గార్డుల (ఎస్ఎస్‌జీ)ను ఏర్పాటు చేశారు. శుక్రవారం సీఎం కాన్వాయ్‌లో పాల్గొన్న ఎస్ఎస్‌జీ కమాండోలు



జనసేన ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లపై కోర్ కమిటీ సమావేశంలో చర్చిస్తున్న పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

పిఠాపురంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం

» మార్చి 12,13,14 తేదీల్లో నిర్వహణ

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పిఠాపురంలో మూడు రోజుల పాటు నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. శుక్రవారం జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ(పీఏసీ) సమావేశాన్ని విజయవాడలో నిర్వహించారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రతిపాదన మేరకు మేరకు మార్చి 12, 13, 14 తేదీల్లో పిఠాపురంలో ప్లీనరీ నిర్వహించాలని తీర్మానించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాల్లో పార్టీ సిద్ధాంతాలు, పవన్ ఆశయాలు ప్రజలకు ఏ విధంగా చేరాయో వివరించడంతో పాటు భవిష్యత్తులో ఏ విధంగా ముందుకు వెళ్లాలో నిర్దేశించేలా ప్లీనరీ సాగాలని కమిటీ భావించింది. ఇందుకోసం పార్టీ నాయకులు, మేధావుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలని, ప్లీనరీ నిర్వహణకు వివిధ కమిటీలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. మార్చి 12 ఉదయం ప్లీనరీ ప్రారంభోత్సవ కార్యక్రమం కేవలం అతిథులతో, 14న బహిరంగ సభ నిర్వహిస్తారు.

అధికారంలోకి వచ్చాక ప్రభుత్వానికే ప్రాధాన్యం

పార్టీ, కేడర్ పరిస్థితిపై పీఏసీలో లోతైనచర్చ జరిగింది. కొంతమంది నేతలు క్షేత్రస్థాయిలో కేడర్ అభిప్రాయాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. నిర్మొహమాటంగా వ్యక్తీకరించిన ఆ అభిప్రాయాలను పార్టీసైతం అంగీకరించింది. 'అధ్యక్షునితో పాటు పార్టీలో కీలకమైన వారంతా కేడర్, పార్టీకి దూరమయ్యారు. ఎన్నికల ముందు జిల్లాల్లో కేడర్ మొత్తం ఉత్సాహంతో పని చేసింది. కూటమి పార్టీల గెలుపు కోసం తీవ్రంగా కృషి చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి పార్టీ కంటే ప్రభుత్వానికే అధిక ప్రాధాన్యం ఇచ్చాం. దీనివల్ల జిల్లాల్లో కేడర్ తీవ్ర నిరాశలో ఉంది. ఇప్పుడు మూడురోజుల పాటు పిఠాపురంలో ప్లీనరీ నిర్వహిస్తే ఆశించిన స్థాయిలో కేడర్ రాకపోవచ్చు. గ్రామ, మండల స్థాయిల్లోనే కాదు... జిల్లా స్థాయిలోనూ కూటమిలో జనసేన పార్టీ నాయకులకు ఆశించిన స్థాయిలో గుర్తింపు లభించడం లేదు' అని కుండ బద్దలు కొట్టారు. 'పార్టీ అధ్యక్షుడు ప్రతి నెలా కేడర్ కోసం సమయం కేటాయిస్తేనే ఇలాంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. కూటమి నాయకులు కూడా జనసేనలోని జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులకు గుర్తింపు ఇస్తారు. ముందుగా పార్టీ కార్యాలయాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి. నెలల తరబడి పార్టీ కార్యాలయంలోకి కేడర్‌కు ఎంట్రీ లేకపోతే చాలా ఇబ్బందులు వస్తాయి. జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిల విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలి' అని వారు విస్పష్టంగా తెలిపారు. క్షేత్రస్థాయి నేతలు వ్యక్తం చేసిన పై అభిప్రాయాలతో అగ్రనాయకత్వమూ ఏకీభవించింది. అయితే వేటికీ సమాధానం ఇవ్వలేని పరిస్థితుల్లో మౌనంగా ఉండిపోయిందని సమాచారం.

ఆలోచనలే పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

కీలకోపన్యాసం చేశారు. మహాసభల సావనీర్‌ను, తెలుగు ఏంజెల్స్ లోగోను ఆవిష్కరించారు. డబ్బుకన్నా ఆలోచనలే పెట్టుబడిగా పెట్టి సంపద సృష్టించవచ్చన్నారు. "1996లో నేను సీఎం అయ్యేనాటికి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. ఆ సమయంలో భారీ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చింది. దీనిపై దుబాయ్ ప్రభుత్వంతో సంప్రదించా. హైటెక్స్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిస్తే ఎమ్మార్ ప్రాపర్టీస్‌లో విల్లాలకు స్థలం ఇస్తామని ప్రతిపాదించా. అంతే, ఒక్క పైసా ఖర్చుపెట్టకుండా హెచ్ఐసీసీ ఆవిర్భవించింది. హైదరాబాద్ అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ పాత్ర కీలకం. నాడు విజన్ 2020ను ప్రతిపాదిస్తే కొందరు ఎగతాళి చేశారు. 20 ఏళ్ల కిందట ఈ ప్రాంత అభివృద్ధికి వేసిన పునాదుల ఫలితంగానే ఇప్పుడు తెలంగాణ దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయమున్న రాష్ట్రంగా ఎదిగింది. దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన పీవీ నరసింహారావు తెలుగు బిడ్డ కావడం మనకు గర్వకారణం. ఆయన చేపట్టిన సంస్కరణలను నేను అందిపుచ్చుకుని ఐటీ రంగానికి ప్రాధాన్యమిచ్చా. ఇప్పుడు అమెరికాలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్నది తెలుగు వారికే. 2023-24లో మనదేశం నుంచి 3.30 లక్షల మంది విద్యార్థులు అమెరికా వెళితే అందులో 50 శాతం తెలుగువారే. నాలెడ్జ్ ఎకానమీ తెలుగువారి సొంతం" అని చంద్రబాబు చెప్పారు. ఉద్యోగాలు, వ్యాపారాల కోసం ఏ దేశానికి వెళ్లినా జన్మభూమిని మరచిపోవద్దని, సొంత ప్రాంతానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ విజన్-2047 ప్రతిపాదిస్తే తాను 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌ను ప్రతిపాదించినట్లు చంద్రబాబు చెప్పారు. ఐటీ రంగం ఇప్పుడు మరో దశకు చేరుకుందని, అదే కృత్రిమ మేధ(ఏఐ) అని తెలిపారు. ప్రతి ఇంట్లో ఒక ఐటీ నిపుణుడు ఉండడమేగాక ప్రతి ఇల్లూ ఏఐని వినియోగించుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది నుంచి వాట్సాప్ గవర్నెన్సును అందుబాటులోకి తెచ్చామన్నారు. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. తెలుగుజాతికి ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌దని, పొట్టి శ్రీరాములు దీక్ష వల్లే ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిందని, అలాంటి మహనీయులను గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమ ప్రపంచ మార్కెట్‌లో భాగస్వామిగా ఎదిగే స్థాయికి చేరడం ప్రశంసనీయమన్నారు.

దక్షిణాదిన జనాభా తగ్గుతోంది

దక్షిణాదిన జనాభా తగ్గుతోందని చంద్రబాబు అన్నారు. 2047 తర్వాత మనదేశంలో వృద్ధులే ఎక్కువగా ఉంటారని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ వంటి దేశాలు మన దేశం నుంచి మనుషులను పంపించమని కోరుతున్నాయని.. అలాంటి దుస్థితి మనకు రాకూడదని అన్నారు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరూ ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారని.. 'నో కిడ్స్.. బెటర్ ఎంజాయ్' అనే పాలసీతో వెళుతున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

తెలుగురాష్ట్రాల అభివృద్ధిలో యువత కీలకం: ఇందిరా దత్

తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కీలకమని ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వి.ఎల్. ఇందిరాదత్ అన్నారు. ఇందుకోసం రెండు ప్రభుత్వాలు సహకరించుకోవాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలను సంఘటితం చేయడమే సమాఖ్య లక్ష్యమని చెప్పారు.

విమానాశ్రయాలకు తెలుగుదనం

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలు, రహదారుల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి, రాష్ట్ర ఏవియేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. "రాష్ట్ర రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా గన్నవరం విమానాశ్రయాన్ని తయారుచేయాలి. ఈ ఏడాది జూన్ నాటికి విస్తరణ పనులన్నీ పూర్తికావాలి. ఈ విమానాశ్రయంలోకి బయట నుంచి వచ్చినవారికైనా, గన్నవరం నుంచి వెళ్తున్నవారికైనా రాష్ట్ర నృత్య సంప్రదాయం కళ్లకు కట్టినట్టు కనిపించాలి. భోగాపురం విమానాశ్రయం పనులు వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి. ఈ విమానాశ్రయంలోకి ప్రవేశించగానే కూచిపూడి నృత్యభంగిమలతో కూడిన చిత్రాలూ .. ఆకృతులూ కనిపించేలా అందంగా ముస్తాబు చేయాలి" అని సీఎం నిర్దేశించారు. కాగా, గన్నవరం .. భోగాపురంతోపాటు... దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం, నాగార్జున సాగర్, తుని-అన్నవరం, తాడేపల్లి గూడెం, ఒంగోలు.. ఇలా ఏడు చోట్ల కొత్తగా చేపడుతున్న విమానాశ్రయాలపైనా ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. శ్రీకాకుళంలో విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన భూమి విషయంలో స్పష్టతను ఇచ్చేలా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు దీనిపై పని చేయాలని చంద్రబాబు కోరారు. దగదర్తి, కుప్పం, శ్రీకాకుళంలో ప్రీఫీజబిలిటీ పూర్తయిందని అధికారులు వివరించారు.



రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధి, నిర్మాణాలపై సీఎం చంద్రబాబు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కేంద మంత్రి రామ్మోహన్‌నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

ఏడు... అడుగులు

- కుప్పంలో ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సందర్శించింది. ఫీజిబిలిటీ (సాధ్యాసాధ్యాలు) నివేదికను అందించింది. దీనిపై అథారిటీ నుంచి ఎన్‌ఓసీ రావాల్సి ఉంది. అవసరమైన 1,250 ఎకరాల భూమిని ఏఏఐ గుర్తించింది. ఆ భూమిని కలెక్టరు అప్పగించారు. తొలిదశలో 483 ఎకరాలను రన్‌వే కోసం అందించారు. రెండోదశలో 567 ఎకరాలను భవన నిర్మాణాల కోసం సిద్ధం చేశారు.
- శ్రీకాకుళం విమానాశ్రయం కోసం 1,383.71 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించారు. రన్‌వే కోసం 480.46 ఎకరాలు, విమానాశ్రయం కోసం 525 ఎకరాలు ప్రాథమికంగా సేకరించాలని భావించారు.
- దగదర్తి విమానాశ్రయ నిర్మాణాన్ని తెలుగుదేశం ప్రభుత్వమే ప్రారంభించింది. 1,379 ఎకరాల్లో నిర్మించాలని అప్పట్లో కార్యాచరణను రూపొందించారు. అందులో 635 ఎకరాల కోసం భూసేకరణను తెలుగుదేశం ప్రభుత్వం గతంలోనే చేపట్టింది. మరో 745 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ విమానాశ్రయానికి అనుమతులన్నీ ఉన్నాయి. ఈ ప్రాంతంలో బీపీసీఎల్ రిఫైనరీ వస్తోంది. వీటికితోడు ఈ ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి చెందనుంది. దీన్నిదృష్టిలో ఉంచుకుని శ్రీసిటీ సెజ్‌లో ఎయిర్ స్ట్రిప్‌ను కూడా తేవాలన్న యోచనలో సీఎం చంద్రబాబు ఉన్నారు.
- ఒంగోలు ఎయిర్‌పోర్టు కోసం 657 ఎకరాలను గుర్తించారు. దీనిపై ఫీజిబిలిటీని అధ్యయనం చేయాల్సి ఉంది.
- నాగార్జునసాగర్ వద్ద 1,570 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక్కడ 500ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. ఇందుకు అటవీ శాఖ అనుమతులు తీసుకోవాలి.
- తాడేపల్లి గూడెం ఎయిర్‌పోర్టును 1,123 ఎకరాల్లో నిర్మాణం చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేశారు. దీనికి సమీపంలో అటు రాజమండ్రి, ఇటు గన్నవరం ఉన్నాయి. దీంతో ఇక్కడ ఫీజిబిలిటీ సమస్యగా మారింది.
- అన్నవరం-తుని మధ్య ఎయిర్ పోర్టును నిర్మించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఇక్కడ రైల్వేలైన్, జల వనరులు ఉన్నాయని అధికారులు చెప్పారు. అనకాపల్లి జిల్లాలో కొత్త పరిశ్రమలు వచ్చే వీలుంది. నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్, సిటీ విస్తరణ జరుగుతోంది. ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు పెడితే అనుకూలంగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయం వ్యక్తంచేశారు. అనకాపల్లి, కాకినాడ, విశాఖలకు దగ్గరలో ఎయిర్‌పోర్టు వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

బ్రిటన్ పర్యటనకు అనుమతి కోసం సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో ప్రథమ నిందితుడిగా ఉన్న మాజీ సీఎం జగన్.. విదేశీ పర్యటనకు అనుమతి కోరుతూ నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 11 నుంచి 25 వరకు యూకేలో పర్యటించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిని వ్యతిరేకిస్తూ సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. దీంతో తదుపరి విచారణను కోర్టు ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసింది.

వాసుదేవరెడ్డి పిటిషన్ మరో బెంచ్ ముందుకు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మద్యం బాటిళ్లపై అతికించే సెక్యూరిటీ హోలోగ్రామ్‌ల తయారీ, సరఫరా కాంట్రాక్టు టెండర్ అప్పగింత కుంభకోణంలో సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నుంచి వైదొలుగుతున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. వ్యాజ్యం మరో బెంచ్ ముందు విచారణకు వచ్చేలా చర్యలుతీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించారు. విచారణ 7కి వాయిదా వేశారు.

పోలీసు విచారణకు తులసిబాబు గైర్హాజరు

ఒంగోలు(క్రైం), జనవరి 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కామేపల్లి తులసిబాబు పోలీసు విచారణకు గైర్హాజరయ్యారు. శుక్రవారం విచారణకు హాజరుకాలేనని, ఈ నెల 6, 7 తేదీలల్లో హాజరవుతానని విచారణాధికారి అయిన ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌కు లేఖ రాశారు.

ఎల్లుండి విచారణకు రండి!

(మొదటి పేజీ తరువాయి)

ఆయనకు నోటీసు ఇచ్చింది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయన్న కారణం చూపి విజయసాయి అప్పట్లో విచారణకు హాజరుకాలేదు. తాజాగా మరోసారి ఆయనకు నోటీసులు అందజేసింది వైసీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాకినాడ సీపోర్టు వ్యవహారంలో మనీలాండరింగ్ అక్రమాలు జరిగినట్టు ఈడీ ఇప్పటికే ప్రాథమిక నిర్ధారణ వచ్చింది. వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి, 'అరబిందో' డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డికి ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. విక్రాంత్‌రెడ్డి విచారణకు హాజరు కావాల్సి ఉండగా విచారణకు రాలేని విక్రాంత్‌రెడ్డి సమాచారం ఇచ్చారు. సీపోర్టులో తన వాటాలను బెదిరించి లాక్కున్నారని కేవీరావు ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ బలవంతపు 'డీల్'లో విజయ సాయిరెడ్డి, విక్రాంత్ రెడ్డిదే కీలక పాత్ర! ఈ వ్యవహారంలో భారీగా మనీ లాండరింగ్ కూడా జరిగినట్లు గుర్తించడంతో విక్రాంత్‌రెడ్డి, విజయసాయిరెడ్డికి ఈడీ నోటీసులు ఇచ్చింది.

పేదలకు ఆరోగ్య భీమా

(మొదటి పేజీ తరువాయి)

4.30 కోట్ల మంది పేదలకు ఉచితంగా రూ.25 లక్షలు విలువైన వైద్యసాయం అందుతుందని చెప్పారు. నిజానికి, ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్యబీమా అందిస్తామని గత ఎన్నికల్లో కూటమి పార్టీల నేతల హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజాగా ఆ హామీ అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనికోసం బీమా కంపెనీలు, నెట్‌వర్క్ ఆస్పత్రులతో చర్చించి.. మెరుగైన వైద్య విధానాల పరిశీలనకు దాదాపు పది రాష్ట్రాల్లో పర్యటించి.. చివరకు హైబ్రిడ్ విధానాన్ని ఎంచుకున్నారు. ఈ విధానం వివరాలను సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి వెల్లడించారు. బీమా కంపెనీలు, కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం, రాష్ట్రంలోని ఎన్టీఆర్ వైద్య సేవ పథకం హైబ్రిడ్ విధానంలో అనుసంధానం అవుతాయని మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ (పూర్వం ఆరోగ్యశ్రీ) పథకాన్ని వీలైనంత ఎక్కువ మందికి చేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. హైబ్రిడ్ విధానంలో బీమా కంపెనీలను ఎన్టీఆర్ వైద్యసేవ కార్యక్రమంలో భాగం చేసి, పథకం పనితీరును మెరుగుపరచనున్నట్లు చెప్పారు. ఆరోగ్య వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని కల్పించి, ఎక్కువ మంది పేద ప్రజలకు లబ్ధి చేకూర్చడమే హైబ్రిడ్ విధానం లక్ష్యమన్నారు.

ఆ ప్రచారంలో వాస్తవం లేదు

హైబ్రిడ్ విధానం ప్రవేశపెట్టడం వల్ల రూ.2.5 లక్షలలోపు ఇకపై ఉచిత వైద్యసేవలు అందబోవనీ, బీమా కంపెనీల రాకతో పేదలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి సత్యకుమార్ తెలిపారు. అలాగే, వైద్యసేవలను ట్రస్ట్ మోడల్ నుంచి బీమా మోడ్‌లోకి మారుస్తున్నట్లు జరుగుతుందన్న వదంతుల్లో కూడా నిజం లేదని చెప్పారు. ఈ విధానంలో పేదలు ఒక్క పైసా కూడా అదనంగా చెల్లించనక్కర్లేదని, వారి తరఫున బీమా కంపెనీలకు ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే కడుతుందని మంత్రి వివరించారు. పేదలకు ఎన్టీఆర్ వైద్యసేవ పథకం వల్ల కలుగుతున్న ప్రయోజనం యథాతథంగా అందుతుందని చెప్పారు.

అందుకే.. హైబ్రిడ్‌లోకి..

దాదాపు 10 రాష్ట్రాలోని ఉత్తమ వైద్య విధానాలను పరిశీలించిన తర్వాతనే హైబ్రిడ్ పద్ధతిలో వైద్య సేవలు అందించాలని నిర్ణయించామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. "వైద్య సేవల్లో 90 శాతం క్లెయిమ్‌లు రూ.2.5 లక్షల లోపే ఉంటున్నాయి. వాటిని బీమా సంస్థలు భరిస్తాయి. ఇందుకోసం 1.43 కోట్ల కుటుంబాలకు ముందుగానే ప్రీమియం చెల్లించి ఆరోగ్య భద్రత కల్పిస్తున్నాం. ఆపై...రూ.25లక్షలవరకూ క్లెయిమ్‌లను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ చెల్లిస్తుంది. ఇప్పటివరకూ వైద్య సేవలు అందించిన తర్వాతే ఆస్పత్రులకు బిల్లలు చెల్లిస్తున్నారు. ముందుగానే బీమా ప్రీమియం చెల్లించడం వల్ల బిల్లులు పెండింగ్‌లో ఉంటాయనే భయం నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఉండదు. ప్రీ-ఆథరైజేషన్ కోసం 24 గంటలు పట్టేది. దీనిని ఆరు గంటలకు కుదించేలా బీమా కంపెనీలతో మాట్లాడాం" అని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.

వారసత్వంగా రూ.2,225 కోట్ల బకాయిలు..

ఆరోగ్యశ్రీలో రూ.2,225 కోట్ల బకాయిలను గత ప్రభుత్వం తమకు వారసత్వంగా వదిలి వెళ్లిందని మంత్రి సత్యకుమార్ అన్నారు. "గత ప్రభుత్వంలో అక్రమాలు చేసిన ఆసుపత్రులకు ఐదేళ్లలో రూ.16 కోట్ల జరిమానా వేసి కనీసం 1 శాతం రికవరీ కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇలాంటి ఆస్పత్రులపై రూ.22.70 కోట్ల జరిమానాలు విధించాం. వాటిని నోటీసులు కూడా జారీ చేశాం. ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4 వేల కోట్లు కేటాయించాం. మాకు చిత్తశుద్ధి లేకపోతే ఈ కేటాయింపులు ఎలా జరుగుతాయి?" అని మంత్రి ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం ఐదేళ్లలో రూ.9,942 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని, ఏడాదికి రూ.1,988 కోట్లు మాత్రమే ఖర్చు చూపించిందని వివరించారు. ఆ బకాయిల్లో కూటమి ప్రభుత్వం రూ.1,350 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.



ఎప్పుడో మే, జూన్ నెలల్లో కనిపించే మామిడి పండ్లు అప్పుడే విజయవాడ మార్కెట్లోకి వచ్చేశాయి.





ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజయవాడ పోలీసులు హెచ్చరికలు చేస్తున్నారు. హెల్మెట్ లేనివారిని ఎక్కడికక్కడ ఆపేసి జరిమానాలు విధిస్తున్నారు. దీంతో నగరంలో హెల్మెట్లకు గిరాకీ పెరిగింది.

స్వర్ణాంధ్ర చేసి చూపిస్తా

సంపద సృష్టిలో ఏపీని ముందుకు తీసుకెళతా

- గణపతి సచ్చిదానందను దర్శించుకున్న సీఎం
- విజయవాడ ఆశ్రమంలో చంద్రబాబు పూజలు
- చంద్రబాబు మంచి కర్మయోగి: సచ్చిదానంద

విజయవాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): "నాపై విశ్వాసం ఉంచండి. స్వర్ణాంధ్ర ఎలా ఉంటుందో చేసి చూపిస్తా. ఎప్పుడూ వాస్తవాన్ని చెప్పే పరిస్థితిలో ఉండాలి. దీనికితోడు ఆధ్యాత్మికత ఎంతో అవసరం" అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. విజయవాడ పటమటలో ఉన్న గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సచ్చిదానంద స్వామితో ఏకాంతంగా భేటీ అయ్యారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. దీనికి ముందు స్వామిజీ చేపట్టే 53 దత్త క్షేత్రాల పర్యటనకు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పరివార నివాస సముదాయ భవన శిలాఫలకం ఆవిష్కరించారు. "సచ్చిదానంద స్వామిజీ సమాజం కోసం పనిచేస్తారు. నేను కష్టాల్లో ఉన్నప్పుడు యజ్ఞం చేశారు. స్వామిజీ తన భక్తుల కోసం దత్తక్షేత్రాలు ఏర్పాటు చేశారు. ఆయన వద్దకు వెళ్లినప్పుడు అక్క డే ఉండి పోవాలనిపిస్తుంది. అంతటి మనశ్శాంతి లభిస్తుం ది" అని చంద్రబాబు అన్నారు. స్వామిజీ ఇక్కడ ఉన్నంత వరకు అంతా శుభం జరుగుతుందని వ్యాఖ్యానించారు. 'ఆయనపై ఉన్న నమ్మకంలో కొంత నాపై చూపితే స్వర్ణాంధ్రను అందజేస్తాను" అని తెలిపారు. "విజన్ 2020ని చాలా మంది తప్పుబట్టారు. కానీ, దాని ఫలితాలను ఇప్పుడు చూస్తున్నారు. ఇప్పుడు విజన్ 2047 రూపొందించాను. సంపద సృష్టిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తాను" అని ఆయన తెలిపారు.

రాజ్యమేది అంటే అమరావతి: సచ్చిదానంద

చంద్రబాబు మంచి కర్మయోగి అని గణపతి సచ్చిదానంద స్వామి కొనియాడారు. కనకదుర్గమ్మ, పరమాత్ముడి సహకారంతో చంద్రబాబు అనుకున్న కార్యక్రమాలు సిద్ధించాలని ప్రార్థించారు. స్వర్ణాంధ్ర సంకల్పానికి భగవంతుడు శక్తి, ఆత్మస్థైర్యాన్ని ఇవ్వాలని గీత మాత, మరకత రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రార్థించారు. చంద్రబాబును తన కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నానన్నారు. "అన్ని పనులు తక్షణమే జరగవు. రాముడు రాజ్యానికి వచ్చిన తర్వాత అభివృద్ధికి ఐదేళ్లు పట్టింది. చెడును గెలవడానికి ఎన్నో ఏళ్లు పట్టింది. పదేళ్ల క్రితం ప్రారంభమైన అమరావతి మళ్లీ మనకు వచ్చేసింది" అని అన్నారు. అమెరికాలో మన రాజ్యమేది అని అడిగినప్పుడు విజయవాడ అని చెప్పాను.. ఇప్పుడు అమరావతి అని చెప్తానన్నారు. "నాలుగేళ్లుగా దత్త క్షేత్ర యాత్ర చేయలేదు. చంద్రబాబు రావడంతో మళ్లీ ఆ పర్యటన ప్రారంభించాను" అని స్వామిజీ అన్నారు.



గణపతి సచ్చిదానంద స్వామికి జ్ఞాపిక అందజేస్తున్న సీఎం

ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు: సీఎస్

అమరావతి, విశాఖపట్నం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో విస్తృత ఏరాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ.. ప్రధాని పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చూడాలని విశాఖపట్నం కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ బాగ్చిలను ఆదేశించారు. ఈ నెల 8న సాయంత్రం ప్రధాని మోదీ విశాఖ చేరుకుని ఆంధ్ర విశ్వవిద్యాలయం వరకూ రోడ్ షో నిర్వహిస్తారని తెలిపారు.

రూ.1.5 లక్షల కోట్ల పనులకు శంకుస్థాపనలు: డోలా

పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ రూ.1.5 లక్ష ల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఈనెల 5న జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను సమీక్షిస్తుందన్నారు. ప్రధానికి ఘన స్వాగతం పలికేందుకు అంతా సమన్వయంతో పనిచేస్తున్నామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చెప్పారు.

సంద్రంలో సాహసం

- 150 కి.మీ. అలవోకగా ఈదిన 52 ఏళ్ల స్విమ్మర్ శ్యామల
- ఆసియాలోనే మొదటి స్విమ్మర్‌గా ఘనత
- ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధి చెందాలి: శ్యామల



సముద్ర తీరంలో జాతీయ పతాకాన్ని చూపుతూ..

సర్పవరం జంక్షన్(కాకినాడ), జనవరి 3(ఆంధ్రజ్యోతి): నడి సముద్రంలో మహిళా స్విమ్మర్ గోలి శ్యామల సాహసం చేశారు. విశాఖ నుంచి కాకినాడ వరకు 150 కిలోమీటర్లు అవలీలగా ఈది రికార్డు సృష్టించారు. మహిళల ఆరోగ్యం, పర్యాటకరంగ అభివృద్ధి లక్ష్యంతో కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన 52 ఏళ్ల గోలి శ్యామల డిసెంబరు 28న విశాఖలోని ఆర్కే బీచ్ నుంచి ఈత ప్రారంభించారు. జనవరి 3వ తేదీ శుక్రవారం మధ్యాహ్నానికి కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌కు చేరుకున్నారు. ఆసియాలోనే ఈ లక్ష్యాన్ని సాధించిన మొదటి స్విమ్మర్‌గా అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. సముద్రంలో ప్రతిరోజూ సూర్యోదయం సమయంలో ఆమె ఈత ప్రారంభించేవారు. సూర్యాస్తమయానికి ఆపేసి రాత్రి విశ్రాంతి తీసుకునేవారు. దీని కోసం ఆమెకు సహకారంగా ఒక నేవీ బోటు వెంట వచ్చింది. స్విమ్మర్ శ్యామల మాట్లాడుతూ.. ఈ రికార్డుతో ప్రపంచంలోనే నాలుగో అంతర్జాతీయ స్విమ్మర్‌గా, దేశంలో నంబర్‌వన్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. భోజన విరామం కోసం మధ్యాహ్నం అరగంట బోట్‌లోకి వెళ్లి పెరుగు అన్నం, లిక్విడ్‌ని ఆహారంగా తీసుకున్నానని చెప్పారు. రాంబిల్లి సముద్రంలో తాబేళ్లు చక్కగా తనను వెంబడించడం ఆనందంగా ఉందని, జెల్లీ ఫిష్‌లు ఇబ్బంది పెట్టాయని తెలిపారు. తన బృందంలో ఒక డాక్టర్, ముగ్గురు సూపర్ డైవర్స్, ఫీడర్, అబ్జర్వర్ ఉన్నారని తెలిపారు. రోడ్డు మార్గంలో అంబులెన్స్ వచ్చిందన్నారు. ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధి చెందాలని, ఇతర దేశాల స్విమ్మర్లు ఇక్కడకు వచ్చి స్విమ్మింగ్ చేయాలని ఆకాంక్షించారు. వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

కాకినాడ తీరంలో ఘన స్వాగతం

సాహస యాత్ర పూర్తి చేసుకున్న స్విమ్మర్ శ్యామలకు కోరమాండల్ ఒడిస్సీ ఓషన్ స్విమ్మింగ్ ఆధ్వర్యంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ కమిషనర్ భావన, కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ప్రతి ప్రతినిధులు కాకినాడ తీరంలో ఘనస్వాగతం పలికారు. అభినందన సభలో ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ.. ఎంతటి క్లిష్టమైన సమస్య ఉన్నా కుంగిపోకుండా మహిళలంతా ధైర్యంగా, ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. శ్యామల సముద్రంలో అసమాన్య సాహస యాత్ర చేశారని చెప్పారు. గతంలో శ్రీలంక నుంచి రామసేతు వరకు, లక్షద్వీప్ వద్ద సముద్రంలో ఈది రికార్డు సృష్టించారని చెప్పారు.

ఇక ఏటా టీచర్ల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

వేసవిలో మాత్రమే బదిలీలు జరిగేలా చట్టం రూపొందిస్తున్నారు. ఇప్పటికే దీనిపై పలు దఫాలుగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపిన పాఠశాల విద్యాశాఖ.. నిబంధనలపై కొంత స్పష్టతకు వచ్చింది. వారం రోజుల్లో ముసాయిదా బిల్లును తయారుచేసి దానిపై మళ్లీ అభిప్రాయాలు తీసుకుని తుది రూపం ఇస్తుంది. సదరు బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ముసాయిదా బిల్లు ప్రకారం.. తప్పనిసరి బదిలీలకు టీచర్లకు 8 ఏళ్లు, ప్రధానోపాధ్యాయులకు 5 ఏళ్ల సర్వీసును ప్రామాణికంగా తీసుకోనుంది. ఏటా మే 31వ తేదీని కటాఫ్ తేదీగా పరిగణించి సర్వీసును లెక్కించే విధంగా బిల్లును రూపొందిస్తోంది. టీచర్లు విద్యా సంవత్సరాలను బదిలీలకు ప్రామాణికంగా తీసుకోవాలని కోరుతుంటే.. ప్రభుత్వం మాత్రం సాధారణ సంవత్సరాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించింది. జీరో సర్వీసు బదిలీలు ఉండాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. దానిపై ఇంకా స్పష్టత రావలసి ఉంది. సార్వత్రిక ఎన్నికలు, జనాభా గణన ఉంటే తప్ప ఇకపై ఏటా కచ్చితంగా బదిలీలు జరుగుతాయి. ప్రస్తుత విధానంలో ప్రభుత్వం టీచర్ల బదిలీలకు షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం, ఆ షెడ్యూల్ పదే పదే మారిపోవడం జరుగుతోంది. కొత్త చట్టం అమల్లోకి వస్తే ఇకపై న్యాయ వివాదాలకు తావు ఉండదని ప్రభుత్వం భావిస్తోంది.

విద్యా సంవత్సరాన్నే తీసుకోవాలి:నోబుల్ టీచర్లు

రాబోయే టీచర్ల బదిలీల్లో విద్యా సంవత్సరాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని.. ఆ తర్వాత బదిలీల్లో కటాఫ్ తేదీని తీసుకోవాలని నోబుల్ టీచర్ల సంఘం కోరింది. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, బి.హైమారావు శుక్రవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు.

మహిళా దినోత్సవంగా సావిత్రిబాయి జయంతి

సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వం రాష్ట్ర మహిళా దినోత్సవంగా ప్రకటించాలని నవ్యాంధ్ర టీచర్ల సంఘం అధ్యక్షుడు కరణం హరికృష్ణ కోరారు. తెలంగాణ తరహాలో వేడుకలు నిర్వహించాలన్నారు.

విద్యార్థుల చెంతకే ఆధునిక విజ్ఞానం

- 'ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్'ను రూపొందించిన ఇన్ఫోసిస్
- వాహనాన్ని పరిశీలించిన మంత్రి లోకేశ్



మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్‌లో పరికరాలను పరిశీలిస్తున్న లోకేశ్

అమరావతి, తాడేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంలోని విద్యార్థులకు వివరించే లక్ష్యంతో 'ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్'కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ సహకారంతో 'ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్'ను ప్రభుత్వం మంగళగిరిలో పైలట్ ప్రాజెక్టుగా అందుబాటులోకి తెచ్చింది. ఈ వాహనం ఇక్కడి స్కూళ్లకు వెళ్లి విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తుంది. ఆ తరువాత రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని స్కూళ్లకు ఇటువంటి వాహనాలను పంపిస్తారు. ఈ వాహనాన్ని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలో శుక్రవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బస్సులోని పలు పరికరాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ జి.గణేష్‌కుమార్, ఇన్ఫోసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా కోర్సులు నేర్చుకునే అవకాశం

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్ఫోసిస్ సంయుక్త సహకారంతో రాష్ట్రంలో ప్రారంభించి విద్యార్థులకు ప్రాథమిక నైపుణ్యాలు అందించడమే ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్ ముఖ్య ఉద్దేశం. 90 నిమిషాల వ్యవధిలో ఇంటరాక్టివ్ లెర్నింగ్ సెషన్ ఏర్పాటు చేస్తారు. అనంతరం విద్యార్థుల ఆసక్తిని బట్టి ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ప్లాట్‌ఫారం ద్వారా ఉచితంగా వివిధ కోర్సులు నేర్చుకోవడానికి అవకాశం కల్పించి వరల్డ్ క్లాస్ టెక్నాలజీ సర్టిఫికేట్ అందజేస్తారు. ఇందుకోసం ఇన్ఫోసిస్ సంస్థ రూ. 5 కోట్ల ఖర్చుతో ల్యాబ్‌తో కూడిన బస్సు ఏర్పాటు చేసింది. మొబైల్ ల్యాబ్‌లో ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, వర్క్‌స్టేషన్‌లు, ప్రయోగాల కోసం కిట్‌లతో సహా అత్యాధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. ఏటా రూ. 40 లక్షల నిర్వహణ వ్యయాన్ని ఇన్ఫోసిస్ భరిస్తుంది. విద్యార్థులకు ట్రైనర్ సపోర్టును ఇస్తారు. ఒక్కో విద్యార్థిపై సగటున రూ. 1,500 వరకు ఖర్చు చేస్తుంది. ఈ కార్యక్రమం కింద ప్రతి మూడు నెలలకు 4,800 మంది విద్యార్థులను చేర్చుకోవాలని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి రోజూ 20 మంది విద్యార్థులతో కూడిన 4 బ్యాచ్‌లకు అవగాహన కల్పిస్తామని ఇన్ఫోసిస్ తెలిపింది.

రఘురామ హత్యకు కుట్రలో

ప్రభావతి భాగస్వామి!

- వైద్య పరీక్షల నివేదికలను తొక్కిపెట్టారు
- హైకోర్టుకు ప్రాసిక్యూషన్ నివేదన
- ఆరోగ్య పరిస్థితి బాగున్నట్లు రిపోర్టు ఇవ్వాలని అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ఒత్తిడి
- ప్రభావతి బెయిల్‌కు అర్హురాలు కాదు
- సీనియర్ న్యాయవాది పోసాని వాదనలు
- ముందస్తు బెయిల్‌పై ముగిసిన విచారణ
- 10న నిర్ణయం వెల్లడిస్తామన్న కోర్టు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును హత్య చేసేందుకు పన్నిన కుట్రలో అప్పటి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ ప్రభావతి భాగస్వామి అయ్యారని ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు హైకోర్టుకు నివేదించారు. సీఐడీ కస్టడీలో ఉన్న రఘురామ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య నివేదిక ఇవ్వాలని కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ఒత్తిడి తెచ్చారని శుక్రవారం విచారణ సందర్భంగా తెలిపారు. వైద్యం అందకుండా చేసి రఘురామను అంతమొందించాలనేది అప్పటి సీఐడీ పోలీసుల ప్రణాళికగా పేర్కొన్నారు. ఆ కుట్రను ప్రభావతి కొనసాగించారని తెలిపారు. కస్టడీలో చిత్రహింసల ఆరోపణల నేపథ్యంలో జీజీహెచ్‌లో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి నివేదికను తమ ముందుంచాలని మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను ఆమె పట్టించుకోలేదని, రఘురామకు ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించాలన్న ఆదేశాలను కూడా పక్కన పెట్టి ఆయన్ను నేరుగా జైలుకు పంపించారని వెల్లడించారు. కోర్టు ఉత్తర్వుల పట్ల ప్రభావతికి గౌరవం లేదన్నారు. ఆస్పత్రిలోని ఇతర వైద్యులు రఘురామకు పరీక్షలు నిర్వహించి ఇచ్చిన నివేదికలను ఆమె తొక్కిపెట్టారన్నారు. డాక్టర్ల బృందంతో వైద్య పరీక్షలు నిర్వహించి నివేదికను తమ ముందుంచాలని ప్రభావతిని నాడు హైకోర్టు ఆదేశించిందని.. అయితే అరికాళ్లపై ఎడిమా మినహా ఆరోగ్య పరిస్థితి సవ్యంగా ఉందంటూ ఆమె తప్పుడు నివేదిక ఇచ్చారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సికింద్రాబాద్ ఆర్మీ ఆస్పత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో రఘురామ కాలి మునివేళ్లు చిట్లినట్లు వైద్యులు గుర్తించారన్నారు. అలాగే పోలీసులు కొట్టిన దెబ్బలకు నరాలు చిట్లి అంతర్గతంగా బ్లీడింగ్ జరుగుతున్నట్లు కూడా కనుగొన్నారని వివరించారు. రఘురామను కస్టడీలో చిత్రహింసలకు గురిచేసినట్లు సుప్రీంకోర్టు సైతం ప్రాథమికంగా నిర్ధారించిందని గుర్తుచేశారు. కేసు దర్యాప్తులో భాగంగా రఘురామ వైద్య పరీక్షల నివేదికలను దర్యాప్తు అధికారి విజయవాడ మెడికల్ బోర్డుకు పంపించారని.. ఎక్స్‌రే రిపోర్ట్‌లో రఘురామ మునివేళ్లు రాకుండా చేసినట్లు బోర్డు గుర్తించిందన్నారు. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన సీఐడీ అధికారులను కాపాడేందుకు ప్రభావతి అన్నివిధాలా ప్రయత్నించారని తెలిపారు. తన అధికార హోదాను అడ్డుపెట్టుకుని రికార్డులను తారుమారు చేశారని.. ముందస్తు బెయిల్ పొందేందుకు అనర్హురాలని పేర్కొన్నారు. ప్రభావతి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం ఇరుపక్షాల వాదనలు ముగియడంతో.. ఈ నెల 10న నిర్ణయం వెల్లడిస్తానని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు. అప్పటివరకు ఆమెపై ఎలాంటి తొందరపాటు చర్యలూ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.